www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 236 | శుక్రవారం 16-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ


ఢిల్లీలో సీపీఐ రాజకీయ ముసాయిదా తీర్మాన పత్రాన్ని విడుదల చేస్తున్న సురవరం, నారాయణ, డి.రాజా, గురుదాస్ గుప్తా, అతుల్ కుమార్ అంజాన్, షమీమ్ ఫైజీ

బీజేపీ పాలనను
తరిమికొడదాం..

సీపీఐ రాజకీయ ముసాయిదా తీర్మాన పత్రం విడుదల

విశాలాంధ్ర బ్యూరో – న్యూఢిల్లీ: దేశంలో ఫాసిస్టు ప్రమాదం పొంచి ఉన్న స్థితిలో అధికారం నుంచి బీజేపీని తొలగించడమే నేటి ప్రపథమ కర్తవ్యమని భారత కమ్యూనిస్టు పార్టీ న్యూఢిల్లీలో గురువారం విడుదల చేసిన ప్రకటనలో సుస్పష్టం చేసింది.

ఏప్రిల్‌లో కేరళలో జరగనున్న సీపీఐ 23వ మహాసభకు సమర్పించనున్న ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్. సుధాకరరెడ్డి గురువారం విడుదల చేశారు. ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలు పూర్తయ్యిందనీ, కార్పొరేట్ సంస్థలకు వరాలు గుప్పిస్తున్నారనీ, కీలక రంగాల్లో బహుళజాతి సంస్థలకు ద్వారాలు తెరిచారని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సాధనాలు మనదేశ ఆర్థికవ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశాయి. అదేసమయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మన దేశ రాజ్యాంగంపై, లౌకిక వ్యవస్థ పైనా, ప్రజాస్వామ్య వ్యవస్థల పైనా దాడులు చేస్తోంది. పర్యవసానంగా ఇది రాజకీయ సంక్షోభానికి దారితీస్తున్నదని సురవరం తెలిపారు.

ప్రభుత్వ విభాగాలన్నింటిలోనూ ఆర్‌ఎస్‌ఎస్ చొచ్చుకుపోతోంది. అధికార యంత్రాంగాన్ని స్వాహాచేస్తోంది. ఫాసిస్టు ప్రమాదం వాస్తవరూపం ధరిస్తోంది. అటువంటి స్థితిలో భారతీయ జనతాపార్టీని అధికారం నుంచి తొలగించడం ప్రథమ కర్తవ్యంగా సీపీఐ భావిస్తున్నదని ఆయన వివరించారు. నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్ క్యాపిటల్ ప్రయోజనాలకు, అభివృద్ధి నిరోధకం,

- మిగతా 11 లో

విషం కక్కిన విద్వేషం

ఫ్లోరిడా పాఠశాల్లో కాల్పులకు తెగపడ్డ విద్యార్థి

కొందరి పరిస్థితి విషమం

గన్ కల్చర్ చేసిన గాయం

17 మంది మృతి, 14 మందికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు


నిందితుడిని పట్టుకున్న పోలీసులు



అమెరికా : అమెరికాలో ఒక విద్యార్థి మారణ హోమం సృష్టించాడు. విద్వేషంతో తోటి విద్యార్థులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి దారుణంగా చంపాడు. ఫ్లోరిడా పార్క్‌ల్యాండ్‌లోని పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. మర్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ పాఠశాలలో పూర్వ విద్యార్థి నికోలస్ క్రూజ్(19) తుపాకీతో ప్రవేశించి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో 17 మంది మృతి చెందారు. 14 మందికి గాయాలయ్యాయి. స్కూల్ బిల్డింగ్ లోపల జరిపిన కాల్పుల్లో 12 మంది మృతి చెందారు. బిల్డింగ్ బయట ఇద్దరు. వీధిలో ఒకరు చనిపోగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు, అగ్నిమాపక

- మిగతా 2 లో


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన హరినాథ్‌రెడ్డి తదితరులు

బీజేపీ, టీడీపీ దొందూ దొందే

నేడు హైదరాబాద్‌లో జేఎఫ్‌సీ కీలక సమావేశం

హైకోర్టు తీర్పుతోనైనా టీటీడీ అధికారులకు బుద్ధి రావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

- వివరాలు 3 లో

నీరవ్ ఎప్పుడో
చెక్కేశాడు

ఎఫ్‌ఐఆర్ నమోదుకు ముందే విదేశాలకు ..

స్విట్జర్లాండ్‌లో ఉన్నట్టు సమాచారం



న్యూఢిల్లీ / ముంబై : బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన ప్రముఖ వజ్రాల వ్యాపారి, కోటీశ్వరుడు నీరవ్ మోడీ విదేశాలకు పలాయనం సాగించినట్టు సమాచారం. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.280కోట్ల కుంభకోణం జరిగినట్టు సీబీఐ జనవరి 29న ఫిర్యాదు చేసింది. అయితే అంతకుమందే.. అంటే జనవరి 1వ తేదీనే నీరవ్ దేశం విడిచి వెళ్లిపోయారని అధికారులు వెల్లడించారు. బెల్జియం పౌరసత్వంగల ఆయన సోదరుడు నిశాల్ కూడా అమెరికన్ అయిన తన భార్య అమీతో జనవరి 1నే దేశం విడిచి వెళ్లగా, వారి వ్యాపార భాగస్వామి మెహుల్ చోస్కీ (గీతాంజలి జ్యువలరీ చైన్ ఇండియన్ ప్రమోటర్) కూడా జనవరి 6న విదేశాలకు వెళ్లిపోయారని వెల్లడించారు. అయితే, మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదైన తర్వాత ఈ నలుగురి కోసం లుకవుట్ నోటీసులను దర్యాప్తు సంస్థ జారీ చేసినట్టు తెలిపారు. నీరవ్ మోడీ ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో ఉన్నట్టు సమాచారం ఉందని, జనవరి 23న దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరం సందర్భంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) విడుదల చేసిన ప్రధాని మోడీతో భారతీయ కంపెనీల సీఈవోల ఫోటోలో నీరవ్

- మిగతా 2 లో



నేపాల్ ప్రధానిగా
ప్రసాద్ ఓలి


ఎన్నికల్లో ఓటమితో దెవుబా రాజీనామా

కాట్మండు : నేపాల్ ప్రధానమంత్రిగా ఖడ్గప్రసాద్ ఓలీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. దేశాధ్యక్షురాలు వైద్యదేవి భండారి ఆయనచేత ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్ష భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని కాట్మండు పోస్టు తెలిపింది. దీనికి ముందు ప్రధాని షేర్‌బహదూర్ దెవుబా తన పదవికి రాజీనామా చేశారు. పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడిన తరువాత ఆయన రాజీనామా సమర్పించారు. ఖడ్గప్రసాద్ ఓలీ 2015లో ప్రధానిగా పని చేశారు. ఈ సందర్భంగా పదవీప్రమాణం చేసిన మంత్రులలో

- మిగతా 2 లో

రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆడుతున్న రాజకీయ చదరంగం తుది దశకు చేరుకుంది. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసినప్పటి నుంచి టీడీపీ, వైసీపీలు ఎత్తుకు పై ఎత్తులు వేసుకుంటూ రాజకీయాలను నడుపుతున్నాయి.

డెడ్‌లైన్ మార్చి 5



రెడీగా ఉండండి : బాబు

- వివరాలు 11 లో

అందరం రాజీనామా చేద్దాం : జగన్

- వివరాలు 11 లో

అప్పటికీ తేల్చకపోతే కటీఫ్

బీజేపీకి టీడీపీ అల్టిమేటం

విశాలాంధ్ర అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీజేపీ ఒంటెద్దు పోకడతో విసిగిపోయి తన పార్టీ ఎంపీలతో నిరసన కార్యక్రమాలు చేయించారు. బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిం దని టీడీపీ నేతలు విమర్శిస్తే వైసీపీ ఎంపీ విజయ్‌సాయిరెడ్డి బడ్జెట్ బాగుందని కితాబిచ్చారు. టీడీపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీలను స్వయంగా కలిసి ఏపీకి న్యాయం చేయాలని కోరినా వారు పెడచెవిన పెట్టారు. పార్లమెంటు ఉభయసభల్లో చెప్పిందే చెప్పారు తప్ప టీడీపీ ఎంపీలు చేసిన డిమాండ్లపై స్పష్టతనివ్వలేదు. టీడీపీ నేతలు

- మిగతా 2 లో

కరెన్సీకి కటకట

▸ బ్యాంకుల్లో 'నో క్యాష్' బోర్డులు ▸ అన్ని చోట్లా పనిచేయని ఏటీఎంలు

▸ 4 నెలలుగా పట్టించుకోని ఆర్బీఐ ▸ రైతులకు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

▸ రాష్ట్రవ్యాప్తంగా పైసల కోసం ఇక్కట్లు



విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: రాష్ట్రంలో కరెన్సీ కష్టాలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. నాలుగు నెలలుగా నగదు కొరత ప్రజలను తీవ్రంగా వెంటాడుతోంది. రిజర్వ్‌బ్యాంక్ నుంచి సరిపడనంతగా డబ్బు రాకపోవడం వల్ల అరకొర లావాదేవీలతో సరిపెడుతూ బ్యాంకులు కాలం వెళ్లదీస్తున్నాయి. అవసరాలకు అనుగుణంగా లక్షల్లో డ్రా చేద్దామనుకునేవారికి వేలల్లో ముట్టచెబుతున్నాయి. కాస్త పెద్దమొత్తంలో కావలసినవారైతే ఒకరోజు ముందుగా బ్యాంకు మేనేజర్లకు సమాచారం అందించాల్సి ఉంది. డబ్బు కోసం వేచి ఉండే వారితో దాదాపు అన్ని బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. ఏటీఎంలు లేని రోజుల్లో ఏవిధంగా బ్యాంకులు ఉండేవో ఆ పరిస్థితులు పునరావృతం అవుతున్నాయి. వివిధ బ్యాంకుల్లోని నగదును నిల్వ చేసే గదులు (చెస్ట్)లు నిండుకోవడంతో ఏటీఎంలన్నీ మూతబడ్డాయి. విదేశీ బ్యాంకులు తప్ప దేశీయ బ్యాంకులన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఏటీఎంల నుంచి రూ. 3వేలకు మించి నగదును డ్రా చేయడానికి అవకాశం లేదు. రోజువారి అవసరాల కోసం ఏటీఎంల నుంచి డబ్బును డ్రా చేసేవారు క్యూలలో గంటల కొద్దీ సమయాన్ని వెచ్చిస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. శివరాత్రి సందర్భంగా పలు శైవక్షేత్రాలకు వెళ్లిన భక్తులు చేతిలో నగదు లేక, పనిచేయని ఏటీఎంలను చూసి ఏం చేయాలో తెలియక అయోమయానికి లోనయ్యారు. ఏదైనా వస్తువుల కొనుగోలు విషయంలో క్రెడిట్, డెబిట్, రూపే కార్డులను వినియోగించడంలోనూ

- మిగతా 2 లో

ఇదీ లోకం!





యథావిధిగానే టెట్ ..

సెంటర్లలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు

ఇతర రాష్ట్ర సెంటర్ల అభ్యర్థులకు ఆప్షన్ సౌకర్యం

విశాలాంధ్ర అమరావతి: టెట్ ను యథావిధిగా ఈ నెల 21నుంచి మార్చి 3 వరకు నిర్వహిస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు గురువారం సచివాలయంలో ప్రకటించారు. అభ్యర్థులు తమ ఐచ్ఛికంగా సూచించిన సెంటర్లు కాకుండా ఇతర రాష్ట్రాల్లో కేటాయించడం, హాల్ టికెట్లలో తప్పులు ఇతర అంశాలపై విద్యాశాఖ అధికారులతో తన చాంబర్ లో సుదీర్ఘంగా సమీక్షించారు. ఇతర రాష్ట్రాల్లో సెంటర్లు కేటాయించడంపై అధికారులపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో తక్కువ పరీక్ష కేంద్రాలు, తక్కువ ఆన్ లైన్ కంప్యూటర్ సీటింగ్ కెపాసిటీ

- మిగతా 11 లో

కర్ణాటకలో బీజేపీకి ఓటమి భయం

యడ్యూరప్ప మానసిక రోగి

ఎన్నికల వేళ మాంసాహారం ఆరోపణలేమిటి?

9లో

నోటిఫైకి ఓకే

వ్యతిరేకించిన తెలంగాణ

అసంపూర్తిగా ముగిసిన కృష్ణా, గోదావరి బోర్డు సమావేశం



విశాలాంధ్ర బ్యూరో–న్యూఢిల్లీ కృష్ణా, గోదావరి జలాల పంపిణీపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నాయి. రెండు రాష్ట్రాలూ మెట్టు కూడా దిగడం లేదు. గురువారం ఢిల్లీలో జరిగిన సమీక్ష సమావేశంలోనూ ఇటువంటి వైఖరే స్పష్టమైంది. కృష్ణా, గోదావరి రెండు బోర్డుల పరిధిని నోటిఫై చేయాలనే అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. రెండు బోర్డులను నోటిఫై చేసేందుకు నదీ పర్యవేక్షణ బోర్డు సుముఖత వ్యక్తం చేసింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించగా.. తెలంగాణ వ్యతిరేకించింది. నీటి కేటాయింపులు జరిపిన తర్వాతే నోటిఫై చేయాలని తెలంగాణ మెలిక పెట్టింది. కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన రాష్ట్రాల నీటిపారుదల శాఖమంత్రుల సమావేశం న్యూఢిల్లీలో గురువారం జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ

- మిగతా 2 లో

జాకబ్ జుమా రాజీనామా

తాత్కాలిక అధ్యక్షుడుగా రాంఫోస

జోహాన్స్‌బర్గ్ : దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్‌జుమా ఎట్టకేలకు గురువారం రాజీనామా చేశారు. దీంతో పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి)లో నెలకొన్న సంక్షోభం తొలగిపోయింది. జుమాపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఆయనను తొలగించాలని కూడా పాలకపార్టీ భావించింది. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలను కూడా కోరింది. ఎఎన్‌సి జాతీయ నాయకత్వం మూడురోజులపాటు సమావేశమై జుమా రాజీనామాకు గట్టిగా ఒత్తిడి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారు. తక్షణం తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా జుమా చేసిన ప్రకటనను దేశవ్యాప్తంగా టెలివిజన్‌లో ప్రసారం చేశారు. 9 ఏళ్లపాటు ఆయన అధికారంలో ఉన్నారు. 2019 వరకు పదవిలో ఉండేందుకు అవకాశం ఉన్నప్పటికీ అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన రాజీనామా చేయవలసి వచ్చింది. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడు రాంఫోస నూతన అధ్యక్షుడిని పార్లమెంటు నియమించేవరకు తాత్కాలిక అధ్యక్షుడి బాధ్యతలను స్వీకరిస్తారని భావిస్తున్నారు. జుమా స్థానంలో రాంఫోసను నియమించాలని పాలకపార్టీ నిర్ణయించింది. అయినప్పటికీ జుమా రాజీనామాకు తిరస్కరిస్తూ వచ్చారు. రెండు నెలల క్రితమే రాంఫోసను నూతన అధ్యక్షుడిగా నియమించాలని ఎఎన్‌సి నిర్ణయించినప్పటికీ జుమా తన పట్టును విడువలేదు. జుమాపై అత్యాచార నేరారోపణలు ఉండటంవల్ల 2005లో ఆనాటి అధ్యక్షుడు తబోమెబెకి ఆయనను పదవినుంచి తొలగించారు. అయితే కోర్టులో ఆయనపై కేసు వీగిపోయింది. జుమా రాజీనామా వార్త విన్న దక్షిణాఫ్రికా ప్రజలు వీధుల్లోకివచ్చి వేడుకలు చేసుకున్నారు. ఆయనను పదవినుంచి తప్పించాలని ప్రజలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. జుమా తన మంత్రివర్గంలో అనేకమంది పలుకుబడి పదవులను తప్పించారు. అవినీతి చర్యల ద్వారా అనేక బిలియన్ డాలర్లను సమీకరించారన్న ఆరోపణలు జుమాపై ఉన్నాయి.



'షెల్' విధ్వంసాన్ని సమర్థించిన బ్రిటన్ కోర్టు

నైజీరియాలో పేదలకు శరాఘాతం



లండన్ : నైజీరియాలో జరిగిన సంఘటనను బ్రిటన్ కోర్టులో విచారణ జరపడానికి వీలులేదంటూ న్యాయమూర్తులు తిరస్కరించడంతో నైజీరియాలో పేదలకు శరాఘాతంవలె తాకింది. ప్రపంచంలోనే పెద్దదైన చమురు కంపెనీ షెల్ నైజీరియాలో విధ్వంసాన్ని సృష్టించింది. అక్కడ షెల్ కంపెని ముడి చమురును వెలికితీసే ప్రాంతాల్లో భూములన్నిటినీ కలుషితం చేసింది. భారీ మొత్తంలో చమురు బయటకి వచ్చి సుదూర ప్రాంతాల్లో భూములను పాడుచేసింది. ఆ ప్రాంతాల్లో నివసించే దాదాపు 50వేల మందికిపైగా పేదప్రజల ఆరోగ్యాలను తీవ్రంగా దెబ్బతీసింది. వారి జీవితాలను ఛిద్రం చేసింది. బ్రిటన్‌కి చెందిన కంపెని షెల్ సృష్టించిన విధ్వంసంవల్ల జీవితాలు బలైపోయిన ప్రజలకు నష్టపరిహారం చెల్లించవలసిందిగా కోర్టులో కేసు దాఖలయ్యింది.అయితే ఈ ఘటన నైజీరియాలో జరిగినందున ఇక్కడ విచారణ జరపడానికి వీలులేదని కోర్టు తిరస్కరించింది. నైజీరియా డెల్టా ప్రాంతమంతా వాతావరణ కాలుష్యంతో నిండిపోయింది. కార్పొరేట్ కంపెనీలు చేస్తున్న నేరాలను తీవ్రంగా తీసుకుని సామాజిక బాధ్యతతో పనిచేయవలసిన కోర్టులు నైజీరియా తమ పరిధిలోలేదని విచారణ తిరస్కరించడంతో అక్కడి ప్రజల దుస్థితిని పట్టించుకునవారు లేరనే భావన ఏర్పడింది. గిరిజన ప్రాంతంలోని ఒగలె తెగ ప్రజల రాజు గాడ్‌విన్‌బిబిఒక్పబి షెల్ కంపెనీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ కంపెనీ తమ ప్రజలను చంపివేస్తున్నదని 2011 నుంచి ఒగలె రాజరాక ప్రాంతంలో 23 సార్లు భారీగా చమురును చిమ్మిన సంఘటనలు జరిగాయి. వీటిపైన తమ దేశంలో న్యాయం జరగడంలేదు. షెల్ కంపెనీయే నైజీరియాగా, నైజిరియానే షెల్ కంపెనీగా మమేకమై ఉన్నది. అందువల్ల అక్కడ ఆ కంపెనీపైన ఎలాంటి చర్యలను తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధపడటంలేదు. షెల్ కంపెనీ ప్రభుత్వ పెద్దలకు భారీగా ముడుపులు చెల్లించింది. ఈ అంశం వచ్చేనెలలో ఇటలీ కోర్టులో బహిర్గతం కానున్నది. షెల్ కంపెనీ ప్రస్తుతం ఇటలీలో ఎని చమురు కంపెనీని నిర్వహిస్తున్న నైజీరియా ఇంధనశాఖ మంత్రి దాన్‌ఎటిటీకి ప్రభుత్వ అకౌంట్లద్వారా భారీగా ముడుపులు చెల్లించింది. షెల్ కంపెనీతో సుదీర్ఘకాలంగా ఎటిటీకి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 1990లలో శానిఅబచ నియంతృత్వ ప్రభుత్వంలో ఆయన ఇంధనశాఖ మంత్రిగా పనిచేశారు. కంపెనీ వాతావరణ కాలుష్యాన్ని కలిగిస్తున్నదని విస్తృతంగా ప్రచారం చేసిన సామాజిక కార్యకర్త కెన్‌సరోవివ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన షెల్ కంపెనీ కోర్టు వెలుపల పరిష్కారం కోసం 10 మిలియన్ పౌండ్లను చెల్లించింది. ఆ మొత్తాన్ని బాధితులకు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాలలో షెల్ కంపెని ఇలాంటి దుశ్చర్యలకే పాల్పడుతున్నదన్న విమర్శలను ఆ కంపెనీ తిరస్కరిస్తున్నది. ఈ కంపెనీ ప్రధాన కార్యాలయాలు నెదర్లాండ్సులో ఉన్నాయి. అయితే కంపెనీ ప్రధానంగా బ్రిటన్ స్థావరంగా పనిచేస్తున్నది. తాము సృష్టించే విధ్వంసాలకు బాధ్యత వహించకుండా తప్పించుకుంటున్న కంపెనీలకు షెల్ కంపెనీ తిరుగులేని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

కార్మికశక్తిని తక్కువ అంచనా వేయవద్దు

బ్రిటన్ టోరీ ప్రభుత్వానికి హెచ్చరిక



లండన్ : బ్రిటన్ టోరీ ప్రభుత్వం విభజించు పాలించు అనే రాజకీయాలను వదిలివేయాలని కార్మికుల అపారమైన శక్తిని తక్కువ అంచనా వేయవద్దని వారు తలచుకుంటే ప్రభుత్వం నిలవదని మార్గ్ మెక్‌హూగ్ హెచ్చరించారు. మార్క్సిజం సిద్ధాంతకర్త అయిన మార్క్ తాను రాసిన వ్యాసంలో ఈ హెచ్చరిక చేశారు. ప్రస్తుతం కార్మికులు అధ్వాన్నమైన జీవితాన్ని గడుపుతుండగా ఆయా కంపెనీల ఆదాయాలు అపారంగా పెరుగుతున్నకాలంలో జీవిస్తున్నాము. సంకుచిత ప్రయోజనాలకోసం అణగారిన వర్గాల ప్రజలకు పనిచేసే చోట్ల న్యాయాన్ని తిరస్కరిస్తూ పెద్దపెద్ద కంపెనీలకు ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను బలవంతంగా పొందుతున్నారు. అసమానమైన సమాజాన్ని నిర్మిస్తున్నారు. సమసమాజంకోసం ఇచ్చే పిలుపును వామపక్షాల లేదా మార్క్సిస్టు లేదా లెనినిస్టు సిద్ధాంతంగా ఒక లేబుల్‌ని వేసి తోసిపుచ్చుతున్నారు. మీడియా అత్యంత అవినీతిలో కూరుకుపోయివుంది. అత్యంత పలుకుబడి కలిగిన సంకుచిత ప్రయోజనాలుగల సంపన్నులచేతుల్లోకి మీడియా వెళ్లిపోయింది. ఈ స్థితిలో రాజకీయ మార్పులు ఎంతైనా అవసరం. బ్రిటన్‌లో హౌస్ ఆఫ్ లార్డ్స్ రోజు 300 పౌండ్లను పొందుతున్నారు. తాము ఎన్నికైన నియోజకవర్గాల ప్రజల పరిస్థితులు దారుణంగా ఉంటున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలలో మార్పు రావటంలేదు. ఈ స్థితిలో రాజకీయ మార్పు ఎంతైనా అవసరం. లేబర్ పార్టీకి జెరిమికార్బిన్ నాయకత్వం, స్కాట్‌లాండ్‌లో రిచర్డ్ లియోనార్డ్ నాయకత్వం న్యాయమైన ఆశలను రేకెత్తిస్తున్నది. అయితే వీరు మాత్రమే రాజకీయ మార్పు లక్ష్యాన్ని సాధించలేరు. కార్మికవర్గం వీరికి ఎంతైనా అవసరం. అయితే యువకులైన కార్మికుల పరిస్థితి ఏమిటి? వారి పరిస్థితి మెరుగుపడే అవకాశం కనిపించడంలేదు. వివక్షతో కూడిన వేతనాలను వారు పొందుతున్నారు. మెక్‌డానాల్డ్ కంపెనీలో కార్మికులు, కేంబ్రిడ్జి, క్రేఫోర్డ్‌లలో రెండు రెస్టారెంట్ల కార్మికులు సంఘటితమై తమ లక్ష్యాలను సాధించుకున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలి. ఈ సంస్థలలో కార్మికులు బ్రిటన్ యూనియన్లలో చేరి యూనియన్ మార్గదర్శకాన్ని కోరారు. అనంతరం అత్యంత సాహసమైన నిర్ణయాన్ని తీసుకుని సమ్మె ద్వారా ప్రపంచంలోనే అత్యంత క్రూరమైన సంస్థలను లొంగదీయగలిగారు. వారి సమస్యలను పరిష్కరించడమేగాక తొలగించిన అనేకమంది మేనేజర్లను కూడా తిరిగి తీసుకుని వారి వేతనాలను 6.7 శాతం పెంచి ఉద్యోగ భద్రతను కూడా సమ్మె మూలంగా కల్పించారు. మెక్‌డానాల్డ్ కార్మికులు 200 మంది సైతం సమ్మె ద్వారా ప్రయోజనం పొందారు. సంఘటితమైన కార్మికశక్తి బ్రిటన్ ఫాస్ట్‌ఫుడ్ పరిశ్రమలో కూడా విజయాలను సాధించింది. ఈనేపథ్యంలో కలిసికట్టుగా కదిలి శాశ్వత పరిష్కారానికి రాజకీయ మార్పును సాధించాలి.

యుద్ధాలపై ఖర్చు పెంచాలి : అమెరికా

బ్రస్సెల్స్ : యుద్ధాలు చేసేందుకు మరిన్ని ఆయుధాల సేకరణకు అవసరమైన ఖర్చులను బాగా పెంచాలని అమెరికా రక్షణ శాఖ మంత్రి జేమ్స్‌మట్టిస్, నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్‌స్టోల్టెన్ బర్గ్ నాటో దేశాలకు పిలుపునిచ్చారు. ప్రచ్ఛన్న యుద్ధకాలం నుంచి మిత్రులుగావున్న దేశాలకు వీరిరువురూ ఈ సూచన చేశారు. స్టోల్టెన్‌బర్గ్‌ను కలుసుకునేందుకు మట్టిస్ బ్రస్సెల్స్‌లో పర్యటి స్తున్నారు. 15 నాటో సభ్యదేశాలు ఆయుధాలపై ఖర్చును పెంచేందుకు సంబంధించిన ప్రణాళికను సమావేశంలో సమర్పించారు. 2020 నాటికి పొందే ఆర్థిక ఉత్పత్తిలో రెండు శాతాన్ని సైనికశాఖ ఖర్చులో పెంచనున్నట్టుగా పేర్కొన్నారు. యుద్ధం కోసం అవసరమైన ఆయుధాలపైన ఖర్చులు పెంచని దేశాలకు తమ మద్దతు ఉపసంహరించుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. గత సంవత్సరమే నాటో దేశాలు ఆయుధాలపైన ఖర్చును 4.3 శాతం పెంచాయి. 2010 తర్వాత ఇంత ఎక్కువగా ఖర్చు పెంచడం ఇదే మొదటిసారి. అన్ని నాటో దేశాలకంటే అమెరికా తన సైనిక వ్యయాన్ని ఎక్కువగా పెంచుతున్నది. ఆ తరువాత వ్యయాన్ని పెంచుతున్న దేశం గ్రీస్. అది తన జీడీపీలో 2.32 శాతాన్ని సైనిక వ్యయానికి కేటాయిస్తున్నది. యూరోపియన్ యూనియన్ ఆదేశంపైన పొదుపు చర్యలు పాటించాలంటూ విధించిన ఆంక్షలుమూలంగా ఉద్యోగుల వేతనాలు తగ్గాయి. పెన్షన్‌లలో కోత విధించారు. సంక్షేమ రాజ్యం అన్న పేరు కాగితాలకే పరిమితమయ్యింది. ప్రజల జీవనం దుర్భరమైంది. గత సంవత్సరం పెంచవలసిన లక్ష్యాన్ని బ్రిటన్, ఎస్టోనియా, రొమేనియా, పోలెండ్ మాత్రమే పూర్తిచేశాయి. ఈ దేశాలన్నీ పొదుపు విధానాలను పాటించి రక్షణ వ్యయాన్ని పెంచాయి.

ఆఫ్ఘన్ నుంచి అమెరికా వైదొలగాలి

- ఆదేశ ప్రజలకు తాలిబన్ల లేఖ

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికా తన సైన్యాన్ని వెనక్కుతీసుకువెళ్లాలని తాలిబన్లు డిమాండ్ చేస్తున్నారు. సైన్యాన్ని ఉపసంహరించుకోవలసిందిగా అమెరికా ప్రజలు, ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని మూడువేల పదాలతో కూడిన ఓ లేఖను తాలిబన్లు రాసి గురువారం విడుదల చేసారు. సుదీర్ఘకాలంగా జరుగుతున్న అంతర్యుద్ధాన్ని ముగించి శాంతిని నెలకొల్పాలన్నదే తమ లక్ష్యమని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో తిష్టవేసిన సైనికులకోసం, ఇంకా ఇతర చర్యలకోసం అనేక ట్రిలియన్ డాలర్లను అమెరికా ఖర్చుచేయ వలసివచ్చింది. ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వానికిసైతం అనేక కోట్ల డాలర్లు వృథా అయ్యాయి. వేలాదిమంది అమాయకప్రజలు ప్రాణాలు కోల్పోయారు. తాలిబన్లు రాసిన లేఖలో అమెరికా ప్రజలకు, ఎన్‌జీఓ సంస్థల బాధ్యులకు, శాంతినికోరుకునే కాంగ్రెస్ సభ్యులకు విజ్ఞప్తి చేసారు. అమెరికా ప్రభుత్వంతో నేరుగా చర్చలుజరపాలని తాలిబన్లు చాలాకాలంనుంచి కోరుతున్నారు. అయితే అమెరికా తిరస్కరిస్తూ వస్తున్నది. చర్చలు ఆఫ్ఘన్ ప్రభుత్వం, తాలిబన్ల మధ్యే జరగాలని అది చెబుతున్నది. సమ్మిళిత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని విద్యారంగం తదితర రంగాలలో మహిళలతో సహా అన్ని హక్కులు కల్పిస్తామని తాలిబన్లు ఆ లేఖలో పేర్కొన్నారు. అధికారంలో భాగస్వామ్య అంశాన్ని వారు పేర్కొనలేదు. ప్రభుత్వం ఏర్పాటుచేసే హక్కు తమకుందని వారు తెలిపారు. శాంతి చర్చల ద్వారా మాత్రమే ఈ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

విషం కక్కిన విద్వేషం

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది, అత్యవసర సేవా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. పోలీసులు గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించి, మిగతా విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా, గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిందితుడు నికోలస్ క్రూజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కొద్దిరోజుల క్రితం పాఠశాల యాజమాన్యం క్రమశిక్షణ చర్యలు తీసుకుని అతడిని సస్పెండ్ చేసింది. దీంతో కోపంతో రగిలిపోయిన క్రూజ్ పాఠశాలలోకి చొచ్చుకొచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. తొలుత పాఠశాలలోకి ప్రవేశించిన వెంటనే కాల్పులకు తెగబడిన నికొలస్‌ను అడ్డుకున్న ముగ్గురిని కాల్చేశాడు. అనంతరం పాఠశాలలోని ఫైర్ అలారం మోగించాడు. దీంతో ఏదో జరిగిపోతుందన్న కంగారులో అందరూ ప్రవేశ ద్వారం వైపు పరిగెత్తుకుంటూ వచ్చారు. అక్కడే కాచుకుని ఉన్న క్రూజ్ వచ్చిన వారిని వచ్చినట్లు కాల్చి చంపేశాడు. అయితే అప్పటికే కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దుండగుడు పాఠశాల భవనంలో దాక్కున్నాడు. అనంతరం పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో పోలీసులు కూడా దుండగుడిపై ఎదురు కాల్పులకు దిగారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

రక్తపాతానికి కారణాలివే..

19 ఏళ్లు.. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన ప్రాయం, స్నేహితులతో సరదాగా ఆడిపాడే వయసు. కానీ అతను (నికోలస్) అలా చేయలేదు. పుస్తకాలు వదలి తుపాకీ పట్టుకున్నాడు. తోటి స్నేహితులను అతి దారుణంగా చంపాడు. అమెరికాలోని ఫ్లోరిడా పాఠశాలలో చోటు చేసుకున్న భీకర కాల్పుల వెనుక ఉన్నది... అదే పాఠశాలలలో చదువుతున్న పూర్వ విద్యార్థి అని తెలియగానే యావత్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. క్రమశిక్షణగా ఉండడం లేదని స్కూల్ నుంచి సస్పెండ్ చేయడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి అందరూ షాక్ అవుతున్నారు. ముందు నుంచి నికోలస్ తీరు ఇలాగే ఉండేదని అక్కడి ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎప్పుడూ తోటి విద్యార్థులతో గొడవపడేవాడని, స్కూల్ గోడకు తన చేతులతో బలంగా కొట్టుకునేవాడని తోటి విద్యార్థులు చెప్పారు. నికోలస్‌కు తుపాకులు అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ తుపాకీ పట్టుకుని ఫోటోలు తీసుకునేవాడు. బల్లి, కప్ప వంటి చిన్నచిన్న జీవులను చిత్రహింసలకు గురిచేసి చంపేవాడు. వాటి ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసి ఆనందపడేవాడు. నికోలస్ సోదరి కొద్ది రోజుల క్రితమే మరణించింది. ఆ తర్వాత నుంచి తీవ్ర ఉద్వేగానికి, ఒత్తిడికి లోనయిన నికోలస్ విద్వేషాన్ని పెంచుకున్నట్లు సమాచారం.

ట్రంప్ దిగ్భ్రాంతి

ఫ్లోరిడా స్కూల్ కాల్పుల ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అమెరికాలో తరచుగా జరుగుతున్న ఇలాంటి ఘటనలు తల్లిదండ్రులను హడలెత్తిస్తున్నాయి. ఆస్పత్రులు చిన్నారుల రోదనలతో మిన్నంటాయి. గన్ కల్చర్ పెరిగిపోవడంపై అంతటా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా ఇప్పటి వరకు అమెరికాలోని పాఠశాలల్లో ఇటువంటి కాల్పుల ఘటనలు 18 చోటుచేసుకున్నాయి..

చెక్కేశాడు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారని, సీబీఐ ఫిర్యాదుకన్నా ముందే ఆయన విదేశాలకు వెళ్లిపోయారని అధికారులు వివరించారు. 2013 నాటి నుంచి ప్రముఖ భారతీయులు, సంపన్నుల జాబితాలో కనిపించే నీరవ్ మోడీతో పాటు ఆయన భార్య, సోదరుడు, వ్యాపార భాగస్వామి చోక్సీపై జనవరి 31న సీబీఐ కేసు నమోదైంది. వీరు పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.280కోట్ల కుచ్చుటోపీ పెట్టినట్టు ఆరోపణలున్నాయి. కాగా, మొత్తం రూ.11,400 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని బ్యాంకు మంగళవారం సీబీఐకి మరో రెండు ఫిర్యాదులు చేసింది.

ఈడీ సోదాలు :

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) అధికారులు పలు నగరాల్లోని నీరవ్ మోడీకి చెందిన షోరూమ్లలో సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం ముంబైలోని నాలుగు షోరూమ్లను, ఢిల్లీలో రెండు, సూరత్‌లో మూడింటిని తనిఖీ చేశారు.

ప్రసాద్‌ఓలి

(మొదటిపేజీ తరువాయి)

లాల్‌బాబుపండిత్ (జనాభా,వాతావరణ శాఖ), ధామ్ మాయా థాపా(మహిళ, శిశు సంక్షేమశాఖ) ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునైటెడ్ మార్క్సిస్టు, లెనినిస్టు) కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) సంకీర్ణ ప్రభుత్వానికి ప్రసాద్‌ఓలి నాయకత్వం వహిస్తారు. బుధవారం రాత్రే పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దేవుబా నాయకత్వం వహిస్తున్న నేపాల్ కాంగ్రెస్ ఈ ఎన్నికల ఫలితాల్లో మూడవ స్థానం లభించింది. ఫ్రంట్‌గా ఏర్పడి పోటీచేసిన కమ్యూనిస్టు పార్టీలు మెజారిటీ స్థానాలలో గెలుపొందాయి. 270 మంది సభ్యులున్న ప్రతినిధుల సభకు కమ్యూనిస్టు పార్టీల ఫ్రంట్ 174 స్థానాలను కైవశం చేసుకుంది. మెజారిటీ సీట్లను గెలుచుకున్న ఫ్రంట్ నాయకుడిగా ప్రసాద్‌ఓలి పదవీ ప్రమాణం చేసారు. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్), సీపీఎన్ (యుఎమ్ఎల్) పార్టీలు విలీనం కావాలని నిర్ణయించుకున్నట్లుగా కాట్మండుపోస్టు తెలియజేసింది. దెవుబా గురువారం ఉదయమే తన రాజీనామా సమర్పించారు. 8 నెలలపాటు ఆయన ఈ పదవిలో పనిచేశారు.

నూతన ప్రధాని ప్రసాద్‌ఓలికి భారత్, చైనా దేశాలతో సంబంధాలను సమతుల్యం చేసుకునే సవాలు ఎదురవుతుంది. అలాగే నూతన రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న అంతరంగిక ఆందోళనను కూడా ఆయన పరిష్కరించవలసి ఉంటుంది. 2015 నుంచి అమలవుతున్న రాజ్యాంగం ప్రకారం దేశాన్ని 7 రాష్ట్రాలుగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఫెడరల్ రిపబ్లిక్కుగా నేపాల్ అవతరించింది. నేపాల్ దక్షిణ ప్రాంతంలో వివిధ జాతులు నూతన రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నాయి. రాజ్యాంగంపై మాథేసి జాతి ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. తమకు ఏర్పాటు చేసిన రాష్ట్రాన్ని మరింత విస్తరించాలని వీరు కోరుకుంటున్నారు. వీరికి భారతదేశం మద్దతు ప్రకటించింది. నూతన ప్రధాని ప్రసాద్‌ఓలి (65) నేపాల్ తూర్పు ప్రాంతంలోని ఒక గ్రామంలో జన్మించారు. యువకుడిగా ఉన్నప్పటినుంచే రాజకీయాలలో పనిచేస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలో వివిధ హోదాలలో పనిచేశారు. నేపాల్ రాచరిక ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనల్లో పాల్గొని వివిధ దశలలో 14 ఏళ్లపాటు జైలుజీవితం అనుభవించారు. 1990 వరకు రాచరిక ప్రభుత్వం రాజకీయ పార్టీలను నిషేధించింది. పార్టీలు పెద్దఎత్తున ఆందోళనలు చేయడంతో నిషేధాన్ని తొలగించి ఎన్నికల్లో పాల్గొనేందుకు రాజు బీరేంద్ర అనుమతించారు. ఆ తరువాత అనేక పరిణామాలు చోటుచేసుకుని చివరికి మావోయిస్టు నాయకుడు ప్రచండ ప్రధానిగా ప్రభుత్వం ఏర్పడింది.

డెడ్‌లైన్ మార్చి 5

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కె.అద్వాని, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీని కూడా కలిసి తమ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఏకరవు పెట్టారు. పార్లమెంట్‌లో ఎలాంటి స్పష్టత ఇవ్వని కేంద్రం సమావేశాలు ముగిసిన తర్వాత ఏపీకి రైల్వే జోన్, అవసరమైన నిధులు ఇవ్వనున్నట్లు మీడియాలో లీక్‌లు ప్రారంభమయ్యాయి. మార్చి 5 వరకు వేచి చూడాలని టీడీపీ అధినాయకత్వం నిర్ణయించింది. ఈ దశలో ఏప్రిల్ 6లోపు ఏపీకి ప్రత్యేకహోదా ప్రకటించకపోతే తమ పార్టీ ఎంపీలు పదవులకు రాజీనామా చేస్తారని వైసీపీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. దీంతో టీడీపీ అధిష్టానం కలవరపాటుకు గురైనట్లు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు నిత్యం పార్టీకి చెందిన సీనియర్ నేతలు, మంత్రులతో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ కేంద్ర వైఖరిపై ఏ విధంగా ముందుకెళ్ళాలన్న అంశంపై చర్చలు జరుపుతూనే ఉన్నారు. గురువారం కూడా సమావేశం జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షులతో కూడా బాబు మాట్లాడారు. ఇచ్చింది తీసుకుందాం. రావాల్సిన వాటికోసం పోరాడదాం అన్న భావంతో ఉన్న టీడీపీ గురువారం సాయంత్రానికి తీవ్ర నిర్ణయం తీసుకుంది. మార్కెటింగ్ శాఖా మంత్రి ఆదినారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మార్చి 5 నాటికి ఏపీకి సంబంధించిన 19 అంశాలలో కేంద్రం సరిగా స్పష్టతనివ్వకపోతే అదేరోజు తమ పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేస్తారని, అదే రోజు తాము బీజేపీతో మిత్రబంధాన్ని తెంచుకుంటామని ప్రకటించారు. దీంతో ఇప్పటివరకు టీడీపీ బీజేపీ విషయంలో నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోందని భావించిన వర్గాలన్నీ ఉలిక్కిపడ్డాయి. మోడీ, షా ద్వయంతో రాజకీయ వైరం పెట్టుకునేందుకు దేశంలోని ఏ రాజకీయపక్షం కూడా సాహసించటం లేదు.

అలాంటిది ఆర్థికంగా క్లిష్టసమస్యల్లో ఉన్న ఏపీ ప్రభుత్వ రథసారథి చంద్రబాబు బీజేపీతో పోరుకే నిర్ణయించుకొని మంత్రి ఆదినారాయణతో ప్రకటన చేయించారని అర్థమవుతోంది. దీంతో జగన్ రెండు నెలలు పాటు కేంద్రానికి డెడ్‌లైన్ విధిస్తే మిత్రపక్షం టీడీపీ 18 రోజులకే డెడ్‌లైన్ విధించి తాము మిత్రబంధాన్ని తెంచేసుకుంటామని ప్రకటించింది. ఇలా అడుగడుగునా టీడీపీ, వైసీపీ ఎత్తుకు పై ఎత్తులు వేసుకుంటూ రాజకీయ చదరంగం ఆట ఆడుతున్నారు. ఆదినారాయణరెడ్డి ప్రకటన వెలువడిన వెంటనే ఎంపీలతో కూడా రాజీనామా చేయిస్తారా అంటూ వైయస్.జగన్ ప్రశ్నను సంధించారు. ఏమి చేస్తామో చూడండి అంటూ టీడీపీ నేతలు నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా మార్చి 5 నుండి పార్లమెంట్, రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. బడ్జెట్ సమావేశాలకు కూడా వైసీపీ హాజరు కావట్లేదని జగన్ రెండు రోజుల క్రితం చేసిన ప్రకటనను బట్టి అర్థమవుతోంది. 3న తన పార్టీ ఎమ్మెల్యేలను ఢిల్లీకి పంపుతున్నట్లు, 5న పార్లమెంట్ వద్ద నిరసన తెలిపి, ఆందోళన కార్యక్రమాలు ఏప్రిల్ 6వరకు కొనసాగిస్తారని ఈ ప్రకటనను బట్టి బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరయ్యే ఆలోచనలో లేనట్టు అర్థమవుతోంది. ఇక రాష్ట్రంలోని బీజేపీ నేతలు కూడా ఎక్కడా తగ్గకుండా టీడీపీ నాయకత్వాన్ని, ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. రెండు పార్టీలు లెక్కలు ఇవ్వాలని, నిజమేందో ప్రజలకు చూపుతామని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పారు. ఆయన కోరిన విధంగా టీడీపీ, బీజేపీలు లెక్కలు ఇవ్వలేదు. వెబ్‌సైట్‌లో చూస్తే పోలవరం లేకుంటే చంద్రబాబు విడుదల చేసిన 217 పేజీల వివరాల బుక్‌లెట్‌ను చదువుకుంటే తెలుస్తుందని టీడీపీ నేతలు చెప్తున్నారు. మొత్తం మీద రాజీనామాలే అంతిమ పరిష్కారంగా రెండు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి.

కేంద్రంతో కటీఫ్‌కు టీడీపీ సిద్ధం కాగా దీనికి జగన్ ఏ విధంగా కౌంటరిస్తారోనని రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఏది ఏమైనప్పటికీ రాష్ట్ర రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఎన్నికల వేడి ఇప్పటి నుండే ప్రారంభమైనట్లు కన్పిస్తోంది. మార్చి 5 నుండి బీజేపీతో టీడీపీ మిత్రబంధం తెంచుకుంటే రాష్ట్ర రాజకీయాలు కొత్తరూపు సంతరించుకుంటాయి. ఆ తర్వాత రాష్ట్రంలో జరిగే రాజకీయ పరిణామాలు ఎవరి అంచనాలకు అందటం లేదు.

కరెన్సీకి కటకట

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులపాలయ్యారు. దేశంలో 2016 నవంబరు 8వ తేదీన పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రారంభమైన కరెన్సీ కష్టాలు 15 నెలలు గడచినా కొనసాగడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. నోట్ల రద్దు క్రమంలో విడుదల చేసిన రూ. 2వేల నోట్ల ముద్రణపై నియంత్రణ విధించడం.. మిగిలిన రూ. 500, రూ. 200, రూ. 50, రూ. 20 నోట్ల పునర్ముద్రణ జరిగినప్పటికీ ప్రజలకు చేరడంలో జాప్య వెరసి నోట్ల కష్టాలకు ప్రధాన కారణంగా ఆర్థికరంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. బ్యాంకుల్లో జమ అయిన ఆయా మొత్తాలకు సరిపడినంత స్థాయిలో కొత్తనోట్లు రాకపోవడం కూడా మరో కారణంగా తెలుస్తోంది. అలాగే కేంద్రం తాజాగా తీసుకురావాలనుకున్న 'ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్' (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లు ప్రభావం కూడా ఆర్థిక వ్యవస్థపై పడినట్లు చెబుతున్నారు. ఈ బిల్లును తీసుకొస్తే బ్యాంకుల్లో వివిధ రూపాల్లో దాచుకున్న డబ్బుకు భద్రత లేకుండా పోతుందనే భయంతో చాలా మంది డిపాజిట్లు చేయడం నిలిపివేయడం, ఉన్న డిపాజిట్లను వెనక్కు తీసుకోవడం వల్ల నగదు కష్టాలు తారాస్థాయికి చేరినట్లు బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9వేలకు పైగా ఏటీఎంలుండగా వాటిలో 90 శాతం ఏటీఎం కేంద్రాలు మూతబడ్డాయని ఖాతాదారులు చెబుతున్నారు.

అన్నదాత అవస్థలు వర్ణనాతీతం

కరెన్సీ కొరత ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా చూపుతోంది. ముఖ్యంగా అన్నదాతల అవస్థలు వర్ణనాతీతం. పంటను విక్రయించిన రైతు సొమ్ము చేసుకోవడం గగనమైపోతోంది. ధాన్యం విక్రయించిన రైతులకు నగదు చెల్లింపులు చేయడం ప్రభుత్వం, మిల్లర్లు, దళారులకు కష్టంగా మారింది. అలాగే స్వయం సహాయ సంఘాలకు రుణాల మంజూరు, వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్ల చెల్లించేందుకు నగదు లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మార్కెటింగ్ యార్డులు, ఇతర ప్రైవేటు వ్యక్తులకు తమ ఉత్పత్తులను విక్రయించిన రైతన్నలు ఆయా మొత్తాలకు సంబంధించిన చెక్కులతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జనవరి నెలలో వరి, చెరకు, మొక్కజొన్న వంటి పంటలతోపాటు చిరుధాన్యాలు, వాణిజ్యపంటలైన మిర్చి, ప్రత్తి, పొగాకు తదితర పంటలు చేతికి రావడంతో విక్రయించడం పెద్ద సమస్యగా మారింది. ఒకవేళ పంటను అమ్మగా వచ్చిన సొమ్మును కనులారా చూడలేని పరిస్థితి. మరోవైపు చేసిన అప్పులు తీర్చలేక, మరో పంట వేసేందుకు చేతిలో పైసల్లేక అన్నదాతలు తీవ్రంగా సతమతమవున్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి తెరదించేందుకు తక్షణమే రూ. 5వేల కోట్ల విలువైన నోట్లను పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికశాఖమంత్రి అరుణ్‌జైట్లీకి బుధవారం లేఖ రాసారు. పెద్దనోట్లతోపాటు చిన్న నోట్లు కూడా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ లేఖ ప్రతులను ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్, ప్రాంతీయ అధికారి సుబ్రహ్మణ్యంలకు పంపించారు.

నోటిఫైకి ఓకే

(మొదటిపేజీ తరువాయి)

సహాయమంత్రి అర్జున్ రాం మేఘ్వాల్, ఏపీ, తెలంగాణ మంత్రులు దేవినేని ఉమా మహేశ్వరరావు, హరీశ్‌రావు సహా 18 రాష్ట్రాల మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కింద చేపట్టిన ప్రాజెక్టులపై చర్చించారు. దీనికిముందు కృష్ణా, గోదావరి నదీ పర్యవేక్షణ బోర్డు సమీక్ష జరిగింది. కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో దేవినేని ఉమా మహేశ్వరరావు, హరీశ్‌రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండు బోర్డుల పరిధిని నోటిఫై చేయాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. నోటిఫై చేసేందుకు నదీ పర్యవేక్షణ బోర్డు సుముఖత వ్యక్తం చేసింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించగా.. తెలంగాణ విముఖత వ్యక్తంచేసింది. నీటి కేటాయింపులు జరిపిన తర్వాతే నోటిఫై చేయాలని తెలంగాణ మెలిక పెట్టింది. బోర్డు పరిధిని నోటిఫై చేయాలని తాము ఎప్పటి నుంచో కోరుతున్నామని మంత్రి దేవినేని తెలిపారు. విభజనచట్టంలో పేర్కొన్న ప్రకారమే బోర్డు పరిధిని నోటిఫై చేయాలని తాము కోరామన్నారు. త్వరలో అపెక్స్ కౌన్సెల్ సమావేశానికి పిలవాలని ఆలోచిస్తున్నారని అన్నారు. బోర్డు పరిధి నోటిఫై చేస్తే ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉంటుందని, ఆయకట్టులోని చివరి ఎకరాకు సైతం నీటు అందుతాయన్నారు. విభజన చట్టంలో చెప్పిన అంశాన్ని అమలు చేయాలని వాదించినట్టు దేవినేది అన్నారు. కొత్త డీపీఆర్‌లను కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని దేవినేని స్పష్టంచేశారు. డిసెంబరు నాటికి ఎనిమిది ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ తర్వాత బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో వాదనలు ఈరోజుకీ కొనసాగుతున్నాయన్నారు. ట్రిబ్యునల్ తీర్పులపై సుప్రీంకోర్టులో వాదనలు ఇంకా కొనగసాగుతున్నాయన్నారు. త్వరలో అపెక్స్ కౌన్సెల్‌ను పిలవాలని అధికారుల ఆలోచనగా ఉందని, బోర్డు పరిధిని నిర్ణయించి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ఇరు రాష్ట్రాల అధికారులు చూస్తారని బోర్డు చెప్పిందన్నారు. ఈ ఏడాది నాగార్జున సాగర్ ఎడమ, కుడికాలువ కింద చివరి ఆయకట్టు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. అలా జరగకుండా చట్టంలో ఉన్నట్టు అమలు చేయాలని తమ అధికారులు అడిగారని దేవినేని ఉమ తెలిపారు. గోదావరిలో నీటి లభ్యత లెక్కలు త్వరగా తేల్చి వచ్చే సమావేశానికి ఆ లెక్కలు తీసుకురావాలని బోర్డు సూచించిందన్నారు. కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు వెంటనే ఇవ్వాలని బోర్డు కోరిందన్నారు. పోలవరం పూర్తయ్యేలోపు ఉపయోగపడే పట్టిసీమ, పురుషోత్తంపట్నం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌లు అందజేశామన్నారు. మిగిలిన ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇవ్వాలని సూచించారని తెలిపారు. దశాబ్ద కాలం క్రితం 8 ప్రాజెక్టులను 1800 కోట్ల రూపాయలతో ప్రారంభించారని, వాటికి కేంద్రం నుంచి 498 కోట్ల రూపాయలు వచ్చాయన్నారు. ఒక ప్రాజెక్ట్ పూర్తి కాగా మిగిలిన 7 ప్రాజెక్టులను 2018 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ అడ్డుపుల్లలు వేయటంపై మంత్రి దేవినేని ఉమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

హైదరాబాద్-కాకినాడకు ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్-కాకినాడ టౌన్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణమధ్యరైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్-కాకినాడ టౌన్ స్పెషల్ (రైల్ నెంబర్: 07075) హైదరాబాద్ నుంచి ఈనెల 16వ తేదీ సాయంత్రం 6.50 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్ స్టేషన్ (రాత్రి 7.15గంటలకు) మీదుగా, మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్-హైదరాబాద్ స్పెషల్ (రైల్ నెంబర్: 07076) కాకినాడ టౌన్ నుంచి ఈనెల 18వ తేదీ సాయంత్రం 6.10 గంటలకు బయల్దేరి, మరుసటి రోజు ఉదయం 6గంటలకు సికింద్రాబాద్ స్టేషన్, 6.50 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

రఘువీరారెడ్డికి పవన్ ఫోన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురువారం ఫోన్ చేసి మాట్లాడారు.జనసేన పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలకు ఆయన మద్దతు కోరారు.ఈ నెల 16వ తేదీన హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించబోయే సమావేశానికి హాజరు కావాలని ఆయన ఫోన్ ద్వారా ఆహ్వానించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధులుగా రఘువీరారెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగా గౌతమ్ హాజరుతారు.'లోక్‌సత్తా' అధినేత జయప్రకాష్ నారాయణ, ప్రముఖ రాజకీయవేత్త ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు ఇప్పటికే ఆహ్వానం అందిన విషయం విదితమే. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు.



హామీలు నెరవేర్చాల్సిందే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - నర్సీపట్నం: రాష్ట్ర విభజన చేసి నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం ఉత్తరాంధ్ర చర్చావేదిక జనఘోష కన్వీనర్ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏబీఎం కళాశాల కరస్పాండెంట్ అంకంరెడ్డి జమీలు, ఎంఎల్ఏఎస్ కరస్పాండెంట్ మీసాల సుబ్బన్న నేతృత్వంలో నర్సీపట్నంలో విద్యార్థులతో జనఘోష కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, నరేంద్రమోడీ తిరుపతి ప్రచారంలో ప్రత్యేక హోదాపై హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత ఇప్పుడు ఆ మాటనే మర్చిపోయారన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు ఆర్థికంగా వెనుకబడిన జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు ఏడు సంవత్సరాల పాటు రూ.50 కోట్ల చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రత్యేక హోదా నినాదాంతో రాష్ట్ర ప్రజలందరూ ముందుకు రావాలన్నారు. విశాఖ రైల్వేజోన్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. 58 శాతం విశాఖ డివిజన్ నుండి రైల్వేకు ఆదాయం సమకూరుతుందన్నారు. విద్యార్థులు, కార్మిక సంఘాలు, వ్యాపార సంఘాలు ప్రత్యేక హోదా కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక జనఘోష కన్వీనర్ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, విభజన చేసి కట్టుబట్టలతో రాష్ట్రాన్ని బయటకు పంపించారన్నారు. ముందు మద్రాసు నుంచే ఆంధ్ర రాష్ట్రాన్ని విడగొట్టారని, రాజధాని లేకుండా బయటకు పంపించారని, ఇప్పుడు అదే రీతితో తెలంగాణా నుంచి ఆంధ్రాను విడదీశారన్నారు. అన్ని రాజకీయ పార్టీల సహాయ సహకారాలతో రాష్ట్రాన్ని విడగొట్టారన్నారు. ప్రస్తుతం పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాష్ట్ర విభజన చట్టంలో పోలవరం పూర్తి చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వెనుకంజ వేయడం సరైంది కాదన్నారు. ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించాలని అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ప్రత్యేక హోదా చర్చావేదిక కార్యక్రమానికి తనను కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, వైసీపీ ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుంటే త్వరలో ఎంపీలు రాజీనామాలు చేస్తారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రత్యేక హోదా కోసం ప్రసంగించడం అందరినీ ఆకట్టుకుంది. రేలారే రేలా ఫేమ్ దేవీశ్రీ ఉత్తరాంధ్రకు సంబంధించిన పాటలు ఆలపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు గురుబాబు, రాజాన దొరబాబు, మహిళా సమాఖ్య నాయకురాలు విమల, సీపీఐ పట్టణ కార్యదర్శి రుత్తల పెదబుజ్జి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మలసాల కిశోర్, మాడుగుల నియోజకవర్గం ఉత్తరాంధ్ర సభ్యులు పివిజి కుమార్, రోలుగుంట మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ టి.భద్రాచలం, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పెండింగ్‌లో వున్న ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థుల స్కాలర్‌షిపులు, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేయాలని డిమాండు చేస్తూ ఏఐఎస్ఎఫ్ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అన్ని జిల్లాలలో విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనల్ని నిర్వహించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. విజయవాడ లెనిన్ సెంటరులో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న ఆధ్వర్యాన ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి పిచరణ్‌సాయి, మల్లేస్, సాయి, సాగర్,ప్రభు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు.అనంతరం చెవిలో పూలు పెట్టుకుని వినూత్నంగా దుకాణా దారుల నుంచి భిక్షాటన చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న మాట్లా డుతూ, 2016-17 విద్యా సంవత్సరానికిగాను రూ.252కోట్లు, 2017-18 ఏడాదికి రూ.1906 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలున్నాయని వివరించారు. త్వరలో విద్యా సంవత్సరం ముగియనుందని, విద్యార్థులు ఫీజులు చెల్లించలేక అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు.

పాలకులు కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాస్తూ విద్యను ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని విదేశీ ప్రైవేటు సంస్థలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు పెండింగ్‌లో వున్న స్కాలర్‌షిప్‌లను,ఫీజు రీయింబర్స్‌మెం టులను విడుదల చేయాలని డిమాండు చేశారు.

మూడున్నరేళ్లలో 1817 పరిశ్రమలు

- రూ.14.26 లక్షల కోట్ల పెట్టుబడులు రాక
- అనంతపురము-కృష్ణపట్నం మెగా పారిశ్రామిక క్లస్టర్
- రూ.400 కోట్లతో చిత్తూరులో టెక్స్‌టైల్స్ పరిశ్రమ
- 2,500 ఎకరాల్లో సౌత్ కొరియా టౌన్‌షిప్
- ఎస్‌పీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు సమీక్ష



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అనంతపురం నుంచి కృష్ణపట్నం వరకు తమిళనాడు తరహా అతి పెద్ద ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటవుతున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. చిత్తూరు జిల్లాలోని ఎలక్ట్రానిక్ క్లస్టర్ మొదలుకొని, అనంతపురము జిల్లాలోని ఆటోమొబైల్ పరిశ్రమ వరకు రానున్నకాలంలో దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా అవతరిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు తమిళనాడులోని ఇండస్ట్రియల్ క్లస్టర్ అత్యధిక వృద్ధితో దేశంలోనే ముందుందని, దాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో పారిశ్రామిక క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మంత్రులు కళా వెంకట్రావు, పి. నారాయణ, లోకేశ్, పితాని సత్యనారాయణలతో కలిసి రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటికే ఇసుజు, భారత్ ఫోర్జ్, అపోలో, కియా, హీరో వంటి దిగ్గజ ఆటోమొబైల్ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయని, ఒకవైపు హీరో, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు, మరోవైపు కియా వంటి సంస్థల ఏర్పాటుతో రాయలసీమ ప్రాంతం దేశంలోనే అత్యుత్తమ ఆటోమొబైల్ క్లస్టర్‌గా రూపుదిద్దుకోబోతోందని చెప్పారు. కియా మోటార్స్ అనుబంధ సంస్థలు 18 యూనిట్ల స్థాపనకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సంస్థలన్నీ కలిసి మొత్తం 761.2 మిలియన్ యూఎస్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నాయని, మొత్తం 6,799 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయని తెలిపారు.

రూ. 400 కోట్లతో టెక్స్‌టైల్స్ పరిశ్రమ

చిత్తూరు జిల్లాలో 150 ఎకరాలలో రూ.400 కోట్ల పెట్టుబడులతో అరవింద్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంటింగ్ యూనిట్‌ను నెలకొల్పుతున్నారు. ఈ యూనిట్ ఏటా రూ.1000 కోట్ల ఎగుమతులు చేయగలదని అంచనా. ఈ పరిశ్రమ స్థాపనతో గార్మెంటింగ్ పరిశ్రమలో 8000 మందికి, టెక్స్‌టైల్స్‌లో 7వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. ఏపీ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ పాలసీ 2015-20 ప్రకారం దీనిని మెగా ప్రాజెక్టుగా గుర్తించారు.అనంతపురము జిల్లా పాల సముద్రంలో 2 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్లతో సాయిదివ్య అపెరల్స్ అండ్ ఫ్యాషన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 'నాచు కార్పొరేషన్ స్టీల్ ఇండస్ట్రీస్' ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ డీఐ పైప్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం రూ.1033.22 కోట్ల పెట్టుబడులు పెడుతున్నారు. 161.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమ ఏర్పాటు కానున్నది. ఇందులో 800 మందికి ప్రత్యక్షంగా, 1200 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. భూమి కేటాయించిన 30 మాసాలలోపు ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తుంది.మోహన్ స్పిన్‌టెక్స్ ఇండియా లిమిటెడ్ కృష్ణాజిల్లాలో మెగా టెక్స్‌టైల్స్ ప్రాజెక్టును రూ.289.20 కోట్లతో ఏర్పాటు చేస్తుంది. దీనిద్వారా 2750 మందికి ప్రత్యక్షంగా, 8 వేల మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి. శ్రీసిటీలో లెర్రీస్ సోలార్ టెక్నాలజీ సంస్థ సోలార్ సెల్స్, మాడ్యుళ్లను తయారు చేసే యూనిట్‌ను రూ.1500 కోట్లతో నెలకొల్పనున్నది. దీని వల్ల వెయ్యిమందికి ఉపాధి కలుగుతుంది.రాష్ట్రంలో ఏర్పాటు చేసే దక్షిణ కొరియా టౌన్‌షిప్ కోసం రెండున్నర వేల ఎకరాలు కేటాయించే అంశంపై సమావేశంలో చర్చించారు. సౌత్‌కొరియా ఇన్వెస్టుమెంట్ క్లస్టర్ పేరుతో వ్యవహరిస్తారు. ఈ సిటీ దేశానికే రోల్ మోడల్‌గా ఉండాలని ముఖ్యమంత్రి సమావేశంలో ఆదేశించారు.

మూడున్నరేళ్లలో 1817 పరిశ్రమలు రాక

ఈ మూడున్నర ఏళ్లలో 18 శాఖలకు సంబంధించి 1817 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయి. వీటి విలువ రూ.14,25,908 కోట్లు. ఈ పరిశ్రమలతో మొత్తం 33,28,580 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కినట్లయిందని అధికారులు వివరించారు. వీటిలో 543 సంస్థలు ఉత్పత్తిని ఇప్పటికే ప్రారంభించగా, మరో 19 కంపెనీలు ఉత్పత్తి దశలో ఉన్నాయి. 49 ప్రాజెక్టులకు యంత్రసామగ్రి బిగింపు దశలో, 184 పరిశ్రమలు నిర్మాణదశలో ఉన్నాయి. మరో 48 యూనిట్లు త్వరలో శంకుస్థాపన చేసుకోనున్నాయి. 975 పరిశ్రమలు నిర్మాణదశకు చేరువలో ఉన్నాయి. 2016, 2017 సీఐఐ భాగస్వామ్య సదస్సులలో రూ.11,10,195 కోట్ల విలువైన 876 ప్రాజెక్టులకు ఎంఓయూలు చేసుకోగా, అందులో 156 యూనిట్లు ఇప్పటికే కార్యరూపం దాల్చి ఉత్పత్తిని ప్రారంభించినట్లు తెలిపారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) నష్టాల పేరుతో బస్సుల నిలిపివేత కారణంగా ఏడాది క్రితం విధుల నుంచి తొలగించిన 300 మంది కాంట్రాక్టు కండక్టర్లు, 650 మంది కాంట్రాక్టు డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకొని వారందర్నీ క్రమబద్ధీకరించాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు సంస్థ యాజమాన్యానికి గురువారం లేఖను అందజేసి నట్లు ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వైవీరావుతో పాటు ప్రధాన కార్యదర్శి కె పద్మాకర్, అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర రావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఈయూ గుర్తింపు కాలంలో ఇచ్చిన సమ్మె నోటీసుపై ప్రభుత్వం స్పందించి 2013 డిసెంబరు 31 నాటికి ఆయా ఉద్యోగాల ఖాళీల్లో నియమించిన వారిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించిం దన్నారు. మొత్తం 24,577 మందిని రెగ్యులర్ టైమ్ స్కేల్‌లో నియమించాలని 2014 జనవరి ఒకటో తేదీన జీవో ఎంఎస్ నెంబరు 1ను జారీ చేసిందన్నారు. అయితే 2012 డిసెంబరు 31వ తేదీ వరకూ నియమితులైన 17,272 మంది కాంట్రాక్టు కండక్టర్లు, డ్రైవర్లను రెగ్యులరైజ్ చేయకుండా ఉన్న ఉద్యోగాల నుంచి తొలగించిందని తెలిపారు. ఈ విధంగా తొలగించిన 950 మంది కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరగా యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు నేతలు తెలిపారు.

60 రోజులకు స్పెషల్ క్యాజువల్ లీవు ఇవ్వాలి : సమ్మెకాలంలో 60 రోజులకు స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేయాలని యాజమాన్యాన్ని కోరినట్లు ఈయూ నేతలు తెలిపారు.రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ ఉద్యోగ సంఘాలతో కలసి 2013 ఆగస్టు 13వ తేదీ నుంచి అక్టోబరు 11 వరకూ జరిగిన నిరవధిక సమ్మెలో ఆర్టీసీలో పనిచేస్తున్న 55,340 మంది రెగ్యులర్, 8,735 మంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారని వారు పేర్కొన్నారు. సమ్మె విరమణ సందర్భంగా 2013 అక్టోబరు 11వ తేదీన జరిగిన సమావేశంలో అప్పటి రవాణా మంత్రి బొత్స సత్యన్నారాయణ, ఆర్టీసీ ఎండీ, వైస్ ఛైర్మన్ ఏకే ఖాన్, కార్మికసంఘాల నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సమ్మె కాలాన్ని లీవ్ డ్యూటీగా పరిగణిస్తామని యాజమాన్యం రాత పూర్వకంగా యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. దీనివలన పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.50 కోట్లు, సర్వీ సులో ఉన్న ఉద్యోగులు వారు పదవీ విరమణ చేసే సమయంలో చెల్లించెందుకు మరో రూ. 270 కోట్లు అవసరం అవుతాయని యాజమాన్యం స్పష్టం చేసినట్లు నేతలు తెలిపారు.



బీజేపీ, టీడీపీ దొందూ దొందే

- నేడు హైదరాబాద్‌లో జేఎఫ్‌సీ కీలక సమావేశం
- హైకోర్టు తీర్పుతోనైనా టీటీడీ అధికారులకు బుద్ధి రావాలి
- తక్షణం మాణిక్యాలరావును మంత్రి పదవి నుంచి తప్పించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- తిరుపతి : ప్రత్యేక హోదా కోసం ఏప్రిల్‌లో వైసీపీ ఎంపీలు రాజీనామాలు చేస్తామని ప్రకటిస్తే రాజకీయ నాటకమంటూ తెలుగు దేశం పార్టీ నేతలు స్పందించడం శోచనీయమని, అసలు టీడీపీ ఏం చేస్తుందో స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండు చేశారు.గురువారం తిరుపతి సీపీఐ నగర మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధన కోసం, విభజన చట్టంలోని హామీల అమలు కోసం ప్రతిపక్ష పార్టీలు ఉద్యమం చేస్తుంటే బీజేపీని ప్రశ్నించాల్సిన అధికార పార్టీ నేతలు ప్రజాందోళనపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ ఎంపీల రాజీనామా డ్రామా అని చంద్రబాబు చెప్పడం చూస్తే మోడీని ఎదురించే ధైర్యం లేదని తేలిపోయిందన్నారు. హోదా విషయంలో ఇరు పార్టీలు పరస్పరం ఆరోపణలు మాని కేంద్రంపై పోరాటం సాగించాలన్నారు. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కేబినెట్‌లో ఇరు పార్టీల వారు మంత్రి పదవులు అనుభవిస్తూ నాటకాలు ఆడటం కట్టిపెట్టాలన్నారు. చంద్రబాబునాయుడు పెద్ద అవినీతిపరుడని సోము వీర్రాజు బహిరంగంగా విమర్శిస్తుంటే పిరికితనంతో, చేతగాని తనంతో బాబు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నాడు ఎన్నికల ముందు 15 సంవత్సరాలు హోదా కావాల్సిందేనని డిమాండు చేసి, అధికారంలోకి వచ్చిన అనంతరం ప్యాకేజీకి సరే అని ఒప్పుకుని, నేడు అది కూడా దక్కకుంటే అడిగే పరిస్థితిలో ముఖ్యమంత్రి లేరంటే రాష్ట్రానికి ఏ రకంగా ద్రోహం తలపెట్టారో అర్థమవుతోందన్నారు. హరిబాబు చూపిన లెక్కలు అవాస్తవాలని, రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చూపలేదన్న సాకు చూపి ప్రాజెక్టులకు నిధులు ఆపేస్తారా అని ప్రశ్నించారు.

ప్రత్యేక హోదాపై శుక్రవారం హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో సీపీఐ, సీపీఎం నేతలు సమావేశం అవుతున్నామని, భవిష్యత్తు కార్యాచరణ నిర్దేశిస్తామని రామకృష్ణ చెప్పారు. 18వ తేదీన విజయవాడలో అన్ని రాజకీయ పక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. మార్చి 6వ తేదీ చలో ఢిల్లీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. బీజేపీకి చెందిన మాణిక్యాలరావుకు దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించడంతో టీటీడీలో హిందూ మతోన్మాదాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైకోర్టు మధ్యంతర తీర్పు ఇచ్చినా టీటీడీ అధికారులకు బుద్ధి రాలేదన్నారు. తక్షణం దేవదాయ శాఖ నుండి మంత్రి మాణిక్యాలరావును తప్పించాలని డిమాండు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి, చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



రూరల్ వాటర్ సప్లయ్ ఇంజనీర్స్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ రూరల్ వాటర్ సప్లయ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో గురువారం ఎన్నికల అధికారి, ఏపీ ఎన్‌జీవో అసోసి యేషన్ నేత ఎ.విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన రాష్ట్ర సంఘంలో 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు ఫిబ్రవరి 11న తిరుపతిలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 36 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఎన్నికలలో సంఘానికి అధ్యక్షునిగా డి.రామారావు (అనంతరపురం, ఉపాధ్యక్షులుగా ఎ.శివాజీ (కాకినాడ), పి.హరిప్రియ (నెల్లూరు) , ప్రధాన కార్యదర్శిగా కోసన రాంబాబు (విజయవాడ). సంయుక్త కార్యదర్శులుగా ఎస్ రామ్మోహన్ (చిత్తూరు) ఏకగ్రీవంగా, ఎం.శ్రీకాంత్ (గుంటూరు) ఏకగ్రీవంగా, కోశాధికారిగా జి.రామ గోవిందరెడ్డి (విజయవాడ), కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.రాంబాబు (గుంటూరు), టెక్నికల్ సెక్రటరీగా ఎం.శివమోహన్, జోనల్ సెక్రటరీ లుగా ఎం.కార్తికనాయుడు (శ్రీకాకుళం) ఏకగ్రీవంగా, ఎస్ శ్రీనివాసరావు (విజయవాడ) ఏకగ్రీవంగా, ఎ.శ్రీనివాసులు (ఒంగోలు, ఎస్ పవన్‌కుమార్ (చిత్తూరు) ఓట్లతో ఎన్నికైనట్లు విద్యాసాగర్ తెలిపారు. ఎన్జీవో అసోసి యేషన్ పశ్చిమ కృష్ణా డి.సత్యనారాయణరెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా, ఆర్.హెచ్ ప్రకాష్, సీవీఆర్ ప్రసాద్, గంగాధర, విశ్వనాథ్, రాజుబాబు, శ్యామ్ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహ రించిన్నట్లు విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీ టెట్.. 'మాస్ కాపీయింగ్'కు అవకాశం?

- ఇతర రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు
- ఆన్‌లైన్‌పై అభ్యర్థులలో ఆందోళన
- 21 నుంచి పరీక్షలు యథాతథం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు)-2017 నిర్వహణా బాధ్యతలను ఓ ప్రైవేటు ఐటీ కంపెనీకి ప్రభుత్వం అప్పగించడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. మాస్ కాపీయింగ్ జరిగే అవకా శాలున్నాయని అనుమానిస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతా ధికారుల నిర్లక్ష్యం, ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణపై అవగాహన లోపం వెరసి టెట్ పరీక్షలపై వరుసవారీగా గందరగోళం నెలకొంటోంది. ఇష్టానుసారంగా ప్రైవేటు కంపెనీలకు టెట్ పరీక్షల బాధ్యతను అప్పగించడంపై అభ్యర్థులలో అభద్రతా భావం నెలకొంది. భారీస్థాయిలో మాస్ కాపీయింగ్ కొనసాగే ప్రమాదముందని వాపోతున్నారు. వేలాది రూపాయల ఖర్చుతో ఆర్నెళ్ల నుంచి టెట్ కోచింగ్ తీసుకుని పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. టెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించడంపై గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. పరీక్షా ఫలితాలను వేగవంతంగా విడుదల చేయాలనే తపనతో ప్రభుత్వం చేపట్టిన ఆన్‌లైన్ విధానాలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో ఆఫ్‌లైన్ పద్ధతిలో టెట్‌ను విజయవంతంగా నిర్వహించారు.ఇదే విధానాన్ని అమలు చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఏపీలో తొలిసారిగా ఆన్‌లైన్ పద్ధతిలో టెట్ నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రైవేటు ఐటీ సంస్థకు టెట్ బాధ్యతలను నిర్వహించడంపై పెద్దఎత్తున దుమారం నెలకొంది. ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలోని టెట్ విభాగంలో లోపాలు కన్పిస్తున్నాయి. టెట్ అభ్యర్థుల దరఖాస్తుల ప్రక్రియ నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ వరకూ తప్పిదాలు నెలకొన్నాయి. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ ఫోన్లు, నంబర్లు మూగబోయాయి.

టెట్ అభ్యర్థుల హాల్‌టికెట్ల కేటాయింపులో అవకతవకలు కొనసాగినట్లు విమర్శలున్నాయి. కొన్ని ప్రైవేటు కోచింగ్ సెంటర్ల సిబ్బందికి ఒకే చోట పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. అనంతపురం, కడప, కర్నూలు పరీక్షా కేంద్రాలకు భారీ స్థాయిలో అభ్యర్థులు దరఖాస్తు చేయడంపై అనుమానాలు నెలకొన్నాయి. ఇతర రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలపైనా వ్యతిరేకత నెలకొంది. ఈ విధానంతో ప్రైవేటు ఐటీ సంస్థల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశముంది.

టెట్ పరీక్షలపై ఉత్కంఠతకు తెర..!

ఏపీ టెట్ పరీక్ష నిర్వహణపై కొనసాగుతున్న ఉత్కంఠతకు తెరపడింది. ఒకానొక దశలో టెట్ పరీక్షను మళ్లీ వాయిదా వేస్తారనే ప్రచారం తెరపైకి వచ్చింది. మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెలువరించి, మేలో పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈలోగా టెట్ పరీక్షల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. లేకుంటే డీఎస్సీ నోటిఫికేషన్‌కు మరింత జాప్యమయ్యే పరిస్థితి ఉంది. ఆన్‌లైన్‌లో నెలకొన్న సమస్యలపై విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కన్పిస్తోంది. తెలంగాణా డీఎస్సీ, ఏపీ టెట్‌ల తేదీలు ఒకేసారి రావడంతో రాష్ట్ర అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారు. రాష్ట్రం నుంచి 20 శాతం కోటాలో తెలంగాణా డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారికి అసౌకర్యం కలుగుతోంది. టెట్‌కు బీఈడీ, డీఎడ్ రెండో ఏడాది చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చిన విషయం విదితమే. ఆచార్య నాగార్జున వర్సిటీ పరిధిలో బీఈడీ పరీక్షలను ఈ నెల మూడో వారానికి వాయిదా వేశారు. దీంతో బీఈడీ అభ్యర్థులు టెట్ పరీక్షలకు దూరమవుతారు. రాష్ట్రంలోని ఇతర విద్యారంగ పరీక్షా తేదీలను పరిగణలోకి తీసుకోవడంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు విఫలమయ్యారే విమర్శలున్నాయి. ఇష్టానుసారంగా టెట్ పరీక్ష తేదీలు ప్రకటించడాన్ని అభ్యర్థులు తప్పుపడుతున్నారు. ఏపీ టెట్‌లోని మూడు పేపర్లకు 4 లక్షల 40 వేల 518 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టెట్ ఆన్‌లైన్ పరీక్షలను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

భవిష్యత్ కార్యాచరణపై జేఎఫ్‌సీ భేటీ నేడు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రత్యక్ష పోరాటానికి జనసేన దళపతి పవన్ కల్యాణ్ సన్నద్ధమవుతున్నారు. పోరాటం ద్వారానే పాలకుల మెడలు వంచాలని సంకల్పించారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఏపీ ప్రభుత్వ వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్న పవన్ ఇక ప్రజాయుద్ధం సాగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై నిజాలను నిగ్గు తేల్చాలని పవన్ ఇచ్చిన గడువు గురువారంతో ముగుస్తున్న క్రమంలో ప్రత్యక్ష ఉద్యమాల ద్వారానే ప్రజాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు పవన్ పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న చంద్రబాబుతో తాడోపేడో తేల్చుకోవాలనే సంకల్పంతో ఉన్నారు. కళ్యాణ్ విధించిన డెడ్‌లైన్ ముగిసినా...అటు కేంద్రం నుంచి కానీ ఇటు రాష్ట్రం నుంచి కానీ ఎటువంటి స్పందన రాలేదు. దీంతో పవన్‌ను రెండు ప్రభుత్వాలు లైట్ తీసుకున్నాయన్న భావన వ్యక్తం అవుతోంది. కేంద్రం నుంచి ఇప్పటిదాకా ఎపికి వచ్చిన నిధులపై బిజెపి, టిడిపిల్లో ఏదో ఒక పార్టీ అబద్ధం చెబుతోందని పవన్ ఆరోపించారు. 15వ తేదీలోగా కేంద్రం, రాష్ట్రాలు తనకు లెక్కలిస్తే ప్రజలకు వాస్తవాలు వివరిస్తానని పవన్ పేర్కొన్న విషయం తెలిసిందే. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చిన నిధులు వాటిని ఎలా ఖర్చు చేశారన్న దానిపై సమగ్ర వివరాలను రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇవ్వాలని కోరారు. అలాగే కేంద్రం కూడా రాష్ట్రానికి ఇచ్చిన నిధుల వివరాలు ఇవ్వాలన్నారు. పవన్ గతంలో కూడా పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు ఉన్నాయని కావాలంటే చూసుకోవచ్చని సూచించింది. నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని సైతం ఇదే విషయాన్ని చెప్పారు. అయితే ఎంత వెతికినా ఆ వివరాలు దొరకలేదని పవన్ విమర్శించారు. అప్పుడు ఇవ్వని వాళ్లు ఇప్పుడు కూడా ఇస్తారన్న నమ్మకం తనకు లేదన్నారు. అయితే నిధుల లెక్కలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించని నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై జాయింట్ ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి) తొలిసారిగా భేటీ కానుంది. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని హోటల్ దస్‌పల్లాలో జెఎఫ్‌సీ మేధోమథనం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్, లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ, కాంగ్రెస్ నేత గౌతమ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు హాజరుకానున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జేఎఫ్‌సీతో పవన్ సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి స్థాయి సమావేశం ప్రారంభంకానుంది. శనివారం ఉదయం 10 గంటలకు రెండో రోజు సమావేశం ప్రారంభంకానుంది. ఈ సమావేశంలో పత్యేక హోదా, ఏపీకి కేంద్రం చేసిన సాయం, రాష్ట్ర ఖర్చు చేసిన నిధులతో పాటు ఇంకా రావాల్సిన నిధులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నారు. జేఎఫ్‌సీ ఆధ్వర్యంలో మార్చి 5 నుంచి పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఇరు ప్రభుత్వాలపై ఢిల్లీ స్థాయి ఒత్తిడి తేవాలని, అవసరమైతే ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్రం నుంచి ఏపీకి వచ్చిన, రావాల్సిన నిధుల లెక్కలు తేల్చేందుకు పవన్ జెఎఫ్‌సి కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జెఎఫ్‌సి ఏర్పాటులో భాగంగా ఇప్పటికే ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్ నారాయణ, కె.రామకృష్ణ, పి.మధులతో సమావేశమయ్యారు.





పవన్ కళ్యాణ్ తో యోగేంద్ర యాదవ్ భేటీ

స్వరాజ్ అభియాన్ నేత, ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు శ్రీ యోగేందర్ యాదవ్ జనసేన పార్టీ అధ్యక్షుడు శ్రీ పవన్ కళ్యాణ్ ను గురువారం సాయంత్రం హైదరాబాద్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో కలుసుకున్నారు.ఇటీవల అనంతపురం జిల్లాలో తాను జరిపిన పర్యటన వివరాలను యోగేందర్ యాదవ్ పవన్ కళ్యాణ్ కు తెలిపారు. ఢిల్లీ వాసిని అయిన తనకు ఆంధ్రప్రదేశ్ అంటే పచ్చటి పొలాలు, గోదావరి, కృష్ణ నదులతో కళకళలాడుతుందని మాత్రమే తెలుసని, అయితే అనంతపురం జిల్లాను చూసిన తరువాత తన అభిప్రాయం పూర్తిగా మారిపోయిందని చెప్పారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన చలసాని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు గురువారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పాటైన జాయింట్ ఫాక్ట్స్ ఫైండింగ్ కమిటీ కి ఆయన సంఘీభావం ప్రకటించారు.16 న హైదరాబాద్ లో జరగనున్న జాయింట్ ఫాక్ట్స్ ఫైండింగ్ కమిటీ తొలి సమావేశానికి తమ సమితి ప్రతినిధులతో కలసి హాజరవుతున్నట్లు తెలిపారు.

సంపాదకీయం

అమెరికాలో తుపాకీ మశూచి

ఆయుధాలపై ఉన్న యావను వదులుకోవడానికి ససేమిరా అంటున్న అమెరికా అందుకు మరోమారు మూల్యం చెల్లించింది. తమ ప్రజలకు తాను అనాలోచితంగా ఇచ్చిన అనర్థదాయక స్వేచ్ఛ వల్ల పిల్లలు, పెద్దలు ఎలాపడితే అలా తుపాకులు పేల్చే ఒక సమాజ వ్యవస్థను అమెరికా తనపై తానే విధించుకుంటున్నది. తుపాకీ సంస్కృతి ఎంతటి తీవ్ర పరిణామాలకు దారితీస్తుందో మరోసారి తేటతెల్లమైంది. బుధవారం ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లో మర్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ స్కూల్‌లో 19ఏళ్ల విద్యార్థి నికోలస్ క్రూజ్ కాల్పులకు తెగబడి తోటి స్నేహితులనే అతి దారుణంగా చంపేశాడు. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన ప్రాయం, మిత్రులతో సరదాగా ఆడిపాడే వయసులో నికోలస్ ఓ ఉన్మాదిగా మారి 17మందిని బలి తీసుకొన్నాడు. 14మందికి గాయాలయ్యాయి. అతని ప్రవర్తన బాగాలేదనీ, క్రమశిక్షణ తప్పాడని గత విద్యా సంవత్సరం నుంచి స్కూల్ యాజమాన్యం సస్పెండ్ చేసిందన్న కోపంతోనే ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. అమెరికా విధానాలనూ, రాజకీయాలనూ తుపాకులే శాసిస్తున్న దుస్థితిలో ఇలాంటి ఉన్మత్త ఉదంతాలు నిరాటంకంగా కొనసాగడంలో వింతేమీ లేదు. 2013 నుంచి ఇప్పటివరకూ 291సార్లు అమెరికా పాఠశాలల్లో తుపాకుల మోత మోగిందనీ, సగటున వారానికి ఒకటి చోటుచేసుకుంటుందని ఆ దేశ గన్‌సేఫ్టీ విభాగం వెల్లడించింది. ఈ ఏడాది స్కూళ్లలో చేటుచేసుకున్న ఘాతుకాల్లో ఇది పద్దెనిమిదోది. అమెరికాలో రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారికంటే, అంటువ్యాధులకు ప్రాణాలు కోల్పోతున్నవారికంటే తుపాకు లకు బలవుతున్నవారి సంఖ్యే అధికంగా ఉన్నదంటే ఆయుధాలెంత విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విచారం వ్యక్తంచేసి ఉండొచ్చు. కానీ ఈ పాపంలో ఆయన, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీ తమ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తుపాకుల వినియోగాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన బిల్లు సెనేట్ ముందుకొచ్చినప్పు డల్లా రిపబ్లికన్లు గట్టిగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ తుపాకి సంస్కృతి అమెరికాలో మినహా ప్రపంచంలో మరే దేశంలోనూ లేదు. బ్రిటన్‌తోసహా అభివృద్ధి చెందిన దేశాలన్నీ క్రమేపీ దానికి దూరమయ్యాయి. పరిమితులు విధించు కున్నాయి. అమెరికాలో కూడా తుపాకి లైసెన్స్‌ల జారీలో ఆంక్షలను అమలు చేస్తున్న రాష్ట్రాలు కొన్ని ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో కాల్పుల ఘటనలు అతి స్వల్పంగా ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయినా వాటిని ఆదర్శంగా తీసుకోవ డానికి ఫెడరల్ ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలూ నిరాకరిస్తున్నాయి. అస్సాల్ట్ రైఫిల్స్, హై కెపాసిటీ బరస్ట్ ఆటోమేటిక్ ఆయుధాలు సామాన్య పౌరులకు అతి తేలికగా అందుబాటులోకి వస్తున్నాయి. ఒక సైనిక, సాంకేతిక, సామ్రాజ్యవాద, ఏకధృవ పెట్టుబడిదారీ వ్యాపార ధోరణులతో, తానే ప్రపంచం అనుకునే అమెరికా తన ప్రజలను ఎటువైపు నెట్టుతున్నదనేదే అసలు ప్రశ్న. ప్రపంచపటంలో నూటడెబ్బయి ఏడు దేశాల్లో, ఎనిమిది వందల సైనిక కేంద్రాలతో, ఏడాదికి నూరు బిలియన్ల డాలర్లు ఖర్చు పెడుతున్న దేశం పౌరులకు గన్‌కల్చర్‌కు మించిన కల్చర్‌ను ఎలా నేర్పగలుగుతుంది? అమెరికాలో ఇంతవరకూ 1968 – 2007 మధ్య కాలంలో తుపాకీ కాల్పుల దుంతాల్లో చనిపోయిన వారి సంఖ్య లక్షలలోనే ఉంది. ఆ దేశమే ఇస్తున్న లెక్కల ప్రకారం చిల్లర మల్లర లెక్కిస్తే నిరుడు ఒక్క ఏడాదిలోనే 50,000కు పైగా ఘటనలు చోటుచేసుకున్నాయి. చనిపోయిన వారు దాదాపు 20వేల మంది. ఎంత భద్రత ఉన్నదీ సమాజంలో! తమ ఆలోచలకు విరుద్ధమైన ఆలోచనలు న్నవారిని కాల్చే ఈ సంస్కృతిని మనమూ అనుకరిస్తున్నామా ?

ప్రపంచాన్ని కలవరపరుస్తున్న ఇలాంటి దుర్దశ గురించి అమెరికాలో ఏ చట్టసభలూ మాట్లాడవు. ఏ సెనేటర్లూ ఈ విషయమై రాజీనామా చేయరు. వీరు తమ దేశాన్ని కాపాడుకోలేనివారు తుపాకులు మించిన మానవ సంపదే దేశ ప్రగతికి కీలకం అని నేతలు ప్రజలకు బోధించలేరు. పౌరులకుగల జీవించే హక్కు ఎవరూ భంగపరచవీల్లేనంత విలువ గలదని చెప్పలేరు. ఇతర దేశాలపై మాత్రం తమ ఆధిపత్య వికృతాలకు దౌత్యనీతి అని పేర్లు పెట్టగలరు. వీరిని ఇరవయ్యో శతాబ్దపు వికృత శిశువులు' అన్నాడు బ్రిటిష్ చరిత్రకారుడు అర్నాల్డ్ టాయన్ (1889-1975). ప్రపంచ దురహంకారిగా మారిన అమెరికా ఇప్పుడు తన ఇంట్లో తనే ఎలా బొక్కబర్లా పడుతున్నదో చూస్తుంటే సామాజిక అధ్యయనవేత్తలకు ఆందోళన కలుగుతున్నది. సంక్షోభం తలెత్తినప్పుడు దాన్ని అన్ని కోణాల్లోనూ పరిశీలించి పరిష్కరించడం, భవిష్యత్తులో తలెత్తకుండా చూడటం ప్రభుత్వం బాధ్యత. అమెరికా సర్కారు ఆ బాధ్యతను విస్మరిస్తోంది. ఘటన జరిగిన రోజు దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం మినహా ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు శూన్యం. విపక్షం నుంచి చెదురుమదురు ప్రకటనలొచ్చినా వాటిని ఖండించేందుకు తుపాకి లాబీల నుంచి కొందరు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. లాస్‌వెగాస్ ఘటన తర్వాత హిల్లరీ క్లింటన్ తుపాకులను అదుపు చేయాలని డిమాండ్ చేస్తే ఆమె రాజకీయం చేస్తున్నారంటూ విమర్శలు హోరెత్తాయి. ఒరెగన్ రాష్ట్రంలో కళాశాలలోకి ప్రవేశించి ప్రొఫెసర్‌తో పాటు మరో 9 మందిని ఒక ఉన్మాది కాల్చి చంపినప్పుడు అప్పట్లో రిపబ్లికన్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ట్రంప్, బుష్‌లిద్దరూ తుపాకుల నిషేధం డిమాండ్‌ను అపహేళన చేశారు. తుపాకులు కొంటున్నవారెవరో, వారికి ఆ అవసరం ఎందుకొచ్చిందో తెలుసుకోవాలన్న ఆసక్తి అక్కడి ప్రభుత్వాలకు ఉండటం లేదు. కొంటున్నవారి నేపథ్యం తెలియకపోవడం ప్రమాదానికి దారితీయ వచ్చన్న సంశయంగానీ, అమ్మకాలపై నిఘా అవసరమని గానీ పాలకులకు తోచడం లేదు. ఏటా తుపాకులు, తూటాల పరిశ్రమ ఆర్జిస్తున్న రూ. 10,000 కోట్లకుపైగా లాభాలనే చూస్తున్నారు. రోడ్లపై, ఆఫీసుల్లో, స్కూళ్లలో అమాయకులు పిట్టల్లా రాలుతున్నా వారికి పట్టడం లేదు. ఇప్పటికైనా తమ గన్‌కల్చర్ శాసనాలు, పౌరులు తుపాకులు కలిగి ఉండే హక్కు గురించి అమెరికా తక్షణమే సమీక్షించుకోవాలి. దాదాపు మనిషికొక్క తుపాకీ నిష్పత్తి దాటిపోయి ముప్పయి ఒక్క కోట్ల తుపాకులు ఆ దేశ పౌర సమాజం వద్ద ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. అలాంటి సమాజం ఎంత కట్టుబాటులో ఎంత నియంత్రణలో ఉండ గలదు? అమెరికాను వెంటాడుతున్న తుపాకీ మశూ చిని ఆపాలంటే, ఏ ప్రజా స్వామిక ఔదార్య విలువలతో ఆ దేశం ఏర్పడిందో, వాటి సాయంతోనే ఈ దిగజారుడునీ, తమ బతుకుల చుట్టూ అకాల శ్మశానాలను నిర్మించుకోవడమనే విషాదాన్నీ అడ్డుకోగలరు. తుపాకి ఉండటం ఒక హోదాగా భావిస్తూ, ప్రాణానికి అదే గ్యారెంటీ అని నమ్ముతూ బతికితే అసలుకే మోసం వస్తుందని సగటు పౌరులు గ్రహించాలి. ఆ దిశగా పాలకులపై ఒత్తిడి తీసుకురావాలి. లేదంటే ఇలాంటి ఉన్మాదాలకు అంతం ఉండదు.

చురక

పైసలిస్తె తప్ప పనులు
పూర్తికాని వ్యవస్థ
ప్రభుత్వంలో ప్రతీచోట
పెరుగుతున్న అవస్థ

అవినీతి లంచాలు
అంతులేని రీతులు
అంతమంటూ చెప్పతారు
అధినేతలు నీతులు

– వేల్పుల నారాయణ

సందర్భం

తెర 'దేవతల' నిశ్శబ్ద నీతి


సంగిరెడ్డి హనుమంతరెడ్డి

పద్మావతి చిత్ర నిర్మాణంతోనే దాడులు మొదలయ్యాయి. చిత్ర ప్రివ్యూను చూసిన పెద్దలు అందులో అభ్యంతరకరమేదీ లేదన్నా గూండాలు వినలేదు. సంఘీయుల దాష్టీకానికి తెర దేవతల నిశ్శబ్దం ఊపు నిచ్చింది. దాడుల వ్యతిరేక ఐక్య నిరసనలు ఏడాది క్రితమే మొదలవ్వాల్సింది. దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ, నాయకి దీపికా పదుకొణెల తలలు తెగ్గోసి నోళ్ళకు కర్ణిసేన, సంఘ్ ప్రముఖులు కోట్ల బహుమతి ప్రకటించినా తెరదేవతలు మౌనం వీడలేదు. భన్సాలీ నిబ్బరాన్ని, దీపిక ధైర్యాన్ని చూసినా వీరు మారలేదు. భన్సాలీని దీపికను ఓదార్చలేదు.

పద్మావతి చిత్ర బృందంపై దాడి చేశారు. సినిమా సెట్లను వాహనాలను తగలబెట్టారు. థియేటర్లపై రాళ్ళు రువ్వారు. ఢిల్లీ పక్కనున్న గురుగాం, హరియాణాలలో చిన్నపిల్లల పాఠశాల బస్సులకూ నిప్పుపెట్టారు. ఇంతకూ ఈ సినిమాలో వీళ్ళు ఊహించిన మహమ్మదీయ రాజు అల్లా ఉద్దీన్ ఖిల్జీ, రాజపుత్ర రాణి పద్మినీల మధ్య ప్రేమ దృశ్యాలేవీ లేవు. ఇతర సినిమాల్లో లాగా నాయకి ఒంటిని, అంగాలను ప్రదర్శించలేదు. ఒక విధంగా హైందవ భావజాల ప్రచారం జరిగింది. రాణి, రాణివాస పరివార పడతులు భర్తల అనుమతితో మహిళల సామూహిక ఆత్మాహుతి ఆచారం జౌహర్‌కు పాల్పడతారు.


పద్మావత్ చిత్ర ప్రదర్శనను వ్యతిరేకిస్తూ నినదిస్తున్న హైందవ సేన

ఖిల్జీని దుర్మార్గునిగా, వ్యభిచారిగా, మహిళో న్మాదంలో రక్తపుటేరులు పారించిన రాక్షసునిగా చిత్రీకరిం చారని మలేషియాలో ఈ చిత్రాన్ని నిషేధించారు. మతోన్మాదంతో ఇరువైపులా నష్టాలే.

గత నాలుగేళ్ళుగా పుస్తకాలు, సాహిత్య సభలు, శాస్త్రీయ సమావేశాలు, సినిమాలపై సంఘ్ అనుబంధ సంస్థలు దాడులు చేస్తున్నాయి. ఈ మూకలను ప్రముఖ పత్రికలన్నీ ప్రధాని స్రవంతిలో లేని, సంప్రదాయ బద్ధంకాని, పరిధీయ బ ృందాలని చిత్రీకరిస్తున్నాయి. నిజానికివి పాలక రాజకీయ అల్లరిమూకలు. ప్రభుత్వాధినేతల నిశ్శబ్దం, వ్యూహాత్మక మద్దతు, దొంగదెబ్బలు, పోలీసుల నిస్సహాయతల వెనుక పాలక వర్గాలున్నాయన్నది బహిరంగ రహస్యం. పద్మావతి చిత్రాన్ని ప్రదర్శించకూడదని కర్ణిసేన చేసిన కపటకారిన్య యాగీ దీన్ని ధృవీకరించంది. జనసామాన్యంలో కొన్ని గుణాలు నిక్షిప్తమై ఉంటాయి. స్వార్థ చింతనతో అమానవీయ అనువర్తన. ప్రగతిశీలత సంతరించుకొన్నా వర్గ, వర్ణ, మత అవశేషాలు ఇంగువ గుడ్డ వాసనలా కొనసాగడం. తనదాకా వస్తేగానీ పట్టించుకోని నిరాసక్తత. పాలక పార్టీతో పాటు ప్రధాన ప్రతిపక్షం కూడా మెజారిటీ మతాన్ని దువ్వడం, గుళ్ళు దర్శించడం, అల్లరిమూకల, కర్ణిసేన దాడులను ఎదుర్కోకపోవడం, ఖండించక పోవడం మొదటి లక్షణం వల్లనే. మెజారిటీ మతస్తులు మైనారిటీ మతస్తులపై హింసను, మెజారిటీ మతదురహంకారాన్ని సహించడం రెండవ లక్షణం. నోట్లరద్దులోనో, వస్తుసేవల పన్నులోనో నష్టపోయేంత వరకు మోడీయాన్ని ఆమోదించడం మూడవ లక్షణ ఫలితం. కొందరు ఆత్మీయులు బలైనప్పుడే స్పందించి, నిరసన కొనసాగిస్తారు. హింసకుల ప్రతీకారచర్యలు కొనసాగింపుకు కారణమవుతాయి. తన మిత్రురాలు గౌరీ లంకేశ్ హత్య సందర్భంగా మోడీని విమర్శించి, ఆ ప్రక్రియను కొనసాగించిన నటుడు ప్రకాశ్‌రాజుది ఈ లక్షణమే. అయినా అభినందనీయమే.

పద్మావతిపై పలువురు తెరదేవతలు నిశ్శబ్ద నీతిని పాటించడంలో కొందరిది స్వార్థం. కొందరిది భయం. కొందరిది అవకాశవాదం. తమదాకా వచ్చినప్పుడు వారికి మాట, పలుకు కూడా మిగలదని వీరు గుర్తించాలి. మన హీరోల అభిమాన సంఘాలు వాళ్ళమీద ఈగ వాలనివ్వవు. కొందరు నాయకులు మనకు తెలియని కారణాలతో తొలి భార్యనొదిలేశారు. ఆ వంచిత వనిత మారు మను వాడతారన్న పుకార్లతోనే అభిమానులు ఆమెపై విరుచుకు పడ్డారు. పెళ్ళి చేసుకుంటే చంపేస్తా మన్నారు. వీళ్ళంతా పద్మావతి పట్ల తమ అభిమాన హీరోలతో సహగమనం చేశారు. సామాజిక స్పృహ లేని, చిత్రకళా ప్రాముఖ్యత తెలియని సాంఘిక వ్యర్థ ధీరువులు వీరు.ముంబయి, చెన్నై, హైదరాబాదు, ఢిల్లీలలో చిత్ర ప్రపంచ ప్రముఖులు పద్మావతి గొడవపై నిరసన తెలిపియుంటే, కనీసం తమకు అలవాటైన ట్విట్టర్ యుద్ధం చేసివుంటే, ప్రభుత్వ ప్రచారకర్తలు తమ పలుకు బడిని ఉపయోగించివుంటే పాలకులు కర్ణిసేనకు మద్దతునిచ్చేవారా? ప్రభుత్వాలు దుర్మార్గంగా ప్రవర్తించి వుండేవా? పోలీసు వ్యవస్థ నిస్సిగ్గుగా పాలకులకు దాసోహమయ్యేదా? ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సర్టిఫికెట్‌కు, సుప్రీంకోర్టు తీర్పుకు విలువ లేకుండా పోయేదా? చిత్రపరిశ్రమ నిర్బంధ లొంగుబాటుకు కారణం దాని అనైక్యతేనని వరిష్టనటి శర్మిలా టాగూర్ అన్నారు.అన్ని వేళలా వ్యాపారాన్నే చూసుకుంటే నేటి పద్మావతి గతి రేపు అందరికీ పడుతుందని పత్రికారంగ పురస్కారాల గ్రహీత, ప్రముఖ పాత్రికేయురాలు, రచయిత్రి బర్కాదత్ వ్యాఖ్యానించారు.


పార్లమెంటు బయట చేతులూపుతున్న పార్లమెంటు సభ్యులుగా మారిన నటీనటులు

ప్రస్తుత పార్లమెంటులో ఎప్పుడూ లేనంత సంఖ్యలో 15 మంది సినిమా, టీవి నేపథ్యం నుండి వచ్చిన వారున్నారు. వీరంతా చిత్రసీమతో లభించిన ఆకర్షణ, ప్రజాదరణతో లబ్ధి పొందినవారే. అధికార పార్టీ అధీనంలో భావదారిద్ర్యంతో బానిసలైన స్మృతి, హేమ మాలిని, ఖేర్ దంపతులు, పరేశ్ రావల్ దాడులకు దిగుతున్న సేనలను, బీజేపీ వారిని ఎదిరించలేరు. చిత్రజగత్తు రారాజు, పెద్దన్న, గుజరాత్ రాష్ట్ర ప్రచార కర్త అమితాభ్ కేమయింది? లాలూలను సి.బి.ఐ. కేసులు చుట్టుకున్నట్లు తమ వనామా పత్రాల పాపం బయటికి పొక్కుతుందని భయపడ్డారా? నిర్భయ ఘటనపై పార్లమెంటులో రోధించిన జయా బచ్చన్ ఎక్కడికెళ్ళారు? ఈ దంపతుల వారసత్వ నటుడు అభిషేక్, ఆయన సతీమణి అందాల రాణి అసమాన నటీమణి ఐశ్వర్యల తెలివి తేటలేమయ్యాయి? దీపిక పోటీ తగ్గుతుందని సంతోషించారా? మా భావాలను ప్రకటించినందుకు పాకిస్తాన్‌కు పొమ్మనడానికి, మాంసాహార అలవాట్లతో మా మతాన్ని నిర్వచించడానికి, మా దేశభక్తిని కొలవడానికి వీళ్ళెవరని ప్రశ్నించిన షారూఖ్ ఎక్కడ దాగారు? అసమాన దేశభక్తుడు అమీర్ ఏ మూలన నక్కారు? తమ మీద సంఘీయులు చేసిన దాడికి భయపడ్డారా? బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ మొదలగు వుడ్డుల హెడ్డులన్నీ ఎక్కడ దాక్కున్నాయి? రజనీ సంఘ్ చంకలో ఇరుక్కు పోయారా? చిరు సోదరసంతానాలు కళ్ళుమూసుకున్నాయెందుకు? కృష్ణ మహేశు లేమయ్యారు? బహు భాషా నటీమణులు జయప్రద, శ్రీదేవి, రేఖ, రాణి, శృతి, జయసుధలు,నాగేశ్వర సంతాన ఉపసంతానాలెక్కడ? బాలయ్య బావ క్రింద, బావ భాజపా బాహువులలో చిక్కుకున్నారా? 1962 చైనా యుద్ధంలో, 1971 పాక్ యుద్ధంలో భారత సైనికులను, ముక్తి వాహిణి (బంగ్లా సేన)ని తమ వినోద కార్యక్రమాలతో ప్రఖ్యాత నటుడు సునీల్ దత్ ఉత్తేజపరిచారు. ఆయన సుపుత్రుడు సంజయ్ దత్ ఏ మత్తులో మునిగారో? టాయిలెట్ల నిర్మాణాంశంలో మోడీ భజనతో ఒక చిత్రాన్నే నిర్మించిన అక్షయ కుమార్ కు పద్మావతి పరిగణనాంశంగా తోచలేదా? తృణమూల్ కాంగ్రెస్ తరపున లోక్ సభ సభ్యులైన ఐదుగురు నటులు, బిజు జనతాదళ్‌తో రాజ్యసభ సభ్యుడైన ఒడియా నటుడు అనుభవ్ మొహంతి, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి ప్రతిపక్షాలలో ఉండి కూడా ఎందుకు మాట్లాడటం లేదో? అధికారాలకు అర్రులు చాస్తూ నీతినియమాలు తప్పిన రాజకీయులతో సమాజంతో ధనీయులై సామాజిక బాధ్యత కలిగిన చిత్రసీమ తారలూ మమేకమయ్యారా?

ఈ చిత్రం తాము అనుమానించినట్లుగా కాక రాజపుత్రుల గొప్పతనాన్ని, త్యాగాన్ని చాటే విధంగా, రాజపుత్రులు గర్వించేటట్లుగా ఉందని చిత్రాన్ని తిలకించిన కర్ణిసేన ముంబయి శాఖ నేతలు ప్రశంసించారు. బీజేపీ పాలిత గుజరాత్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ లలో సినిమా విడుదలకు సహకరిస్తామని అధికారులకు లేఖ రాశారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల లబ్ధి పొందాక, రాజస్థాన్ లో మట్టి కరిచాక బుద్ధి వచ్చిందేమో? వీళ్ళ వీరంగంతో కల్పించిన నష్టాన్ని ఎవరు భరిస్తారు? అదానీ, అంబానీల ఖాతాల్లో కలుపుతారా? సంఘ్, బీజేపీల చందాల నుండి చెల్లిస్తారా?

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545

పుట్టినరోజు వేడుక, పెళ్ళి ఫంక్షన్, లేదంటే ఇంట్లో జరిగే ఇంకేదైనా శుభకార్యం కావచ్చు....కామన్‌గా కనిపించేది కూల్ డ్రింక్. పార్టీలు, పబ్‌లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, సూపర్ మార్కెట్లు ఇలా ఒకటే మిటి.... ఎక్కడికి వెళ్ళినా రా రమ్మని పిలుస్తున్నట్టుగా కొలువు దీరి కనిపిస్తాయి ఈ సాఫ్ట్ డ్రింక్స్. ఈ శీతల పానీయాలు. ఇవి పేరుకే సాఫ్ట్ డ్రింక్స్. నిజానికి ఇవి మనిషికి మృత్యుద్వారాలు.

శీతల పానీయాలు మృత్యు ద్వారాలు!

పుట్టినరోజు వేడుక, పెళ్ళి ఫంక్షన్, లేదంటే ఇంట్లో జరిగే ఇంకేదైనా శుభకార్యం కావచ్చు....కామన్‌గా కనిపించేది కూల్ డ్రింక్. పార్టీలు, పబ్‌లు, రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు, సూపర్ మార్కెట్లు ఇలా ఒకటేమిటి....ఎక్కడికి వెళ్ళినా రా రమ్మని పిలుస్తున్నట్టుగా కొలువు దీరి కనిపిస్తాయి ఈ సాఫ్ట్ డ్రింక్స్. వెంటాడి, విసిగించేంతగా మన జీవన సంస్కృతిలో భాగమైపోయాయి ఈ శీతల పానీయాలు. ఇవి పేరుకే సాఫ్ట్ డ్రింక్స్. నిజానికి ఇవి మనిషికి మృత్యుద్వారాలు. కోలుకోలేని జబ్బులకు నిలయాలు. వీటికి అలవాటు పడితే మన ఆయువును మనం హరించేసుకున్నట్టే. అనేక సర్వేలూ ఈ విషయాన్ని రూఢి చేశాయి. కూల్ డ్రింక్, కోల్డ్ డ్రింక్, కార్బోనేటెడ్ డ్రింక్, ఫిజ్జీ డ్రింక్, ఫిజ్జీ జ్యూస్, పాప్, సోడా...ఇలా పేరుఏదైనా ఈ పానీయాలన్నీ ప్రమాదకరమైనవే. మనిషి ఆరోగ్యాన్ని క్రూరంగా, ఘోరంగా దెబ్బతీసేవే. ఇవి పేరుకే సాఫ్ట్ డ్రింక్స్ కానీ దాదాపుగా హాట్ డ్రింక్స్ (ఆల్కహాల్) అంత హానికరమైనవి. ఈ సాఫ్ట్ డ్రింక్స్‌లోనూ ఎంతోకొంత ఆల్కహాల్ కలుస్తుందనే విషయం మనలో ఎంతమందికి తెలుసు! ఆకర్షణీయమైన వీటి రంగు, రుచికి నాలుక అలవాటుపడుతుందేమో గానీ శరీరం మాత్రం కృశించిపోతుంది. ఇది తెలుసుకోవలసిన వాస్తవం. వీటి రంగు, రుచి వెనక చాలాచాలా ప్రమాదకరమైన పదార్థాలు ఉన్నాయి.

శీతల పానీయాల్లో ఎలాంటి పోషకాలూ ఉండవు. పైగా అత్యంత హానికరమైన రసాయనాలతో నిండి ఉంటాయి. వీటిలో అధికంగా ఉండే షుగర్, ఫ్రక్టోజ్‌తో నిండి ఉండే కార్న్ సిరప్‌లు మన శరీరంలోని ప్రతి అవయవంపైనా దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. డయాబెటీస్‌కి కారణమవుతాయి. గుండె, కాలేయంపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. వీటిని నిల్వ చేసేందుకు ఉపయోగించే పాస్ఫారిక్ యాసిడ్ ఎముకలను గుల్ల చేస్తుంది. కిడ్నీ వ్యాధులను తీసుకొస్తుంది. ఇందులో పరిమితిని మించి ఉపయోగించే సిట్రిక్ యాసిడ్ అనేక దంత సమస్యలకు కారణమవుతుంది. కోక్‌లో ఉపయోగించే కారామెల్ కలర్, రసాయనాలు కేన్సర్‌కూ కారణమవుతాయి. ఎప్పుడో ఏడాదికోసారి తాగేవాళ్ళకి పర్వాలేదు కానీ రోజూ టిన్నుటిన్నులు తాగేవాళ్ళు మాత్రం జాగ్రత్తపడాల్సిందే. లేదంటే ఈ అలవాటు ఏకంగా వారిని మింగేస్తుంది. బరువు పెరగడం, ఒబెసిటీ, స్థూలకాయం, ఊబకాయం సమస్యలతో పాటు ఆస్తమాకు ఇవి కారణమవుతాయి. రోజుకి ఒకటి లేదా అంతకుమించి తాగేవారు బాగా బరువు పెరుగుతారు. ముఖ్యంగా మహిళల్లో ఇది టైప్ 2 డయాబెటీస్‌కి దారితీస్తుంది. రోజువారీ జరిగే జీవక్రియలూ మందగిస్తాయి. రోజూ శీతలపానీయాలు తీసుకునే వారిలో గుండెపోటు వచ్చే ముప్పు 20శాతం ఎక్కువ. రోజుకి ఒకటి కంటే ఎక్కువ టిన్నులు తాగేవారిలో టైప్ 2 డయాబెటీస్ వచ్చే ముప్పు 26 శాతం అధికం. గౌట్ ముప్పు 75 శాతం ఎక్కువ ఉంటుంది. 50 శాతం మంది మెటబాలిక్ సిండ్రోమ్ బారిన పడుతున్నారు. వారానికి రెండు అంతకుమించి తాగేవారిలో పాంక్రియాటిక్ కేన్సర్ వచ్చే ముప్పు రెండింతలు ఎక్కువ. కూల్‌డ్రింక్స్ ఎక్కువగా తాగే టీనేజ్ బాలికల్లో పీరియడ్స్ మూడు నెలలు ముందుగానే ప్రారంభమవుతాయి!

కూల్‌డ్రింక్‌ల్లో అధికంగా ఉండే పాస్ఫారిక్ యాసిడ్ ఎముకలను పెళుసుబారుస్తుంది, ఆస్టియోపోరోసిస్‌కి కారణమవుతుంది. సాఫ్ట్ డ్రింక్స్ ఎక్కువగా తీసుకునే మహిళల్లో ఎముకల సాంద్రత 4 శాతం తగ్గిపోతుంది. రోజుకి రెండు గ్లాసులు కోలా తాగేవారిలో కిడ్నీ సమస్యలు రెండు రెట్లు ఎక్కువగా ఉంటాయి. యూరిన్ సమస్యలతో పాటు కిడ్నీలోరాళ్ళు, కిడ్నీలు పాడైపోవడం లాంటి తీవ్ర జబ్బులూ వస్తాయి. కూల్‌డ్రింకుల్లో వాడే ఫ్రక్టోజ్‌తో నిండిన కార్న్‌సిరప్ (హెచ్‌ఎఫ్ సిఎస్) వల్ల శరీర కణాలు పనిచేయకుండా పోతాయి. వీటిల్లో ఉండే కెఫిన్ నిద్రను చెడగొడుతుంది. రోజుకి 500 ఎంఎల్ మించి తాగితే అలర్జీలు వస్తాయి. ఇవన్నీ పద్నాలుగేళ్ళు, ఎనిమిదేళ్ళ సుదీర్ఘకాలం జరిగిన పరిశోధనల్లో తేలిన ఫలితాలు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితి ప్రకారం రోజుకి 6 టీ స్పూన్‌లు మాత్రమే షుగర్ తీసుకోవాలి. కానీ ఈ సాఫ్ట్‌డ్రింక్‌ల్లో ఉండే షుగర్ 10 టీ స్పూన్‌లు పైమాటే. ఈ పానీయాల్లో వాడే కృత్రిమ స్వీట్‌నర్లు మంచివి కావు. ప్రత్యేకించి ఇవి చిన్న పిల్లలు, ఎదిగే పిల్లల ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తాయి. ఈ సాఫ్ట్ డ్రింక్స్ మానేసిన పిల్లల్లో ఊబకాయం గుర్తించదగిన స్థాయిలో తగ్గినట్లు సర్వేలు తేల్చాయి. ఈ సోడాల్లో ఉండే షుగర్ నోటిలోని బాక్టీరియాను యాసిడ్‌గా మారుస్తుంది. ఈ యాసిడ్ పళ్ళ మీద ఉండే ఎనామిల్‌ను పోగొడుతుంది. ఫలితంగా పళ్ళు బలహీనమైపోతాయి. ఈ దుష్ప్రభావం కూడా ఎదిగే వయస్సులో ఉన్న పిల్లల మీదే ఎక్కువ ఉంటుంది. కూల్‌డ్రింక్‌ను స్ట్రాతో తాగినా లేదా మామూలూగా తాగినా సరే తాగిన అరగంటలోపు బ్రష్ చేసుకుంటే కొంతైనా ఉపశమనం ఉంటుంది. బహుళ జాతి కంపెనీలు ఏకధాటిగా ఈ శీతల పానీయాలను ప్రపంచ దేశాల మార్కెట్‌లో కుమ్మరిస్తున్నాయి. కాసుల కోసం ఈ కంపెనీలు చేస్తున్న మాయలో అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా పడింది. దాని ఫలితమే స్థానిక ప్రజల అలవాట్లనూ మార్చింది. ఇది అర్థం చేసుకోలేని భారతీయులు వాటి వెంటే పరుగులు తీస్తున్నారు. అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. వాళ్ళు వీళ్ళు అని లేకుండా అన్ని వయస్సుల వారి ఆరోగ్యాన్నీ ఈ శీతల పానీయాలు కుంగదీస్తున్నాయి. మహిళలు, పురుషులు అని తేడా లేకుండా అందరినీ మృత్యువుకు చేరువ చేస్తున్నాయి. జనం ఆరోగ్యాన్ని, అవయవాలను పీల్చిపిప్పి చేస్తున్న ఈ శీతల పానీయాలపై ప్రభుత్వాల నియంత్రణ, కట్టడి లేకపోవడం విచారకరం. పైపెచ్చు మార్కెట్‌లో అమ్మకాలకు అనుమతులు ఇవ్వడం శోచనీయం. ప్రజల ఆరోగ్యాలపై ప్రభుత్వాలకు ఏ మేరకు శ్రద్ధ ఉందో తెలియజేసే ఉదాహరణల్లో ఇదీ ఒకటి.

వచ్చేది ఎండాకాలం. దాహంతో ఆర్చుకుపోయే నోటికి ఎక్కువమంది అందించేది ఈ సాఫ్ట్ డ్రింక్‌లే. వీటి గురించిన వాస్తవాలు తెలుసుకున్నాక కూడా వాటిని తాగడం మానకపోతే చేజేతులారా జబ్బులను ఆహ్వానించినట్టే. డాక్టర్లకు ఇచ్చేందుకు డబ్బులు రెడీ చేసుకోవలసిందే. శీతల పానీయాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. వీటి బదులు సాధ్యమైనంత ఎక్కువ మంచినీళ్ళు తాగండి. కాదంటే ఆరవై ఆరు జబ్బులకు ఔషధంగా పనిచేసే మన దేశీయ పానీయం కొబ్బరి నీళ్ళు తీసుకోండి. పెరుగుతో కూడిన తాజా స్మూతీలు, ఇంట్లో తయారుచేసుకున్న పండ్ల రసాలు, తేనె తాగండి. మీ ఆరోగ్యాన్ని పది కాలాల పాటు పదిలంగా కాపాడుకోండి.

– జ్యోతి

లోచనం

ఆంధ్రుల ఆత్మగౌరవం తాకట్టు పెట్టొద్దు

బండారు రాధాకృష్ణ

ప్రత్యేకహోదా విషయంలో ప్రజలు గొంతు విప్పితే గాని ప్రధానపార్టీల నాయకుల నోరు పెగలడం లేదు. ఈ విషయంలో నాయకుల తీరు గర్హనీయం. విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగుల రోడెక్కితే గాని నాయకులు కళ్ళు తెరవకపోవడం శోచనీయం. ప్రధాని మోడీ బడ్జెట్ ప్రసంగంలో ఎన్టీఆర్ ప్రస్తావన తెచ్చారు. 1982లో ఆత్మగౌరవ నినాదంతో టీడీపీ పార్టీ స్థాపించి ఆంధ్రుల గౌరవాన్ని దేశ విదేశాల్లో ఎలుగెత్తి చాటారని మోడీ అన్నారు. అంటే ఇప్పుడు రాష్ట్రానికి అన్యాయం జరిగినా తమ ప్రభుత్వంపై నోరువిప్పని రాష్ట్ర నాయకుల తీరుపై పరోక్ష వ్యాఖ్యలుగా భావించారనుకోవచ్చు. ప్రత్యేకహోదా కాదు ప్రత్యేక ప్యాకేజీ అంటే చంద్రబాబు సరే అన్నారు. అన్నట్లు నిధులు ఇవ్వకపోయినా నోరెత్తరని మోడీ అభిప్రాయపడ్డారనుకోవాలా? ప్రజలు తిడతారేమో అన్నట్లుగా మనం ఎంపీలు పార్లమెంటులో మాట్లాడారుగాని పోరుబాటలో వారి ఆలోచనలు లేవని ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆత్మగౌరవ నినాదాలతో ప్రత్యేకహోదాపై నాయకులు ముందుకు రావలసి వుంది. గతంలో నాదెళ్ల భాస్కరరావు అక్రమ పద్ధతిలో కేంద్రంతో కుమ్మక్కై ఇందిరను అడ్డుపెట్టుకొని ఎన్టీఆర్‌ను గద్దె దించినపుడు ప్రజలంతా రోడ్డెక్కారు. తిరిగి ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించక ఇందిరకు తప్పలేదు. అయినా తిరిగి ప్రజల నిర్ణయం కోసం ఆనాడు అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలు జరిపి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్టీఆర్ ఫొటో పెట్టుకోవడం తప్ప ఆ త్యాగం ఇప్పటి తెలుగుదేశం నాయకులలో మచ్చుకు కానరావడం లేదు. ప్రజల కోసం ఇద్దరు మంత్రులతో రాజీనామాలు చేయించని చంద్రబాబు ఇప్పటికీ ఓర్పుతో వ్యవహరించాలనడం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. మేము మద్రాసీలం కామని పదహారణాల ఆంధ్రులమని ఎలుగెత్తి చాటిన ఎన్టీఆర్ ఆత్మ క్షోభించదా? అమరావతిలో సచివాలయ నిర్మాణం భూమి పూజకు చెంబెడు నీళ్ల మట్టితో వచ్చిన మోడీ తీరు అర్థం చేసుకోలేక నాలుగేళ్ళు అణిగిమణిగి వున్నా నిన్నటి బడ్జెట్‌లో అన్యాయం జరిగింది.

ఈ పరిస్థితిలో దాదాపు ఇదే ఆఖరి బడ్జెట్‌గా భావించి కూడా ఇంకా పోరాటానికి వెనుకాడటం ప్రజలు సహించరు. అసలు కేంద్రానికి భయపడటానికి కారణాలు చంద్రబాబు ప్రజలకు వివరించవలసిన అవసరం వుంది. ఇంకా ఓర్పుకు కారణం ఆశ వదలకా లేక వ్యక్తిగత ప్రయోజనాలా అనే సందేహం ప్రజలు వ్యక్తపరుస్తున్నారు. అవసరాల నేపథ్యంలో నేడు రాజకీయాలు నడుస్తున్నాయి. అలా ఆలోచించినా మన ఎంపీల సహాయం కేంద్రానికి అవసరమే. అయినా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు చూస్తూ వూరుకోరు. ప్రభుత్వం వెనకాడినా ప్రజలు రోడ్డెక్కి పోరాటం చేయడానికి సిద్ధంగా వున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అవమానాలు భరించానని చంద్రబాబు అంటున్నారు. అసలు ఈ నిరాదరణకు కారణాలేమిటో ప్రజలకు వివరించాలి. ప్రతి విషయంలోను ఇష్టమున్నా లేకపోయినా ప్రధాని మోడీని అనుసరిస్తూ వచ్చారు. ఆరెస్సెస్ కూటమి తృప్తికోసం దేశాన్ని ఆధ్యాత్మిక దేశంగా మార్చాలనే తాపత్రయంలో మోడీ చేసిన ప్రయత్నాలు ఇక్కడ చంద్రబాబు అనుసరిస్తూ వచ్చారు. నష్టాల ఊబిలో వున్నామని అనాథలమని, పది నెలల పసిబిడ్డ మన రాష్ట్రం అంటూనే వేలకోట్లు పుష్కరాల పేరిట ఖర్చుచేసి సుమారు 50 మంది మరణానికి కారకులయ్యారు. అందరి ముఖ్యమంత్రులు చేయలేని పని చేయాలని వందల కోట్లు ఖర్చుచేసి మహిళా పార్లమెంటు సదస్సు నిర్వహించారు. ప్రజలు అడగకపోయినా చంద్రన్న కానుక పేరిట అన్ని మతాలవారికి పండుగ కానుకలు అందజేశారు. నష్టాలతో అలమటిస్తున్న రాష్ట్రం చేయదగిన ఖర్చేనా అని విజ్ఞులు ముక్కున వేలేసుకున్నారు.

1983 జనవరి 5వ తేదీన ఎన్నికలుండగా 3వ తేదీనా తిరుపతి ఆఖరి ప్రచారంలో ఎన్టీఆర్, ఇందిరా గాంధీ సభలు సరిగాయి. అయితే 3వ తేదీ ఉదయం తిరుపతి బయలుదేరేముందు విలేకరుల సమావేశం గుడివాడలో జరిగింది. ఆ సమావేశంలో ఒక విలేకరి ఇండియాటుడే సర్వేను ఎన్టీఆర్ అందించారు. అందులో సర్వేలో తెలుగుదేశానికి 102 సీట్లు రావచ్చునని వుంది. అది చూచి ఇది మంచి అవకాశం అయిదేళ్లు ప్రతిపక్షంలో వుండి ప్రజాసమస్యలపై పోరాడవచ్చునన్నారు ఎన్టీఆర్. కాని ఈనాడు 30 ఏళ్లు నేనే ముఖ్యమంత్రిగా వుంటానని జగన్ అంటే అది జరగని పని నేనే వుంటానని చంద్రబాబు అనడం తప్ప పదవులు వదలుకోడానికి ఇష్టపడటం లేదు. ఇటు తెలుగుదేశం అటు బీజేపీ ఒకరిపై ఒకరు విమర్శల వర్షం కురిపిస్తూ కలిసే ఉంటామని, కలిసే పోటీ చేస్తామని అదే డ్రామాలతో ప్రజల తలలు బొప్పి కడుతున్నాయి. అసలు ఇప్పటి వరకు కేంద్రం ఇచ్చినది ఖర్చు పెట్టినది శ్వేతపత్రం విడుదల చేయమని వామపక్ష నాయకులు అడిగినా, అన్నీ నెట్టులో పెట్టాం, చూచుకో మంటారు. సామాన్య ఓటరుగా తెలియకుండా వుండాలనే ప్రభుత్వ ఉద్దేశమేమో. ఈ రోజుకూ ఎస్సీలపై జరిగే దాడులకు జవాబులేదు. పరామర్శకు వెళ్లిన వామపక్ష నాయకులను అరెస్టు చేయడానికి మాత్రం పోలీసులను ఆఘమేఘాలపై పంపే ప్రభుత్వం సమస్య పరిష్కారానికి పూనుకోదు. అవినీతి విషయంలో నోరు మెదపదు. ఇవన్నీ ప్రజలు గమనిస్తూనే వున్నారనే విషయం తెలుసుకోకపోతే అధికార పార్టీకే నష్టం.ఇప్పటికైనా జెండాలు పక్కనపెట్టి ప్రత్యేకహోద జెండా పట్టుకోకపోతే పార్టీ నాయకులను ప్రజలు క్షమించరు. అందరూ కలిస్తే హోదా ముగిసిన అధ్యాయం అనేవారి కళ్లు తెరిపించి సాధించవచ్చునేది ప్రజల ప్రగాఢ విశ్వాసం.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
16 ఫిబ్రవరి 2018

చూడచక్కని చిలకమ్మ!



రంగురంగుల పువ్వుల నడుమ చూడచక్కని ఆకుపచ్చని చిలకమ్మ. చూడగానే ఆహ్లాదాన్ని కలిగిస్తున్న, ఆహా అనిపిస్తున్న ఈ దృశ్యం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లోది.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలంటే శ్రీమంతులే అయ్యుండక్కర్లేదు....మంచి మనస్సుంటే చాలు. ఉన్నదాంట్లోనే ఎంతోకొంత సాటివారికి సాయం చేయడమే అసలైన మానవత్వం. ఏదేమైనా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనుకోవడమే నిజమైన మంచితనం. ఇవన్నీ చెప్పకోవడానికి బానే ఉంటాయి....చెయ్యడమే కష్టం...అయినా ఆచరణలో పెట్టే మనుషులూ ఉన్నారు...వారికి అండగా నిలబడే సంస్థలూ ఉన్నాయి....ఈ కోవకు చెందినదే డాక్టర్ మహ్మద్ అలీ సేవా సమితి. సినీ నటుడు ఆలీ స్ఫూర్తితోనే ఆయన పేరునే సేవా సమితిని స్థాపించారు. విశేషమేమంటే ఇందులో ఉన్నవారంతా చిరు వ్యాపారులే. తాము ఎలాంటి పరిస్థితుల్లో అవసరమైనవారికి సాయం అందించే ఆపద్బాంధవులు వీరు. వారు చేసిన, చేస్తున్న సేవా కార్యక్రమాలే ఇందుకు నిదర్శనం.

అలీ సేవా సమితి... ఆపద్బాంధవి!



కిడ్నీ వ్యాధిగ్రస్తులు లినెట్ జాన్సన్‌కు ఆర్థికసాయం అందిస్తున్న అలీ సేవా సమితి అధ్యక్షులు, సభ్యులు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అలీ సేవా సమితి అధ్యక్షులు, సభ్యులు

అలీ....బాల నటుడి స్థాయి నుంచి ప్రముఖ హాస్య నటుడుగా ఎదిగిన వైనం అందరికీ తెలుసు. నటుడిగా వెండితెర మీదేకాదు యాంకర్‌గా బుల్లితెర మీదా తనదైన ముద్రతో రాణిస్తున్నాడు. ఇదీ ఆయన గురించి అందరికీ తెలిసిన విషయాలు. ఆయన గురించి ఎక్కువమందికి తెలియని విషయం ఒకటి ఉంది. అదే సేవా కార్యక్రమాలు. రాజమండ్రిలో ఆయన ఒక సేవా సమితిని నిర్వహిస్తున్నారు. తన సంపాదనలో కొంత మొత్తాన్ని దీనికోసం ఖర్చు పెడుతున్నారు. పేదసాదల కోసం తన వంతు సాయం అందిస్తున్నాడు. అవసరమైనవారిని ఆదుకునేందుకు చేతనైనంత చేస్తున్నాడు. ఈ విషయాలన్నీ తెలుసుకున్నారు గుంటూరుకు చెందిన మస్తాన్‌వలీ. నలుగురికీ సేవ చేసే విషయంలో ఆయన బాటలోనే నడవాలనుకున్నాడు. అందుకే ఆయన పేరుమీదే డాక్టర్ మహ్మద్ అలీ సేవా సమితిని ఏర్పాటు చేశారు. తనతోపాటు మరికొంతమందిని ఇందులోకి తీసుకొచ్చారు.

అంతా చిరు వ్యాపారులే!

సేవాసమితిని నడుపుతున్నారంటే వీళ్ళంతా డబ్బున్న మారాజులు అనుకుంటే పొరపాటే. ఇందులో ఉన్నవాళ్ళంతా చిన్నచిన్న వ్యాపారులే. వారికొచ్చే ఆదాయంతో తమ కుటుంబాలను పూర్తిగా పోషించుకోవడమే కష్టం. అయినా ఏమాత్రం ఆలోచించకుండా ప్రతి నెలా కొంత సొమ్మును విరాళంగా ఇస్తున్నారు. పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఇదేదో నిన్నమొన్నటి నుంచి జరుగుతున్నది కాదు. గుంటూరులో అలీ సేవా సమితి ఈ కార్యక్రమాలను పదేళ్ళ నుంచి నిర్వహిస్తోంది.

2008లో ఏర్పడిన ఈ అలీ సేవా సమితిలో వ్యవస్థాపకుడు మస్తాన్‌వలీ స్నేహితులు రమేష్ నాయుడు, సలీమ్, నజీర్, మణి, అల్లాభక్షు, బుజ్జి, అనిల్, పవన్, నాగరాజు, నాగిరెడ్డిలు సభ్యులుగా ఉన్నారు. ఇటీవల కాలంలో మరో పదిమంది ఇందులోకి వచ్చారు. సేవాసమితి వ్యవస్థాపకుడు మస్తాన్ వలీ కలప వ్యాపారి కాగా మిగిలినవారిలో ఎక్కువమంది వడ్రంగి పనులు, స్వర్ణవృత్తికారులులాంటి చిన్నచిన్న పనులు చేసుకునేవారే ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదానమే ప్రాణదానంగా నమ్మిన వీరు ఏటా సినీనటుడు ఆలీ జన్మదినోత్సవం రోజున రక్తదానం నిర్వహిస్తారు. ప్రాణాపాయంలో ఉన్న రోగులకు రక్తదానం చేసి ప్రాణదాతలు అవుతున్నారు. అన్నిదానాల్లోకి రక్తదానం మిన్న అనే స్లోగన్‌తో రక్తదానం చేస్తున్నారు.

వివిధ పర్వదినాల్లో గుంటూరు నగరంలో ఉన్న వృద్ధాశ్రమాలకు వెళ్లి వారికి దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తారు. కన్న బిడ్డలు వదిలేసినా తాము ఉన్నామని వారికి మంచి ఓదార్పును ఇస్తారు. ఇలా అన్ని మార్గాల్లో సేవాకార్యక్రమాలు చేస్తూ పదిమందికి మార్గదర్శకంగా జీవిస్తున్నారు.

ఎన్నో సేవా కార్యక్రమాలు!

డాక్టర్ మహ్మద్ అలీ సేవా సమితి పదేళ్ళుగా ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించింది. పేదల కోసం దాదాపుగా ఐదు లక్షల రూపాయలు ఖర్చు పెట్టింది. సేవాసంస్థలో ఉన్న సభ్యులే విరాళాలు ఇచ్చి పేదలను ఆదుకుంటున్నారు, ఆపద్బాంధవులుగా మారుతున్నారు. ఈ సమితి చేసిన సేవా కార్యక్రమాల గురించి చెప్పుకోవాలంటే చాలానే ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గుంటూరు కృష్ణానగర్‌లో నివాసి లినెట్ జాక్సన్‌కు ఆలీసేవా సమితి కార్యవర్గం సభ్యులు అందరూ కలిసి ఆర్థికసాయం అందించారు. గుంటూరులో నల్లచెరువుకు చెందిన శాంభవిలక్ష్మి కేన్సర్‌వ్యాధితో బాధపడుతుందని తెలుసుకుని ఈ సేవాసమితి ఆర్థికసాయం అందించింది. ఇలా ఎంతోమంది రోగులకు ప్రతినెలా సాయం అందిస్తూ పదిమంది నుంచీ ప్రశంసలు అందుకుంటున్నారు. గుంటూరు నగరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పేద పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వ పాఠశాలలో కూడా చదువు కొనసాగించలేని పేద విద్యార్థులకు అవసరమైనవన్నీ అందించడం ద్వారా ఆసరాగా నిలబడుతున్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే మంచి సంకల్పంతో ఈ సమితి సభ్యులంతా కలిసి పనిచేస్తున్నారు. రాత్రివేళ పుట్‌పాత్‌లపై చలిలోనే ముడుచుకుని పడుకునే అనాథలకు దుప్పట్లు, రగ్గులు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు.

- జి.రమేష్, గుంటూరు

భవిష్యత్తులో పేదవిద్యార్థులకు ఉపకారవేతనాలు

సేవాసమితి అధ్యక్షులు మస్తాన్‌వలీ



భవిష్యత్తులో పేదవిద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలని నిశ్చయించాం. ఆర్థికస్థోమతలేక చదువు మధ్యలోనే ఆపేస్తున్న విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సినీనటుడు ఆలీ స్ఫూర్తితో ఈ సేవాసమితిని నడుపుతున్నాం. పేదలను ఆదుకోవాలనే ఒక ఉత్తమ ఆశయంతో దీన్ని నిర్వహిస్తున్నాం.

రోగుల కన్నులలో ఆనందం చూశాం

సేవాసమితి ఉపాధ్యక్షులు సలీమ్



రోగులకు ఆర్థిక సాయం చేసినప్పుడు వారి కన్నులలో ఆనందం చూశాను. మా సమితి ఆధ్వర్యంలో నిరంతరం కిడ్నీవ్యాధిగ్రస్తులకు, కేన్సర్ రోగులకు సాయం అందిస్తున్నాం. నెలనెలా మాకు వచ్చే ఆదాయంలోనే కొంతవరకు సొమ్ములు తీసి పేదలకు ఉపయోగిస్తున్నాం. పేదల కష్టాలను చూసి చలించిపోయి ఈ సమితిని ఏర్పాటు చేశాం.



పుట్‌పాత్‌పైన ఉన్న అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అలీసేవా సమితి అధ్యక్షులు, సభ్యులు





గుమ్మానికి పేపర్ తోరణం!

ఇంట్లో ఏవైనా వేడుకలు ఉన్నప్పుడు రంగు కాగితాలు తీసుకొచ్చి అలంకరించడం అందరికీ అనుభవమే. కొంచెం కళాత్మకంగా ఆలోచించగలిగితే వీటిని బయట నుంచి కొని తీసుకురానక్కర్లేదు. స్వయంగా మనమే ఇంట్లో తయారుచేసుకోవచ్చు. న్యూస్ పేపర్ లేదా రంగు కాగితాలను కట్ చేయడం ద్వారా రకరకాల ఆకృతులు తీర్చిదిద్దవచ్చు. తీరిక వేళల్లో చేసే ఈ పనితో ఇంటికి అందాన్నే కాదు మనస్సుకి ఆనందాన్ని సొంతం చేసుకోవచ్చు. అలా తయారు చేసినవే ఈ పేపర్ తోరణాలు. గుమ్మానికి ఎంత నిండుగా ఉన్నాయో చూడండి. విభిన్నమైన రంగులు, డిజైన్లతో ఇంటికి కొత్త కళ వచ్చినట్టు లేదూ!









కళ్ళ చుట్టూ మచ్చలకు కారకాలివే...!

కళ్ళ చుట్టూ నల్లమచ్చలు ఏర్పడుతుంటాయి. ఇది అన్ని రకాల వయస్సు మహిళలు ఎదుర్కొనే చాలా సాధారణ సమస్య. ఈ పరిస్థితి కళ్ళ కింద చర్మాన్ని నిర్జీవంగా, కళావిహీనంగా చేస్తుంది. ఇందుకు కారణాలనేకం ఉన్నాయి. హార్మోన్లలో మార్పులు, ఆరోగ్య సంబంధిత సమస్యలు, సరైన ఆహారం తీసుకోకపోవడం ఇలాంటివన్నీ కారణాలే. ఒక్కోసారి మన అలవాట్లూ ఇందుకు కారణమవుతాయి. అవును, ఇది నిజమే. మీరు మేకప్ వేసుకుంటారా? మరి రాత్రిపూట నిద్రకు ఉపక్రమించే ముందు దానిని తొలగిస్తున్నారా? లేదంటే కచ్చితంగా కళ్ళ కింద చర్మం పాడైపోతుంది. ఇలాంటి మన రోజువారీ అలవాట్లే ఈ నల్లమచ్చలు రావడానికి కారకాలవుతున్నాయి. మరి మార్చుకోవలసిన ఆ అలవాట్లు ఏమిటో తెలుసుకుందామా!



1. తగినంత నిద్ర లేకపోవడం

కంటి నిండి కునుకు తీయకపోతే రక్తప్రసరణ నెమ్మదిస్తుంది. ఇదే కళ్ళకింద నల్ల మచ్చలకు కారణమవుతుంది. చాలా రకాల సమస్యలకు దారితీసే ప్రధానమైన కారణాల్లో ఇదీ ఒకటి. ఇది కళ్ళకింద మచ్చలకే కాదు పలు రకాల చర్మ సమస్యలకూ కారణమవుతుంది.

2. కంటి మేకప్‌ను తొలగించకపోవడం

రోజూ ముఖంతో పాటు కళ్ళకూ మేకప్ వేసుకునే అలవాటు ఉందా! అయితే దానిని రాత్రివేళ నిద్రపోవడానికి ముందు కచ్చితంగా తొలగించండి. లేదంటే కంటి కింద చర్మం దెబ్బతింటుంది, నల్లగా అయిపోతుంది.

3. డీహైడ్రేషన్

నల్లమచ్చలకు, డీ హైడ్రేషన్‌కు మధ్య సంబంధం ఉందని అనేక సర్వేలు తేల్చాయి. ఇది ఎవరో చెప్పక్కర్లేదు. స్వయంగా మనకి కూడా అనుభవంలో ఉండే విషయమే. డీహైడ్రేషన్ బారిన పడితే కళ్ళ చుట్టూ చర్మం పొడి, గరుకుగా తయారవుతుంది.

4. అదేపనిగా కళ్ళు రుద్దడం

కళ్ళ కింద చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా ఇది దెబ్బతింటుంది. కళ్ళు దురదగా ఉన్నప్పుడు లేదా ఇతరత్రా కారణాల వల్ల కొంతమంది కళ్ళను అదేపనిగా రుద్దేస్తుంటారు. దీనివల్ల కంటికింద చర్మం కమిలిపోతుంది, రంగు మారిపోతుంది, ఇదే మచ్చలకు దారితీస్తుంది.

5. సూర్యకాంతి

ఎండ వేడి నేరుగా కళ్ళకు తగిలినా ప్రమాదమే. ఇది తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. సున్నితమైన కంటి చర్మాన్ని ఇది దెబ్బతీస్తుంది. దీనివల్ల కంటిదగ్గర చర్మం రంగు మారడమే కాదు వయస్సు పై బడిన లక్షణాలూ తొందరగా కనిపిస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ఎండలోకి వెళ్ళేటప్పుడు కంటిచుట్టూ సన్‌స్క్రీన్ రాసుకోవాలి.

6. వేడినీళ్ళతో కడగడం

కంటి చుట్టూ చర్మం సున్నితంగానే కాదు పలచగానూ ఉంటుంది. అందుకే కళ్ళను ఎప్పుడూ బాగా వేడినీళ్ళతో కడగరాదు. అలాచేస్తే మచ్చలు రావడం ఖాయం. కళ్ళు, చర్మం మీద ప్రతికూల ప్రభావం చూపించే కారణాల్లో ఇది కూడా ఒకటి.

7. నాసిరకం మేకప్ ఉత్పత్తులు

కంటి చుట్టూ మేకప్ వేయకపోవడమే ఉత్తమం. కాదు కూడదు వేయాల్సిందే అనుకునేవాళ్ళు మంచి ఉత్పత్తులను వాడాలి. లేదంటే కంటి ఆరోగ్యానికే ప్రమాదం. నాసిరకం ఉత్పత్తుల కారణంగా చర్మం నిర్జీవంగా మారుతుంది, పాలిపోతుంది.





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఒక్కజాతికే చెందిన రెండు మూడు రాగాలు కలిసి పాడితే యెలా గుంటుందో, ఒక్క రాగమే వేరువేరు స్థాయిల్లో యేక సమయంలో నలుగురు పాడితే యెలా ధ్వనిస్తుందో? సాంప్రదాయం అంటే చెవికోసుకొనేవాడిని నాకే యీ విప్లవ బుద్ధులు పుడుతున్నాయే? అయినా నేను మొదటి దగ్గర నుంచీ - తెలుగువాడిదీ, తెల్లవాడిదీ అన్నింటిలోనూ మిళితం చెయ్యాలి అని చెవికోసిన మేకలాగు అరుస్తూనే వున్నాను. కాని నా గోడు వినేవాడెవడు - ఈ ఉద్యమం రోజుల్లో! మీదుమిక్కిలి నన్ను దేశద్రోహి అని తిట్టిపోశారు కూడాను! ఎప్పటికైనా నా దారికే వచ్చితీరాలి. లేకపోతే మన కలలకీ మనకీ కూడా మోక్షంలేదు...

....సంగీతం చక్కగా యెవరిమటుకు వాళ్ళు పాడుకుంటే, కానీ ఖర్చులేకుండా ఆనందం పొందవచ్చు - కళనీ అభివృద్ధి చెయొచ్చు. అయితే నాకూ శాంతానికీ యిచ్చినట్లు - దేవుడు అందరికీ గాత్రం యిచ్చాడా?

(నిన్నటి సంచిక తరువాయి)

సుభకేదేనా వాద్యం కొందాం అని శాంతం నన్ను బలవంతం చేసి మౌంటురోడ్డు కీడ్చుకుపోయింది. ముప్పాతిక కొల్తఫిడేలు ఒక మోస్తరుది ఎనభై రూపాయలకి తక్కువ లేదన్నాడు దుకాణదారుడు. రెండువందలకిలోపు వీణే లేదన్నాడు. అదయినా పురమాయిస్తేనేనట - బంగీ రవాణా ఖర్చులు అదనం అన్నాడు. ఇంత ధరలు పోసి ఆపాటి ఈపాటి సంసార్లు యెవరు కొనగలరు? నేను పెదిమ విరవడం కనిపెట్టి, "ఆర్మోనియం కొనండి - ఇరవై రూపాయలకి జంట స్వరాలది పెద్దపెట్టె యిస్తాను" అన్నాడు కొట్టు అతడు. శాంతం వద్దు అన్నా సంగీతపు పెట్టె కొనేశాను. చక్కగా కావడి పెట్టె అంత సర్వజనామోదంగా వుంది. అయినా మన సంగీత విద్వాంసులు, కళారాధకులు ఒకవైపు హార్మోనియాన్ని అసహ్యించుకుంటూనే - మరోవైపు సాక్సోఫోనుని - ట్రోంబోనునీ మన సంగీతంలో వాడుక చేస్తున్నారు. హార్మోనియాన్ని ఏవగించుకోవడం మానేసి - జనసామాన్యం ఆర్థికస్థితిని తెలుసుకొని - అందరికీ అందుబడిలోవున్న యీ వాద్యంకోసం ప్రత్యేకంగా సంగీతాన్ని సృష్టించివుంటే సంగీతకళని సామాన్యులకి అందించివుందురు. మరొకటి కూడా నా కనిపిస్తుంది. ఒక్కొక్క వాద్యంలో వుండే ఉత్కృష్టత - విశిష్టత చూపించేందుకు పాశ్చాత్య శాస్త్రజ్ఞులు - పియానో కోసం, ఫిడేలు కోసం, క్లారియో సెట్టుకోసం, ఆర్గను కోసం బ్యాండు మేళంకోసం - ఒక్కొక్క దానికి ప్రత్యేకంగా సంగీతాన్ని రాసినట్టు - మన విద్వాంసులు కూడా - హార్మోనియంకోసం ప్రత్యేకంగా సంగీతాన్ని రాస్తే ఎంతో బాగుంటుంది. అప్పుడే కదా నిజంగా కవిత్వంకంటే సంగీతమే అతీతం అవడం.

శాంతాన్ని ముఖ్యంగా పారిశ్రామిక కేంద్రాలకి తీసుకెళ్ళి ఇంగ్లండు యొక్క సిరిసంపదలని చూపిస్తాను. లాంకషైరులో వున్న పత్తిమిల్లులను చూస్తే ఖద్దరువెర్రి కొంత తగ్గుతుందేమో శాంతానికి. బస్సులో కూచున్నంతసేపు టిక్కెట్టు జాగ్రత్తగా వుంచుతాం. బస్సు దిగిపోయాక టిక్కెట్టు పారేస్తాం. అలాగే స్వరాజ్యం వచ్చిందాకా ఖద్దరుధారణ సబబుగానే వుండొచ్చు. స్వరాజ్యం వచ్చాకకూడా యెందుకు ఖద్దరు వేసుకోవడం? సీమలోకూడా ఖద్దరే వేసుకుంటానికి మొండిపట్టు పట్టడుగద? నేను సీమలో నాన్న తద్దినం పెడతానంటే అంత లచ్చనంగా వుంటుందో - తను సీమలో పల్నాడు గద్ద కడతానంటే అంత లచ్చనంగా వుంటుంది! ఆ గుడ్డలే కనక కట్టుకుంటే ఆవిడతో నేను నలుగురిలో యెట్లా తిరిగేది? ఇంగిత జ్ఞానం వున్న మనిషి కాబట్టి మనసు కొంత మార్చుకుంటుంది - శాంతం స్వభావం నాకు తెలుసుగా!.... అన్నట్టు - లాంకషైరులో బట్టల మిల్లులలో ముప్పాతిక మూడువంతులు తాళాలు పడిపోయి ఆ జిల్లాల్లో నిరుద్యోగం ప్రబలంగా వుందిగా. పోనీ మిడ్‌లాండ్సులో బొగ్గు పరిశ్రమని చూపిస్తా - పాశ్చాత్య నాగరికత బొగ్గుమీదేకదా ఆధారపడివుంది. అదీ వీలులేదే - బొగ్గు వ్యాపారం అంతా స్తంభించిపోయి - పనివాళ్ళందరూ అతి దరిద్రంలో మునిగి వున్నారే? అయితే మానె - యార్కుషైరు లోను, వేల్సులోను, చషైరులోను వున్న ఉక్కు ఇనుం పరిశ్రమ



చూపిస్తా - ఇంగ్లండు గొప్పతనం అక్కడేగా వున్నది? అక్కడా అదే కథగా - పొయ్యిల్లో నిప్పులేదు - బోయిలర్లలో ఆవిరి లేదు - గొట్టాల్లోనించి పొగ రావడం లేదు - పనివాళ్ళు కూలినాలి లేక పెళ్ళాం పిల్లలు పస్తులుంటున్నారు. అయితేనేం, నౌకా నిర్మాణాశ్రయాలని చూపించొచ్చుగా - గ్లాస్గోలోను, న్యూకాసిలులోను, హల్లులోనూ, సండర్లాండులోను - అన్నట్టు అక్కడ కూడ పనులు మందగించి ప్రజలు మలమలమాడిపోతున్నారే? అసలు - పారిశ్రామిక నాగరికతలో వున్న విశేషమే అది - వాణిజ్య వలయం - బీద ములగనూ, గొప్ప తేలనూ - లాభాలు అధిక లాభాలు - పస్తూ సహం పస్తూ - గిరాకీ సరఫరా పోటీలు

దివాళాలు-బేరాలు సారాలున్నా- దయా దాక్షిణ్యం లేకుండా యధావిధిగా జరగవలసిందే. అయినా - ఈ దరిద్రం చూసి శాంతం అడ్డు ప్రశ్నలు వేస్తే నేను జవాబు చెప్పలేను నాయనా! పామరులకి చెప్పొచ్చుగాని పండితుల నెవరొప్పించగలరు?

తిండి, గుడ్డ, కొంప, డబ్బు, సిరిసంపద - వీటి పంపకం అందరికీ యెందుకు సమానంగా జరగడం లేదూ - అని యక్షప్రశ్న వేస్తుంది శాంతం. ఎందుకు జరగాలి? - అని నేను అడ్డుప్రశ్న వేస్తే తనకి కోపం! దేశంలో వున్న ధనం అంతా ముప్పైమూడు కోట్ల దేవతలకీ పంచేస్తే యేముంది? - మనిషికి పట్టుమని పది అర్ధలు కూడా రావు. ఈ పంపిణీ యెవడికి వుపకారం చేసినట్టు! అన్నయ్య ఇరవై లక్షలు గడించాడు. అతని తరువాత వదిన పిల్లలు నలుగురు వేరుపడితే ఒక్కొక్కరికి చెరో నాలుగు లక్షలేనా రావు. ఏం సుఖపడగలరు? యెప్పటిలాగు దర్జాగా గడుస్తుందా? అహితాగ్ని పాకయాజి, హవిర్యాజి, సోమయాజులు వంశం కొంచెం సంకరం అవడం చేత - అన్నయ్యగారి పిల్లలికి మేధాసంపత్తి రాకపోయినా - పిత్రార్జితం వుంటుంది కాబట్టి ఉద్యోగాలు చెయ్యడం చేతకాకపోయినా రవ్వ రొష్టు పడకుండా వాళ్ళు కాలక్షేపం చెయొచ్చు... పొడుగు పొట్టి - లావు సన్నం - యెత్తూ పల్లం - కొండలోయ - శిఖరం అఖాతం - యెగుడు దిగుడు గొప్ప పేద - ధనం దరిద్రం - విందూ పస్తూ - నవ్వూ యేడుపు వుంటేనే అందం చందం; లేకుంటే చదునుచేసిన గచ్చునేల లాగు - చప్పిడి తిండి లాగు - కవితలేని నోళ్ళలాగు - మొద్దు మనుష్యుల బండజీవితం తయారవుతుంది. దైవసృష్టికీ మూలప్రకృతికీ వ్యతిరేకంగా వెళతాం అంటే యెలాగు? పాకీవాడికి పండితుడికి, పాచిపని చేసేదానికి సినీమాతారకి, వైస్రాయికి సైసుకి, సర్వసేనానికి సిపాయికి - ఒకటే జీతం అంటే యేడ్చినట్టే వుంటుంది. ప్లీడరు గుమాస్తాకీ, ప్రివీ కౌన్సిలు జడ్జికీ ఒకటే జీతపురాళ్ళు అంటే - నేను ప్లీడరు గుమాస్తా పనే చేస్తాను - అక్కరకుమాలిన కంఠశోష చిత్తక్షోభన్నూ? ఆఁ? పాతిక రూపాయిలే జీతం ముట్టినా ప్రివీకౌన్సిలు జడ్జీపనే చేస్తాను - నా తెలివితేటలకి నా అఖండ ప్రజ్ఞకి మంచి అవకాశం వుంటుంది! గౌరవం - హోదా - అధికారం - పలుకుబడి - ఇవి వుంటే ఇక కావలసిన దేముంది? జీతం ఎందుకు? వూరికే చేస్తాను. నాకు నచ్చిన పని దొరికినప్పుడు - నా ప్రతిభ ప్రదర్శించడానికి ప్రోత్సాహం కలిగినపుడు - మనస్సుకు యెంత ప్రశాంతంగా వుంటుంది! దేవుడు వ్యక్తులందరికీ శక్తిప్రపత్తులు వొక్కలాగే యిచ్చాడా? నాలాంటి అన్నయ్యలాంటి యే కొద్దిమందికో యిచ్చాడు. వాళ్ళు పైకివచ్చి మానవ సేవ చెయ్యాలి. అటే - రాబడిలో తారతమ్యం చూపించాలి. అప్పుడు యీ అతిరథులు మహారథులు దానకర్ణులు మాంధాతలు - రాత్రింబగళ్ళు కష్టపడి, వ్యవహారం పకడ్బందీగా నడిపించి వ్యాపారంలో చాకచక్యం చూపించి, లావాదేవీలు పొదుపుగా జరిగించబట్టే - వాళ్ళ బొక్కసాల్లో కాస్తడబ్బు కూడబెట్టి మిగిలినదంతా అందరికోసం సద్వినియోగం చేయగలుగుతున్నారు.. ఇంగ్లండులోను అమెరికాలోను కుబేరులుండబట్టే నూటికి తొంభై తొమ్మండుగురు గర్భదరిద్రులున్నా ఆ దేశాలు అష్టఐశ్వర్యాలతో తులతూగుతున్నాయి. మన దేశంలో కూడా మహారాజాధిరాజులు కోటీశ్వరులూ బలిచక్రవర్తులూ వుండబట్టేకదా - యెన్నో కోట్లు విలువగల భోగవిలాస వస్తువుల ఉత్పత్తి, పరిశ్రమ, వర్తకం సాగుతున్నాయి? యెన్ని సౌధాలు క్రీడా, విహారాలు, యెన్ని గుళ్ళు, గోపురాలు, యెన్ని మఠాలు, సత్రాలు, యెన్ని విద్యాపీఠాలు, ఆసుపత్రులు, యెన్ని సినిమా మందిరాలు, రేస్ కోర్స్‌లు - కట్టించి నడిపించి - కోట్లకొద్ది అద్దెలిచ్చి, లక్షలకొలది పన్నులు చెల్లించి వేలాదివేల జనానికి జీతాలిచ్చి ఉపాధులు కల్పించి, దానాలు ధర్మాలు చేసి భృత్యుకోటికి లక్షలా దాసదాసీజనానికీ యింత గంజిపోసి పోషిస్తున్నారు? అంచేత ప్రపంచంలో మనం కూడా మనుష్యులమే అని తల యెత్తుకుని తిరగ్గల్గుతున్నాం. దేశసౌభాగ్యం అంతా అందరి మీద పంపిణీ చేసేస్తే - అందరం పేదరికం అనుభవించవలసిందేకదా? అప్పుడు వీళ్ళందరినీ పోషించే వాళ్ళెవరు? ఇందరికి నిరుద్యోగం ప్రాప్తించవలసిందేకదా?

భాగ్యవంతులందరూ రాకాసులు; దుర్మార్గులు; మదాంధులు; కసాయివాళ్ళు అని దుమ్మెత్తి పోయడం ఒక వాడుకై పోయింది. ఆ రోజు పుదుచ్చేరిలో ఆ మిల్లువాళ్ళని రాక్షసులు సైతానులనే తిట్టింది శాంతం. అన్నయ్యకీ ఇరవై లక్షలున్నాయి - నాకు పది లక్షలన్నాయి. అన్నయ్య దుర్మార్గుడా - రాక్షసా? నేను దుర్మార్గుణ్ణా - మదాంధుణ్ణా? - వద్దు మొర్రో - అంటూ తోసేస్తున్నా - డబ్బు వొళ్ళో వచ్చి పడుతూంటే - యేం చెయ్యం? అసలు ముప్పైవేలు రొక్కం బ్యాంకిలోనించి తీసి యీ సీమప్రయాణం ఖర్చు పెట్టమంటేనే పీక పిసుక్కున్నట్టుంది కదా నాకు - అటువంటిది నా కష్టార్జితం అందరికీ పంచి పెట్టేయమంటే నా కెంత యేడుపుగా వుంటుంది?... మొన్న బెంగాలులో బొగ్గుగని పేలి పది మంది కూలివాళ్ళు అందులో కప్పడిపోయి చచ్చిపోయారు. ఆ బొగ్గుగని పాణింద్రబోసుది. పాణీ నేను లండనులో కలిసి చదువుకున్నాం. పాణీ యెంత మంచివాడంటే - అంత మంచివాడు. ఒక దోమనిగాని నల్లినిగానీ చంపడానికి అతనికి చెయ్యిరాదు, శ్రీమంతుడని చెప్పి అతన్ని దుర్మార్గుడు క్రూరుడు అంటే న్యాయమేనా?...

- ఇంకా వుంది.

ప్రతి జిల్లా పరిషత్‌లో ఎన్ని స్థాయీ సంఘాలు ఉంటాయి ?



ఏపీ టెట్ సోషల్ స్టడీస్

1. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటును నిర్బంధం చేసిన రాష్ట్రం ఏది ?
1. ఆంధ్రప్రదేశ్ 2. తెలంగాణ
3. కర్ణాటక 4. గుజరాత్

2. 'మండల వ్యవస్థ'ను సూచించిన కమిటీ ఏది ?
1. రాజ్‌మన్నార్ కమిటీ 2. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
3. సర్కారియా కమిటీ 4. అశోక్‌మెహతా కమిటీ

3. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ఏ తేదీన అమలులోకి వచ్చింది ?
1. 1992 ఏప్రిల్ 24 2. 1993 ఏప్రిల్ 24
3. 1993 జూన్ 1 4. 1992 జూన్ 24

4. కిందివాటిలో 1992లో చేసిన 73వ రాజ్యాంగ సవరణ చట్టంలోని లక్షణం కానిది ఏది ?
1. గ్రామసభ 2. రెండంచెల వ్యవస్థ
3. రాష్ట్ర ఎన్నికల సంఘం 4. స్త్రీలకు సీట్లను రిజర్వ్ చేయడం

5. పంచాయతీలకు ఖాతాల నిర్వహణ, వాటి ఆడిట్‌కు సంబంధించిన నిబంధనలను ఎవరు రూపొందిస్తారు ?
1. రాష్ట్ర ఆర్థిక సంఘం 2. రాష్ట్ర శాసనసభ
3. భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
4. జిల్లా కలెక్టర్

6. 'జాతీయ విస్తరణ సేవాపథకం' (ఎన్‌ఈఎస్ఎస్)ను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు ?
1. 1950 2. 1951
3. 1952 4. 1953

7. గ్రామ పంచాయతీలోని వార్డు సభ్యుల సంఖ్యను ఏవిధంగా నిర్వహిస్తారు ?
1. పంచాయతీ తీర్మానం ఆధారంగా
2. ఆ గ్రామ జనాభా ఆధారంగా
3. గ్రామ ప్రజల అభీష్టం మేరకు
4. కలెక్టర్ నిర్ణయిస్తారు

8. రాజ్యాంగంలో గ్రామ పంచాయతీల ఏర్పాటు గురించి వివరించే అధికరణ ఏది ?
1. 20 2. 30 3. 40 4. 50

9. ఈ కిందివాటిలో 73వ రాజ్యాంగ సవరణ చట్టంలో రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టానికి వదిలేసిన అంశం ఏది ?
1. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం
2. అన్ని స్థాయిల్లో అన్ని పదవులను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పూరించడం
3. జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ/ఎస్టీ సీట్ల రిజర్వేషన్
4. పంచాయతీల్లో మహిళలకు మూడింట ఒక వంతు వరకు సీట్ల రిజర్వేషన్

10. భారతదేశంలో పట్టణ స్థానిక సంస్థలకు ఆదాయ వనరులు ఏవి ?
1. పన్నులు 2. ఫీజులు, జరిమానాలు
3. గ్రాంట్లు 4. పైవన్నీ

11. స్థానిక సంస్థలలో పోటీ చేయడానికి కనీస విద్యార్హత నిర్ణయించిన రాష్ట్రం ఏది ?
1. గుజరాత్ 2. రాజస్థాన్ 3. ఆంధ్రప్రదేశ్ 4. తెలంగాణ

12. నగరపాలక సంస్థ 'రాజకీయ అధిపతి'ని ఏమంటారు ?
1. చైర్మన్ 2. సర్పంచ్
3. మేయర్ 4. అధ్యక్షుడు

13. కేంద్రం... సమాజాభివృద్ధి పథకాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టింది ?
1. 1950 2. 1952
3. 1959 4. 1969

14. మండల అభివృద్ధి కార్యక్రమాలకు అధ్యక్షత వహించేది ఎవరు ?
1. సర్పంచ్ 2. తహశీల్దార్
3. జెడ్పీటీసీ 4. మండల అధ్యక్షుడు

15. పురపాలక సంఘంలోని వార్డులకు ప్రాతినిధ్యం వహించేది ఎవరు ?
1. వార్డు మెంబర్ 2. కార్పొరేటర్
3. కౌన్సిలర్ 4. ఎంపీటీసీ

16. ప్రతి జిల్లా పరిషత్‌లో ఎన్ని స్థాయీ సంఘాలు ఉంటాయి ?
1. 8 2. 6 3. 7 4. 11

17. సైనిక సిబ్బంది ఉన్న ప్రాంతాల్లోని స్వపరిపాలన సంస్థను ఏమంటారు ?
1. అభివృద్ధి బోర్డు 2. నోటిఫైడ్ ఏరియా
3. అర్మీ బోర్డు 4. కంటోన్మెంట్ బోర్డు

18. 'భారతదేశం గ్రామాల్లో నివసిస్తోంది' అని పేర్కొన్నదెవరు ?
1. బి.ఆర్.అంబేద్కర్ 2. బాబూ రాజేంద్రప్రసాద్
3. మహాత్మా గాంధీ 4. కౌటిల్యుడు

19. ప్రజాస్వామ్యం, అభివృద్ధిపై పంచాయతీరాజ్ సంస్థల పునరుజ్జీవానికి 1986లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం నియమించిన కమిటీ ఏది ?
1. సర్కారియా కమిటీ 2. రాజమన్నార్ కమిటీ
3. అశోక్‌మెహతా కమిటీ 4. ఎం.ఎల్.సింఘ్వి కమిటీ

20. కిందివారిలో పరోక్షంగా ఎన్నికయ్యేవారు ఎవరు ?
1. సర్పంచ్ 2. ఉపసర్పంచ్
3. వార్డు సభ్యులు 4. ఎవరూ కాదు

21. పంచాయతీరాజ్ వ్యవస్థపై ఏర్పాటుచేసిన కమిటీలను కాలక్రమంలో గుర్తించండి ?
ఎ. బల్వంతరాయ్ మెహతా కమిటీ
బి. జి.వి.కె.రావు కమిటీ
సి. అశోక్‌మెహతా కమిటీ
డి. ఎల్.ఎం.సింఘ్వి కమిటీ
1. ఎ, సి, బి, డి 2. ఎ, సి, డి, బి
3. సి, ఎ, బి, డి 4. బి, ఎ, సి, డి

22. కిందివారిలో ప్రత్యక్షంగా ఎన్నిక కానివారు ఎవరు ?
1. సర్పంచ్ 2. జిల్లాపరిషత్ చైర్మన్
3. ఎంపీటీసీ సభ్యుడు 4. జెడ్పీటీసీ సభ్యుడు

23. భారత రాజ్యాంగంలో 243(జి) ప్రకారం పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్ని అధికారాలు కేటాయించారు ?
1. 27 అధికారాలు 2. 28 అధికారాలు
3. 29 అధికారాలు 4. 30 అధికారాలు

24. కిందివాటిలో గ్రామసభ ద్వారా 18 రకాల కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామంలో ప్రతి వ్యక్తిని కమిటీల్లో భాగస్వామ్యం చేసిన గ్రామ పంచాయతీ ఏది ?
1. గుండ్లపల్లి 2. అంకాపూర్
3. గంగదేవిపల్లి 4. అడవిదేవులపల్లి

25. 74వ రాజ్యాంగ సవరణ చట్టం-1992 ప్రకారం కిందివాటిలో వేటిని ఏర్పాటు చేశారు ?
1. మున్సిపల్ కమిటీలు 2. వార్డు కమిటీలు
3. జిల్లా ప్రణాళికా కమిటీలు 4. మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీలు
1. ఎ, సి 2. బి, డి
3. ఎ, బి, సి 4. బి, సి, డి

26. మహిళలకు పంచాయతీల్లో 50 శాతం సీట్లు కేటాయించిన తొలి రాష్ట్రం ఏది ?
1. మహారాష్ట్ర 2. ఒడిశా
3. మధ్యప్రదేశ్ 4. బిహార్

27. స్థానిక సంస్థల ప్రభుత్వాలను రాజ్యాంగంలోని ఏ జాబితాలో చేర్చారు ?
1. కేంద్ర జాబితా 2. రాష్ట్ర జాబితా
3. ఉమ్మడి జాబితా 4. అవశిష్ట అంశం

28. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఏది ?
1. రాజస్థాన్ 2. కేరళ
3. ఆంధ్రప్రదేశ్ 4. ఉత్తరప్రదేశ్

29. గ్రామం నుంచి పట్టణానికి మారే ప్రాంతానికి ఏర్పాటుచేసే స్థానిక ప్రభుత్వం ఏది ?
1. మున్సిపల్ కౌన్సిల్ 2. నగర పంచాయతీ
3. కార్పొరేషన్ 4. పోర్టు ట్రస్ట్

30. ఏ స్థాయి పంచాయతీలకు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుంది ?
1. గ్రామస్థాయి
2. మధ్యస్థాయి
3. జిల్లాస్థాయి
4. పైవన్నీ



31. గ్రామ పంచాయతీకి సంబంధించి కిందివాటిలో సరికానిది ఏది ?
1. గ్రామసభ సమావేశాన్ని ఆరునెలలకు ఒకసారి ఏర్పాటు చేస్తారు
2. గ్రామ జనాభా మొత్తం గ్రామసభలో సభ్యులుగా ఉంటారు
3. గ్రామసభకు అధ్యక్షుడిగా సర్పంచ్ వ్యవహరిస్తారు
4. గ్రామసభలో వార్డు మెంబర్లు కూడా ఉంటారు

32. 2008లో భారత ప్రభుత్వంచే 'నిర్మల్' గ్రామ పురస్కారం అందుకున్న గ్రామ పంచాయతీ ఏది ?
1. వెంకటాద్రిపాలెం 2. హాజీపల్లి
3. బిజినేపల్లి 4. హుజూరాబాద్

33. కిందివాటిలో గ్రామపంచాయతీలు బాధ్యత వహించేవి ?
ఎ. వ్యవసాయ ఉత్పత్తి బి. గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి
సి. గర్భిణి, శిశు సంక్షేమం డి. ఉన్నత వృత్తివిద్య
1. ఎ, డి 2. ఎ, సి
3. బి, సి 4. సి, డి

34. కిందివాటిలో సరైన జత ఏది ?
ఎ. అశోక్‌మెహతా కమిటీ - రెండంచెల పంచాయతీ వ్యవస్థ
బి. ఎల్.ఎం.సింఘ్వి కమిటీ - న్యాయ పంచాయతీ వ్యవస్థ
సి. హనుమంతరావు కమిటీ - జిల్లా ప్రణాళిక
డి. జి.వి.కె.రావు కమిటీ - ఉద్యోగస్వామ్యం
1. ఎ, సి మాత్రమే 2. బి, సి మాత్రమే
3. సి, డి మాత్రమే 4. పైవన్నీ సరైనవే

35. 1600 జనాభా ఉన్న ఒక గ్రామ పంచాయతీలో ఉండాల్సిన వార్డు సభ్యుల సంఖ్య ఎంత ?
1. 7 2. 9 3. 11 4. 13

36. బల్వంతరాయ్ మెహతా కమిటీ ఎన్ని అంచెల పంచాయతీ వ్యవస్థ ఉండాలని సూచించింది ?
1. 2 2. 3 3. 4 4. 5

37. భారతదేశంలో తొలి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఎక్కడ ఏర్పాటుచేశారు ?
1. మద్రాస్ 2. ఢిల్లీ 3. బాంబే 4. హైదరాబాద్

38. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు ఎన్ని రకాల అధికారాలు కేటాయించారు ?
1. 29 అధికారాలు 2. 18 అధికారాలు
3. 19 అధికారాలు 4. 20 అధికారాలు

39. గ్రామ పంచాయతీలో గరిష్ట వార్డు సభ్యుల సంఖ్య ఎంత ?
1. 15 2. 19 3. 21 4. 25

40. గ్రామసభ దినోత్సవాన్ని ఏ తేదీన నిర్వహిస్తారు ?
1. ఏప్రిల్ 14 2. ఏప్రిల్ 24
3. జూన్ 14 4. మే 30

41. భారత్‌లో 'స్థానిక సంస్థల పితామహుడి'గా ఎవరిని పేర్కొంటారు ?
1. డల్హౌసీ 2. లార్డ్ రిప్పన్
3. లార్డ్ కర్జన్ 4. లార్డ్ మింటో

42. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు ?
1. ఏప్రిల్ 14 2. అక్టోబర్ 24
3. ఏప్రిల్ 24 4. మార్చి 24

43. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో ఏ షెడ్యూల్‌ను చేర్చారు ?
1. 9 2. 10 3. 11
4. 12

44. రాజ్యాంగంలో 9 ఎ భాగం ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు ?
1. 73 2. 74 3. 42
4. 43

45. కిందివాటిలో గ్రామ పంచాయతీల ఆర్థిక వనరు కానిది ఏది ?
1. వృత్తిపన్ను 2. ఇంటిపన్ను
3. వినోదం పన్ను 4. వాహనం పన్ను

46. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మండల వ్యవస్థ'ను ఎప్పుడు ప్రవేశపెట్టింది ?
1. 1985 2. 1984
3. 1980 4. 1986

47. కిందివాటిలో పురపాలక సంఘం విధి కానిది ఏది ?
1. విద్యుచ్ఛక్తి 2. ప్రజారోగ్యం
3. గ్రంథాలయాలు 4. విద్య

48. 73వ రాజ్యాంగ సంరణ దేనికి సంబంధించినది ?
1. రాష్ట్రాలకు అధికార వికేంద్రీకరణ
2. పంచాయతీలకు అధికార వికేంద్రీకరణ
3. మున్సిపాలిటీలకు అధికార వికేంద్రీకరణ
4. ప్రభుత్వరంగ సంస్థలకు అధికార వికేంద్రీకరణ

49. గ్రామ పంచాయతీని ఏర్పాటుచేయడానికి ఆ గ్రామంలో ఉండాల్సిన జనాభా ?
1. 800 2. 1000 3. 300 4. 500

50. నగరపాలక సంస్థ వివేచనాత్మక విధులకు ఉదాహరణ ఏది ?
1. నగర పారిశుధ్యం 2. గ్రంథాలయాలు
3. విద్య 4. ప్రజారోగ్యం

సమాధానాలు

1. 4	2. 4	3. 2	4. 2	5. 2	6. 4
7. 2	8. 3	9. 1	10. 4	11. 1	12. 3
13. 2	14. 4	15. 3	16. 3	17. 4	18. 3
19. 4	20. 2	21. 1	22. 2	23. 3	24. 3
25. 4	26. 4	27. 2	28. 1	29. 2	30. 4
31. 2	32. 2	33. 2	34. 4	35. 3	36. 2
37. 1	38. 2	39. 3	40. 1	41. 2	42. 3
43. 4	44. 2	45. 1	46. 4	47. 3	48. 2
49. 4	50. 2				

సెంట్రల్ రైల్వేలో 21 ఉద్యోగాలు



ముంబైలోని సెంట్రల్ రైల్వే ప్రధాన కార్యాలయం.. 21 స్పోర్ట్స్ కోటా ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

క్రీడా విభాగాల వారీ ఖాళీలు : లెవెల్ 5/4 పే కేటగిరీలో స్విమ్మింగ్ (వ్యక్తిగత మెడ్లే)-1(పురుషులు); అథ్లెటిక్స్ (5 వేల మీటర్లు)-1 (మహిళలు), బాస్కెట్‌బాల్ (ఆల్‌రౌండర్)-1 (పురుషులు), క్రికెట్ (ఆల్‌రౌండర్)-2 (పురుషులు-1ంమహిళలు-1); లెవెల్ 3/2లో పే కేటగిరీలో స్విమ్మింగ్ (బ్యాక్‌స్ట్రోక్)-1 (పురుషులు), వాటర్‌పోలో (ఆల్‌రౌండర్)-1 (పురుషులు), అథ్లెటిక్స్ (5 వేల మీటర్లు)-1 (మహిళలు), బాస్కెట్‌బాల్ (ఆల్‌రౌండర్)-1 (పురుషులు), బాక్సింగ్ (+91 కిలోలు అండ్ 81 కిలోలు)-2 (పురుషులు), బ్రిడ్జ (బ్రిడ్జ్ ప్లేయర్)-1 (పురుషులు), క్యూ స్పోర్ట్స్ (స్నూకర్)-1 (పురుషులు), క్రికెట్ (ఆల్‌రౌండర్)-2 (పురుషులు-1+ మహిళలు-1), పవర్ లిఫ్టింగ్ (63 కిలోలు)-1 (మహిళలు), షూటింగ్ (0.22 రైఫిల్ 3 పొజిషన్)-1 (పురుషులు/ మహిళలు), వాలీబాల్ (సెంటర్ బ్లాకర్ అండ్ అటాకర్)-2 (మహిళలు)-2, రెజ్లింగ్ ఫ్రీ స్టయిల్ (74 కిలోలు అండ్ 86 కిలోలు)-2 (పురుషులు).

వేతనశ్రేణి : లెవెల్ 5/4 కేటగిరీకి రూ.29,200-92,300/ రూ.25,500-రూ.81,100; లెవెల్ 3/2 కేటగిరీలో రూ.21,700-69,100/ రూ.19,900-రూ.63,200.

అర్హతలు : లెవెల్ 5/4 కేటగిరీలోని పోస్టులకు ఏదైనా గ్రాడ్యుయేషన్, లెవెల్ 3/2 కేటగిరీ పోస్టులకు ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్య లేదా పదో తరగతితోపాటు యాక్ట్ అప్రెంటీస్ కోర్స్/ ఐటీఐ (ఎన్‌సీవీటీ/ ఎన్‌సీవీటీ). అలాగే పోస్టును బట్టి సంబంధిత క్రీడా విభాగంలో ఒలింపిక్స్/ అంతర్జాతీయ/జాతీయ/ అంతర్రాష్ట్ర/ రాష్ట్ర/ విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో సీనియర్/ జూనియర్ స్థాయిలో కనీసం తృతీయ స్థానం పొంది ఉండాలి/ ప్రాతినిధ్యం వహించి ఉండాలి.

వయసు : 2018, జూలై 1 నాటికి 18-25 ఏళ్ల లోపు ఉండాలి.

ఎంపిక : క్రీడల్లో సాధించిన విజయాలు, ట్రయల్, ఆఫ్టర్ ట్రయల్.

దరఖాస్తు రుసుం : రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ మహిళ/ మైనార్టీ/ ఆర్థికంగా వెనకబడిన కేటగిరీల అభ్యర్థులకు రూ.250.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 20, 2018.

వెబ్‌సైట్ : www.cr.indianrailways.gov.in, www.indianrailways.gov.in

విశాలాంధ్ర బిజినెస్

141.52 ▲	44.60 ▲	500 ▲	బంగారం (విశాఖపట్నం) 29,250	400 ▲	వెండి (విశాఖపట్నం) 41,800	డాలరు
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	ప్రొద్దుటూరు	Vs రూపాయి
34,297.47	10,545.50	29,400	29,250	39,800	40,968	63.91
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐసీఐసీఐ బ్యాంక్	328.60	3.15
ఇన్ఫోసిస్	1,114.15	1.47
ఓఎన్‌జీసీ	188.40	1.37
బజాజ్ ఆటో	3,164.00	0.96
హెచ్‌డీఎఫ్‌సీ	1,848.90	0.89

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
బీహెచ్ఇఎల్	94.70	-2.97
హీరో మోటార్‌కార్ప్	3,533.15	-1.85
భారతీ ఎయిర్‌టెల్	428.30	-1.36
టాటా స్టీల్	718.40	-1.20
లార్సెన్	1,369.	-0.56

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.09	63.91
యూరో	79.13	79.78
పౌండ్	88.82	88.89
ఆస్ట్రేలియా డాలర్	50.39	50.63
సింగపూర్ డాలర్	48.58	48.71

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,250	31,283
చెన్నై	29,250	31,283
బెంగళూరు	28,700	30,695
ముంబై	29,760	31,828
విజయవాడ	29,400	31,600
విశాఖపట్నం	29,250	31,909
ప్రొద్దుటూరు	29,250	30,710
ముడి చమురు		64.36



రెక్కలుతొడిగిన

బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ: పెళ్లిళ్ల సీజన్ దగ్గరపడుతుండటంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గురువారం ఏకంగా రూ.350 పెరగడంతో పది గ్రాముల బంగారం ధర రూ.31,650కి చేరింది. అంతర్జాతీయంగా డాలర్ విలువ పడిపోవడం, అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు ఉండటంతో పాటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో స్థానిక ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి భారీగా డిమాండ్ పెరిగింది. ఈ కారణాల వల్ల పసిడి ధర పెరిగినట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. పసిడి బాటలోనే వెండి కూడా పెరిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణెల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి ధర రూ.720 పెరిగింది. దీంతో కిలో వెండి రూ.39,970కి చేరింది. ఇక అంతర్జాతీయంగా పసిడి ధర 0.27శాతం పెరగడంతో ఔన్సు 1,354 దాలర్లు పలికింది. వెండి ధర కూడా 0.48శాతం పెరగడంతో ఔన్సు 16.92 డాలర్లు పలికింది. అంతర్జాతీ యంగా బంగారం ధర 0.27శాతం తగ్గి ఔన్స్ 1353.90 డాలర్లకు చేరింది. వెండి ధర 0.48శాతం తగ్గి ఔన్స్ 16.92 డాలర్లకు చేరింది. సవరు బంగారం ధర రూ.24,800కు చేరింది.

ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీ యాపిల్

గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెటకు రెండో స్థానం

న్యూయార్క్: ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ యాపిల్ నిలిచింది. ఆ కంపెనీ మార్కెట్ విలువ 849.2 బిలియన్ డాలర్లు ఉంది. న్యూయార్క్ పోస్టు రిపోర్ట్ ప్రకారం తొలిసారిగా మైక్రోసాఫ్ట్ కంపెనీని ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ అధిగమించింది. ఇక రెండో స్థానంలో గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ 745.1 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కలిగి ఉంది. ఇక అమెజాన్ 702.5 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో నిలిచింది. గతంలో మూడో స్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ నాలుగో స్థానానికి పడిపోయింది. ఆ కంపెనీ మార్కెట్ విలువ రూ.699.2 బిలియన్ డాలర్లు.. కాగా ఫేస్‌బుక్ 521.5 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచింది. ఇక సంపన్నుల విషయానికొస్తే ప్రపంచంలోనే అపరకుబేరుడిగా అమెజాన్ సీఈవో జెఫ్ బిజోస్ నిలిచారు. బ్లూమ్‌బర్గ్, ఫోర్బ్స్ నివేదిక ప్రకారం బిలియనీర్ల జాబితాలో బిజోస్ అగ్రస్థానంలో ఉన్నారు. బిజోస్‌కు 106 బిలియన్ డాలర్ల సంపద ఉన్నట్లు బ్లూమ్‌బర్గ్ చెబుతుంటే.. 105 బిలియన్ డాలర్ల సంపద ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఇప్పటి వరకు ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఉన్నారు. ఇప్పుడు ఆయన్ని వెనక్కి నెట్టి బిజోస్ అగ్ర స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

ఉత్తుత్తి మాటలే...

- అంతంతకు పెరుగుతున్న మొండి బాకీలు
- బ్యాంకుల నష్టాలు 11,000 కోట్లు
- గణనీయంగా పెరిగిన కేటాయింపులు
- మూడో త్రైమాసికంలో పీఎస్‌బీల పనితీరిది!



ముంబై: ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నప్పటికీ దేశంలో నిరర్థక ఆస్తులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. తాము మొండి బాకీలను నివారించేందుకు పలు చర్యలు చేపడుతున్నామని.. నిబంధనలను కఠినతరం చేస్తున్నట్టు సర్కారు ఎన్ని కబుర్లు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం రోజు రోజుకు మరింత దిగజారుతోంది. తాజాగా దేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు విత్త సంస్థలు, బ్యాంకులు వెల్లడించిన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో బ్యాంకింగ్ వ్యవస్థ నిరర్థక ఆస్తులు దాదాపు 34.5 శాతం మేర పెరిగాయి. అంటే ఆర్థిక వ్యవస్థలో లెక్కకు రాకుండా ఉన్న నిరర్థక ఆస్తుల విలువ ఇప్పుడు కనిపిస్తున్నదానికంటే అధికంగానే ఉంటుందని వెలువడుతున్న గణాంకాలను బట్టి తెలుస్తోందని రేటింగ్ ఏజెన్సీ కేర్ వెల్లడించింది.

రూ.51 వేల కోట్ల కేటాయింపులు..: దేశంలోని మొత్తం 17 ప్రయివేటు బ్యాంకులు, 13 ప్రధాన ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరును పరిశీలించి చూస్తే గత డిసెంబరు మాసంలో దేశంలోని 30 విత్త సంస్థల నిరర్థక ఆస్తుల మొత్తంలో 9.45 శాతానికి పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో వీటి వృద్ధి 8.34 శాతంగా ఉంది. ప్రయివేటు బ్యాంకుల మొండి బాకీలు నిష్పత్తి 4.1 శాతం దరిదాపుల్లో నిలవగా.. ప్రభుత్వ రంగంలోని విత్త సంస్థల మొండి బాకీల్లో మాత్రం 12.4 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. ప్రస్తుతానికి ఈ విలువలో వృద్ధి కనిపిస్తున్నప్పటికీ రానున్న మార్చి నాటికి ఆర్థిక వ్యవస్థలో ఎన్‌పీఏల వాస్తవ పరిస్థితి తేటతెల్లమయ్యే అవకాశం ఉందని కేర్ తెలిపింది. అక్టోబరు -డిసెంబరు మధ్య కాలంలో ప్రయివేటు విత్త సంస్థ లాభం పెరగ్గా... ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం మొత్తంగా రూ.11,000 కోట్ల నష్టాన్ని వెల్లడించాయి. ఇదే కాలంలో బ్యాంకులు దాదాపు రూ.51,000 కోట్ల మొత్తాన్ని ఒత్తిడిలో ఉన్న బాకీల నిమిత్తం కేటాయింపులు జరిపాయి. ఇదే సమయంలో పీఎస్‌బీల వడ్డీ ఆదాయంలో 8.9 శాతం పెరగడం విశేషం. దేశంలోని మొత్తం 30 విత్త సంస్థల వడ్డీ ఆదాయాన్ని విశ్లేషించి చూస్తే.. 22.4 శాతం వృద్ధి నమోదు అయినా బ్యాంకులకు నష్టాలు రావడం విశేషం.

స్కాం ప్రభావంతో రూ. 7వేల కోట్లు ఉఫ్..



ముంబై: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ భారీ కుంభకోణం వెలుగు చూడటంతో మార్కెట్లో జ్యువెల్లరీ షేర్లు భారీగా నష్టపోయాయి. ఇన్వెస్టర్ల అమ్మకాలతో పలుషేర్లు నష్టాలను చవిచూస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు మదుపర్ల సంపద దాదాపు రూ. 7వేల కోట్లు ఆవిరైపోయింది. ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ లావాదేవీల్లో భారీగా అక్రమాలు ఆరోపణల నేపథ్యంలో మార్కెట్‌లో ఆందోళన నెలకొంది. జ్యువెలరీ, బ్యాంక్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దీంతోపాటు ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ముంబై బ్రాంచీలో సుమారు రూ. 11,400 కోట్లమేర అక్రమ లావాదేవీలు జరిగిన నేపథ్యంలో జ్యువెలరీ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాల వెల్లువ సాగింది. ముఖ్యంగా పీసీ జ్యువెలర్స్ షేరు దాదాపు 9 శాతం పతనంకాగా గీతాంజలి జెమ్స్ షేర్, తంగమాయిల్ జ్యువెలరీ , టీబీజెడ్, రాజేష్ ఎక్స్‌పోర్ట్స్, రినైసన్స్ జ్యువెలరీ నష్టపోయిన వాటిల్లో ఉన్నాయి. మరోవైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు కూడా దాదాపు 13 శాతం కుప్పకూలింది. రెండు రోజుల్లో మొత్తం 18శాతం నష్టపోయింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు మూడు వేలకోట్ల రూపాయలను కోల్పోగా, సీబీఐ ప్రకటన వెలువడిన వెంటనే గురువారం మరో నాలుగు వేల కోట్ల రూపాయల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. దీంతో మొత్తం రూ7వేల కోట్ల సంపద ఆవిరైపోయింది. పీఎన్‌బీలో జరిగిన కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తోపాటు సీబీఐ పలు వ్యక్తులపై కేసులు నమోదు చేశాయి. ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ చీఫ్ నీరవ్ మోదీతోపాటు, అతడి భార్య, సోదరుడు, తదితరులపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

దేనా బ్యాంక్ నష్టాలు రూ.380 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ దేనా బ్యాంక్‌కు ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రూ.380 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.35 కోట్ల నికర లాభం సాధించామని పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.2,996 కోట్ల నుంచి రూ.2,476 కోట్లకు తగ్గిందని తెలిపింది. స్థూల మొండి బకాయిలు 14.79 శాతం నుంచి 19.56 శాతానికి, నికర మొండి బకాయిలు 9.52 శాతం నుంచి 11.52 శాతానికి పెరిగాయని వివరించింది. ఫలితంగా మొండి బకాయిలకు కేటాయింపులు రెట్టింపయ్యాయని, రూ.427 కోట్ల నుంచి రూ.1,044 కోట్లకు పెరిగాయని పేర్కొంది. ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ ద్వారా రూ.3,045 కోట్ల సమీకరణకు తమ డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని దేనా బ్యాంక్ వెల్లడించింది. ఆర్థిక ఫలితాలు అధ్వాంసంగా ఉండటంతో బీఎస్ఈలో దేనా బ్యాంక్ షేర్ 2.4 శాతం క్షీణించి రూ.22.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి, రూ.21.90ను తాకింది.

జనవరిలో...

ఆరు నెలల కనిష్టానికి చేరిన టోకు ధరల ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: వరుసగా రెండో నెలలో దేశీయ వార్షికటోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యుపీఐ) తగ్గింది. ఆహారం, ఇంధనధరలు తగ్గడంతో జనవరిలో 2.84శాతం నమోదైంది. డిసెంబరులో కూరగాయల ధరలు 56.46 శాతం వృద్ధి నమోదు కాగా, ద్రవ్యోల్బణం 3.58 శాతం, కాగా నవంబరులో ఈ ద్రవ్యోల్బణం ఎనిమిదినెలల గరిష్టానికి చేరి 3.93 శాతం నమోదైంది. తదనంతరం తగ్గుతూనే వస్తోంది. కూరగాయల ధరలు ఎక్కువగానే ఉన్నప్పటికీ, మిగిలిన ఆహార పదార్థాల ధరలు అందుబాటులోకి రావడంతో టోకు ద్రవ్యోల్బణం తగ్గింది. గత నెలలో ఉల్లిపాయల ధరలు మాత్రం ఏకంగా 193.89 శాతం పెరిగాయి. గుడ్లు, మాంసం, చేపల ధరలు 0.37శాతం తగ్గాయి. పండ్ల ధరలు 8.49శాతం పెరిగాయి. గత ఆరునెలల్లో ఇదే కనిష్టం. జులైలో 1.88శాతం నమోదైంది. రాయ్‌టర్స్ పోల్ అంచనాల ప్రకారం ఈ ద్రవ్యోల్బణం 3.25శాతం నమోదవు తుందని తెలిపింది. కానీ అంచనాల కంటే తక్కువగానే ద్రవ్యోల్బణశాతం తగ్గింది. రిటైల్ ద్రవ్యోల్బణం కూడా తగ్గింది. డిసెంబరులో నమోదైన 17నెలల గరిష్టంతో పోలిస్తే స్వల్పంగా తగ్గి 5.07 శాతం నమోదైంది.

నైతికతలో మేటి విప్రో, టాటా స్టీల్

ఉత్తమ విలువలు ఉన్న 137 సంస్థల జాబితాల చోటు

న్యూయార్క్: ప్రపంచంలో నీతిమంతమైన కంపెనీల జాబితాలో భారత్ నుంచి కేవలం రెండు సంస్థలు మాత్రమే స్థానం సంపాదిం చుకోన్నాయి. ఐటీ సేవలు, ఔట్ సోర్సింగ్ సేవల సంస్థ విప్రో, టాటా స్టీల్ సంస్థలు దేశంలో మేటి నైతిక విలువలను పాటిస్తున్నట్టుగా.. అమెరికా కు చెందిన ఎథిస్ఫేయర్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 23 దేశాలు, 57 పరిశ్రమల పని తీరును అధ్యయనం చేసిన ఈ సంస్థ మొత్తం 137 కంపెనీల పేర్లతో మేటి 'నైతిక విలువలున్న సంస్థల జాబితా-2018' ను ప్రకటించింది. తమ వ్యాపార అచరణలలో కొత్త విలువలను నిర్వచించడం మేటి నైతిక విలువను పాటిస్తున్న కంపెనీలను ఈ జాబితాలో ఎంపిక చేసినట్టుగా ఎథిస్ఫేయర్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా మేటి నైతిక విలువలను పాటిస్తున్న సంస్థల జాబితాలో డెల్, మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, అడోబ్ సంస్థలు ఉన్నట్టుగా ఎథిస్ఫేయర్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. గత పుష్కర కాలంలో ఏ సంస్థలైతే పారదర్శకత, ప్రామాణికతలపై దృష్టి సారించి ముందుకు సాగుతాయో ఆ సంస్థలకు ఉద్యోగులు, వారి వినియోగదారులు, పెట్టుబడిదారుల నుంచి తగిన ఆదరణ లభిస్తూ వస్తున్నట్టుగా తాము గుర్తించామని తిమోతీ ఎర్‌బ్లిచ్ సంస్థ సీఈవో వ్యాఖ్యానించారు. మేటి విలువలను పాటిస్తున్న సంస్థల్లో భారీ పరిశ్రమలు ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తూ వస్తున్నాయని సంస్థ తెలిపింది.

ఓప్పో టైమ్స్ ఫ్రెష్‌ఫేస్ ఫినాలేలో శ్యామ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం రుచికరమైన ఆహారానికి, చారిత్రక సంపదకు మాత్రమే నిలయం కాదు. యువత తమ తమ నైపుణ్యాలను ప్రదర్శించ డంలోనూ ప్రముఖ పాత్రే పోషిస్తోంది. అంతర్ నగర, అంతర్ కలయికల పోటీలలో ఓప్పో టైమ్స్ ఫ్రెష్‌ఫేస్ 2017లో సిటీ ఫినాలేలో శ్యామ్ సుందర్ గెలిచి నగరాన్ని గర్వపడేలా చేశారు. వేగవంతమైన చిత్రకళా నైపుణ్యం, గానంతో పాటు బాక్సింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శనను ఈనెల 16న ముంబైలో ఇవ్వబోతున్నారు.

సృజనాత్మకలో ఆసక్తి కనబరిచే శ్యామ్ ప్రస్తుతం ఫొటోగ్రఫీలో డిప్లొమా చేస్తున్నారు. ఫొటోగ్రాఫర్‌గా లేక మోడల్‌గా పరిపూర్ణతను సాధించాలని శ్యామ్ లక్ష్యం పెట్టుకున్నారు. మోడలింగ్‌లో రాణించాలని ఆకాంక్షిస్తున్నారు. అద్భుతమైన నైపుణ్యాలు కలిగిన యువత గర్వించదగిన టైటిల్ ఓప్పో టైమ్స్ ఫ్రెష్‌ఫేస్ కాబోతోంది.

మళ్లీ ఊపందుకున్న మార్కెట్లు

139పాయింట్లతో సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయంగా సానుకూల ప్రభావాలు కొనసాగడం మార్కెట్లకు కలిసివచ్చాయి. ఆసియా మార్కెట్లు గ్రీన్‌లో నమోదుకావడంతో ప్రారంభంనుండే మార్కెట్లు లాభాల్లో నమోదయ్యాయి. సెన్సెక్స్ 141.52 పాయింట్లతో 0.41 శాతంతో 34,297.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 44.60 పాయింట్లతో 0.42శాతంతో 10,545.50 వద్ద ముగిసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగు చూపడంతో బ్యాంకు షేర్లు భారీగా నష్టాల్లో మునిగాయి. ఈ ఉదయం ట్రేడింగ్‌లో షేరు విలు 9శాతానికి పడిపోయింది. బిఎస్ఇలో షేరు విలువ రూ.137 వద్దప్రారంభమై 8.47 శాతం నష్టపోయి రూ.133.54కు చేరింది. ఈ మధ్యాహ్నానికి పిఎన్‌బి షేర్ విలు 6.38శాతం తగ్గి రూ.136.60 వద్ద ట్రేడ్అవుతోంది. బిఎస్ఇ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 104 పాయింట్లతో ట్రేడవుతుండగా, 19 సెక్టరల్ సూచీల్లో 0.49శాతం తక్కువగాట్రేడవుతోంది. మెటల్,ఐటి సూచీలు బలపడి 114 పాయింట్లతో 0.75శాతం, 98పాయింట్లతో 0.82శాతం నిలదొక్కుకుంది. అదీనీ పోర్ట్సు 2.33శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.96శాతం, టాటా మోటార్స్ 1.14శాతం సెన్సెక్స్ ప్రధాన లబ్దిదారులుగా నమోదయ్యాయి. బిఎస్ఇలో 1051 స్టాక్స్ లాభాల్లో నమోదుకాగా 500 స్టాక్స్ నష్టాల్లో నమోదయ్యాయి. 42 స్టాక్స్‌లో ఎటువంటి మార్పులేదు.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియా మార్కెట్లు గురువారం లాభాలునమోదుచేసాయి. ఎమ్ఎస్‌సిఐ బ్రాడెస్ట్ ఇండెక్స్ ఆఫ్ ఆసియా పసిఫిక్ షేర్లు జపాన్ వెలుపల 1శాతం పెరిగాయి. ఆస్ట్రేలియన్ స్టాక్స్ 0.9శాతం ఎదగగా, సౌత్ కొరియా కాస్పి 1.1శాతం లాభాల్ని నమోదుచేసింది. వరుసగా మూడురోజుల నష్టాల అనంతరం జపాన్ నిక్కీ 1.62శాతంతో 340 పాయింట్లు నమోదుచేసింది. హాంగ్‌శాంగ్ 2శాతంతో 608 పాయింట్లు అత్యధికంగా నమోదై 31,124 వద్ద ముగిసింది. వాల్ స్ట్రీట్ బుధవారం పెరిగింది. డౌ 1శాతంపెరగగా ఎస్ అండ్ పి 500 1.34 శాతం పెరిగింది.

చదువంటే ఎంత గౌరవమో...

- ఒక్క విద్యార్థిని కోసం రైల్వే స్టాప్
- రష్యాలో ప్రత్యేకత



మాస్కో: కేవలం ఒకే ఒక అమ్మాయి కోసం రష్యాలోని ఓ రైలుకు ప్రత్యేక స్టాప్ ఏర్పాటు చేశారు. ఆశ్చర్యంగా ఉంది కదా. మారుమూల గ్రామంలోని ఓ విద్యార్థిని కోసం రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్-ముర్మాన్స్క్ నగరాల మధ్య నడిచే రైలులో పోయకొండ అనే గ్రామం వద్ద ప్రత్యేక స్టాప్ ఏర్పాటు చేశారు. కరీనా కోజ్లోవా అనే 14ఏళ్ల అమ్మాయి తన బామ్మ నటాలియా కోజ్లోవాతో కలిసి రోజూ పాఠశాలకు వెళ్లి వస్తూ ఉంటుంది. చాలా మారుమూల గ్రామీణ ప్రాంతమైన పోయకొండ గ్రామం నుంచి వీళ్లు చాలా దూరం ప్రయాణించి పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ గ్రామం నుంచి పాఠశాలకు వెళ్తున్న ఒకే ఒక అమ్మాయి కరీనా. అయితే ఆ ప్రాంతంలో రైలు కొందరు రైల్వే సిబ్బందిని ఎక్కించుకోవడం దించడం కోసం ఆగుతుంది. దీంతో కరీనా పాఠశాలకు వెళ్లడానికి అదే సమయాలు పాటించాల్సి వస్తోంది. దీని వల్ల ఆమె ఉదయం 7 గంటలకు ఇంట్లో నుంచి బయలుదేరితే రాత్రి ఇంటికి చేరుకునే సరికి 9 గంటలు అవుతోంది. రోజూ ఉదయం కిలోమీటరు నడిచి పోయకొండ స్టేషన్‌లో 7.30కి రైలు ఎక్కుతుంది. అయితే సాయంత్రం మాత్రం స్కూల్ అయిపోయాక చాలా ఆలస్యంగా నడిచే రైల్లో మాత్రమే పోయకొండ స్టాప్ ఉండడంతో ఆ రైల్లో ఇంటికి చేరుకుంటోంది. దీంతో కరీనా తల్లి రైల్వే అధికారులను సెయింట్ పీటర్స్ బర్గ్-ముర్మాన్స్క్ రైలును పోయకొండ వద్ద ఆపాలని అభ్యర్థించారు. రోజూ తన కూతురు చాలా ఆలస్యంగా ఇంటికి రావడం వల్ల తన జీవితంలో బడి అయిపోయాక ఆడుకోవడం సహా సరదాగా గడిపే సమయాన్నంతా కోల్పోతోందని వేడుకున్నారు. దీంతో రైల్వే అధికారులు ఆమె ఒక్కదానికోసమైనా సరే పోయకొండలో సాయంత్రం వెళ్లే రైలు ఆపాలని నిర్ణయించారు. దీని వల్ల కరీనా ఇకమీదట త్వరగానే ఇంటికి వెళ్లగలుగుతుంది.

రెండేళ్ల క్రితం జపాన్‌లో కూడా ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. మారుమూల జపాన్ గ్రామం పాఠశాలకు వెళ్లే ఒక విద్యార్థిని రైల్లో ఒక స్టాప్‌ను తీసేయకుండా ఉంచారు. ఆమె హైస్కూల్ చదువు పూర్తయ్యే వరకు తన కోసం ఆ స్టాప్ కొనసాగిస్తామని రైల్వే అధికారులు తీసుకున్న నిర్ణయం అప్పట్లో ఇంటర్నెట్‌లో బాగా వైరల్ అయ్యింది.

విజ్ఞానం

ప్రాసెస్ చేసిన ఆహారంతో కేన్సర్ ప్రమాదం



బేక్ చేసిన ఆహార పదార్థాల వినియోగంతో భవిష్యత్తులో కేన్సర్ ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సుగరీ సిరియల్స్, బేక్ చేసిన పదార్థాలు, స్నాక్స్,ఫిజ్జీ డ్రింక్స్, నిల్వచేసిన మాంసం పదార్థాలు, కొవ్వు,ఉప్పు, తీపితో కూడి ఆహార పదార్థాలు విని యోగం ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని వెల్లడించారు. విటమిన్లు, పీచు పదార్థాలు తక్కువగా ఉన్న ఆహారం వినియోగం మరింత ప్రమాదకరమని సూచించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో తక్షణం ఎనర్జీని కలిగించే పదార్థాల వినియోగం 50శాతం ఉందని తెలుస్తోంది. ఫ్రాన్స్,బ్రెజిల్ దేశాల్లోని పరిశోధకుల బృందం ఆహారపు అలవాట్లను పరిశీలించి బ్రెస్ట్,ప్రోస్టేట్,బవల్ కేన్సర్లకు కారణాలను విశ్లేషించారు. 43 ఏళ్ల వయసుకలిగిన 104,980 మంది ఆరోగ్యంగా ఉన్న వారిపై పరిశోధన చేసారు. 12శాతం కేన్సర్లు పెరి గేందుకు ప్రధానకారణం ప్రాసెస్‌చేసిన ఆహారాన్ని వినియోగించడ మేనని తెలుస్తోంది. 11శాతం బ్రస్ట్ కేన్సర్ల పెరుగుదలకు కారణం 10శాతం బేక్‌డ్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ కారణమని పేర్కొన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, రైస్, పాస్తా, గుడ్లు, మాంసం, చేపలు, పాల వినియోగంతో ఆరోగ్యంగా ఉండవచ్చునని తీరు సూచించారు.

ధ్రువాల్లోని భూపొరల్లో పాదరస నిల్వలు



ప్రధానంగా ధ్రువ ప్రాంతాల్లోని భూమి పొరల్లో ఏడాది పొడవునా ఘనీభవన స్థానంలో ఉంటే మంద పాటిగా ఉండే పొరల్లోని పాదరసం భారీ నిల్వల్లో అధిక మొత్తాల్లో ఉందని శాస్త్రజ్ఞులు వెల్లడించారు. అలస్కాలోని పెర్మాఫ్రాస్ట్ లో ఆ నిల్వలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. 2004-2012 మధ్య కాలంలో అలస్కాలోని వివిధప్రాంతాల్లోని పెర్మాఫ్రాస్ట్ భూ భాగాలను పరిశీలించగా, మెర్క్యూరీ, కార్బన్ నిల్వలు అధిక మొత్తాల్లో ఉన్నట్లు భూ గర్భ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఉత్తరార్ధగోళంలోని చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని పెర్మాఫ్రాస్ట్ ప్రాంతాలను వీరు గుర్తించి పరిశోధించగా సుమారు 793 జిగాగ్రామ్స్ అంటే 15 మిలియన్ల గ్యాలెన్లకు పైగా పాదరస నిల్వలు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లోని గడ్డకట్టని, కట్టిన ప్రాంతాల్లోని పెర్మాఫ్రాస్ట్ ప్రాంతాల్లో 1656 జిగాగ్రామ్స్ మెర్క్యూరీని అత్యధిక నిల్వలుఉన్నట్లుగా తెలుస్తోంది.

ఇండియన్ బ్యాంకు నికరలాభం

రూ.1127.01 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు విశిష్ట సేవలు అందించడంలో ఇండియన్ బ్యాంక్ అగ్రగామిగా ఉంది. ఖాతాదారులకు సేవలు అందించడంతో పాటు వివిధ రకాల రుణాలు ఇస్తూ సమాజంలోని అన్ని వర్గాలకు బాసటగా నిలుస్తోంది. ఇండి యన్ బ్యాంక్ గృహ రుణాల రేటును 8.25 వడ్డీ శాతంగా నిర్ణయించింది. స్వదేశీ ఉద్యమంలో భాగంగా 1907, ఆగస్టు 15న స్థాపించిన ఇండియన్ బ్యాంక్ దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. మూడవ త్రైమాసికం 2017, డిసెంబరు 31 నాటికి రూ.3,59,653 కోట్ల వ్యాపారం చేసింది. ముగిసిన తొమ్మిది మాసాల్లో గణనీయమైన ఆదాయన్ని సమకూర్చుకుంది. రూ.1127.01 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. జోనల్ మేనేజర్ ఆర్.మనోహర్ మాట్లాడుతూ ఖాతాదారుల సహకారంతో బ్యాంకు రోజు రోజుకూ వృద్ధి సాధిస్తోందని అన్నారు. ఆశించిన వ్యాపారాన్ని చేశామని చెప్పారు. గృహ రుణాలు పొందిన వారికి నెలవారీ ఈఎంఐ అవకాశం కల్పించినట్టు తెలిపారు. రూ.లక్షకు రూ.751 చొప్పున 30 ఏళ్లలో చెల్లించాలన్నారు.

మోంటే కార్లో డెనిమ్ కలెక్షన్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మోంటే కార్లో సంస్థ తాజాగా అల్ట్రాకూల్ డెనిమ్ కలెక్షన్స్ ఆవిష్కరించింది. ఫ్రెష్ కలర్స్, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వీటిని అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. జీన్స్, షార్ట్స్, ఢంగారిస్ కాప్రిస్, డ్రెసెస్‌ను ఆవిష్కరించినట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోనికా ఓస్వాల్ తెలిపారు. డెనిమ్ ఎంతో ఆదరణ పొందిందని, వివిధ వయసుల వారికీ అనువైన దుస్తులను తమ సంస్థ అందిస్తోందన్నారు. యువత అభిరుచులకు అద్దంపట్టేలా తమ దుస్తులు ఉంటాయని తెలిపారు.



దీర్ఘకాలిక ప్రణాళికతో 'ఫుజిత్సు' ఎంట్రీ

26 రకాల ఏసీ మోడళ్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశ మార్కెట్‌లో భారీ వాటా కోసం అవసరమైన ప్రణాళికలతో ఫుజిత్సు జనరల్ సంస్థ హైదరాబాద్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. దేశప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా 26 కొత్త మోడళ్ల ఏసీలను ప్రవేశపెట్టినట్టు ఫుజిత్సు జనరల్ ఇండియా లిమిటెడ్ అధ్యక్షుడు ఎట్సురో సైటో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏడు స్ప్లిట్ ఏసీలు, 12 ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీలు, మూడు క్యాసెట్ ఏసీలు, నాలుగు డబ్ల్యూ ఏసీలను విడుదల చేసినట్టు చెప్పారు. వీటిలో 14 రకాలు 52 డిగ్రీల ఉష్ణోగ్రతగల ప్రాంతాలలో ఉపయోగించదగినవన్నారు. 155 నుంచి 265 ఓల్టుల వరకు అసాధారణ విద్యుత్ సరఫరా ఉన్న ప్రాంతాలకు అనువుగా పనిచేసే ఐదు మోడళ్లు ఉన్నట్టు తెలిపారు. ఏసీల ధరలు రూ.25,200 నుంచి రూ.1,52,250 మధ్య ఉంటాయన్నారు. కంపెనీకి దేశవ్యాప్తంగా 2500 మంది డీలర్లు, 350 సర్వీస్ ఫ్రాంచైజీలతో కూడిన నెట్‌వర్క్ ఉందని చెప్పారు. రెండేళ్లలో రూ.200కోట్ల పెట్టుబడులను పెట్టాలని తమ సంస్థ యోచిస్తోందని, మార్కెట్‌ను అనుసరించి వాటిని ఎక్కడ పెట్టాలో నిర్ణయిస్తుందన్నారు. సింగపూర్‌లోని ఫుజిత్సు జనరల్ ఆసియా ఎండీ కెనిచి ఇషికావా, థాయిలాండ్ ఫుజిత్సు జనరల్ ఇంజినీరింగ్ ఎండీ మాయాయోషి కొగురే, ఫుజిత్సు జనరల్ ఆసియా జనరల్ మేనేజర్ సైచిరో సాకియామా, ఇజిపిఎల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగం అధిపతి కేసీ పూవయ్య పాల్గొన్నారు.

పదాలను కనుక్కోండి

G	B	E	N	C	H	Z	B	R	K	D	Y	U	O
L	N	L	L	W	D	E	V	T	C	U	L	E	U
G	F	I	L	B	N	J	S	V	E	C	E	K	O
G	V	F	Y	E	M	A	O	L	R	K	F	J	Y
R	S	Q	D	F	F	U	A	F	W	L	A	C	N
Z	O	I	Z	K	I	E	H	N	P	I	S	J	X
A	C	S	A	L	T	R	E	W	I	N	B	S	Q
T	I	E	E	S	A	N	R	U	H	G	T	R	Y
Y	R	A	R	B	I	L	W	E	S	S	L	C	F
B	N	L	T	A	D	V	E	N	T	U	R	E	O

ADVENTURE LIBRARY
BENCH ROSE
BENEDICT SAFELY
BREAKFAST SHIPWRECK
DUCKLINGS STEAL
HUMBLE TERRIFYING



చిన్నారులూ తెలుసుకోండి!

1. ఎల్ఈడీ అంటే ఏమిటి?
 - లైట్ ఎమిటింగ్ డయోడ్
2. మన ఎల్పీజీ సిలెండర్‌లో ఉండే వాయువులు ఏవి?
 - ప్రోపేన్, బ్యుటేన్
3. ప్రపంచంలో అతిపెద్ద చెట్ల జాతి ఏది?
 - రెడ్‌ఉడ్
4. రామాయణం ఎవరు రాశారు?
 - వాల్మీకి
5. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఎప్పుడు?
 - సెప్టెంబరు ఎనిమిది
6.. శ్రీనాథుడు బిరుదు ఏమిటి?
 - కవి సార్వభౌమ
7.. పోతనను ఏమని పిలుస్తారు?
 - సహజకవి
8.. అల్లసాని పెద్దన బిరుదు ఏమిటి?
 - ఆంధ్ర కవితా పితామహుడు
8 ఎర్రన బిరుదు ఏది?
 - ప్రబంధ పరమేశ్వరుడు
9 ఆరుద్ర బిరుదు ఏమిటి?
 - కళాప్రపూర్ణ

పెద్దల మాట



పదవ తరగతి చదువుతున్న రాజేష్ తెలివైన విద్యార్థి. ఏ విషయాన్నైనా ఇట్టే గ్రహించేవాడు. కానీ రాజేష్ పరీక్షలప్పుడే చదివేవాడు. మిగిలిన రోజుల్లో ఎక్కుగా ఆటపాటలతో కాలం గడిపేవాడు. ప్రతీరోజూ తమ ఇంటికి ఎదురుగా ఉన్న మైదానంలోనికి వెళ్ళి తోటి పిల్లలతో కర్రా బిళ్ళా, గోలీలాటలు ఆడేవాడు. ఎవరెంతగా చెప్పినా రాజేష్ తన ప్రవర్తన మార్చుకోలేదు. ఆటలాడినా రాజేష్ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యేవాడు. కానీ మామూలు మార్కులు వచ్చేవి.

ఒకరోజున రాజేష్ తల్లి సరస్వతి 'ఒరే బాబూ, ప్రతీరోజూ స్కూల్ నుడి వచ్చి ఆటలాడటానికి వెళ్ళిపోతున్నావు. తర్వాత వచ్చి అన్నం తిని పడుకుండిపోతున్నావు ఇలాగైతే నువ్వు పరీక్షల్లో పాసవడం చాలా కష్టం, పైగా ఈ ఏదాది పదో తరగతి పరీక్షలు రాయాలి' అంది.

అమ్మా నువ్వేమి బెంగపడకు, నేను ఒక్కసారి చదివానంటే అన్నీ గుర్తుంటాయి. నేను తప్పకుండా పరీక్షలలో పాసవుతాను అని మితిమీరిన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశాడు రాజేష్.

బాబూ నువ్వు తెలివైనవాడితే కాదనను కానీ మననుంచి కూడా గట్టి ప్రయత్నం ఉండాలి, లేదంటే నష్టపోక తప్పదు అని వివరించింది తల్లి సరస్వతి అన్నం పెడుతూ. సర్లే అమ్మా నువ్వు చెప్పినట్లే చదువుతాను అన్నాడేగానీ ఏరోజూ పుస్తకం తీసి చదవలేదు. ఫైనల్ పరీక్షలు వచ్చేశాయి. నానాహైరానాగా పరీక్షలప్పుడే చదవడం వల్ల తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. దీంతో చదివిన విషయాలూ మర్చిపోయాడు. ముందు నుంచీ చదవకపోవడం వల్ల రాజేష్ పరీక్షలు సరిగ్గా రాయలేకపోయాడు. దీంతో పరీక్ష తప్పాడు. తన స్నేహితులంతా ఉత్తీర్ణులై కాలేజీకి వెళ్ళిపోయాడు. రాజేష్ మాత్రం పదోతరగతిలోనే ఉండిపోయాడు. అప్పటికి గానీ బుద్ధిరాలేదు రాజేష్‌కి. అమ్మ చెప్పినట్టు ప్రతీరోజూ చదివి ఉంటే తప్పనిసరిగా పరీక్ష పాసయ్యేవాడిని కదా, అందుకే పెద్దలు చెప్పిన మాటలు వినాలని అంటారు అనుకున్నాడు రాజేష్. ఇకపై అమ్మ చెప్పినట్లే వింటాను అని నిర్ణయించుకున్నాడు. పెద్దలు చెప్పినట్లు నడుచుకుంటూ చక్కగా చదివి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు.

– ఎం. సోమశేఖరాచార్యులు

వెలుతురు నుంచి చీకటి గదిలోకి వస్తే కాసేపు కనబడదేం..!?

కంటిపాపకు కాంతి తీవ్రత, పరిమాణాన్ని బట్టి సర్దుబాటు చేసుకునే సామర్థ్యం ఉంది. అందుకే మనం కాంతి తక్కువగా ఉన్నప్పుడు కూడా వస్తువులను గుర్తించగలుగుతాం. కాంతి తక్కువగా ఉన్నప్పుడు కంటిపాప తనంతట తానే వ్యాకోచిస్తుంది. అందువల్ల ఎక్కువ కాంతి కంటిలోకి ప్రవేశించడం వల్ల చీకటిలో ఉన్న వస్తువులను చూడగలుగుతాం. అదే కాంతి ఎక్కువగా ఉన్నప్పుడు కంటిపాప సంకోచిస్తుంది. బయటినుంచి చీకటి గదిలోకి వచ్చినప్పుడు వస్తువులు వెంటనే స్పష్టంగా కనిపించకపోవడానికి మరో కారణం ఉంది. మన కళ్లలో మూడు పొరలుంటాయి. అన్నింటికన్నా లోపల ఉండే పొర రెటీనా. దీనిలో రాడ్స్, కోన్స్ అనే కణాలు ఉంటాయి. రాడ్స్‌లో ఊదారంగులో ఉండే రోడాప్సిన్ అనే పదార్థం ఉంటుంది. వస్తువు నుంచి బయలుదేరిన కాంతి కిరణాలు కంటిలోని రెటీనాపై పడి రోడాప్సిన్‌ను రెండు పదార్థాలుగా విడగొడుతుంది. ఈ ప్రక్రియ ద్వారానే మెదడుకు సంకేతాలు అందుతాయి. మనం వస్తువులను చూడగలుగుతాం. ఈ పదార్థం ఒకవైపు విఘటనం చెందుతున్నా.. మరోవైపు కొత్తగా తయారవుతునే ఉంటుంది. కాంతి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఇది ఎక్కువగా విఘటనం చెందుతుంది. ఈస్థితిలో మనం గదిలోకి వెళితే ఆ దశలో రోడాప్సిన్ తక్కువ మోతాదులో ఉన్నందున స్పష్టంగా చూడలేం. కాసేపటిలో రోడాప్సిన్ ఏర్పడడం వల్ల తిరిగి చూడగలుగుతాం.





చిలిపి ప్రశ్న

ఒంటిపై పెట్టలేని వాత?
సమాధానం : తరువాత

మరి జవాబుకు

టీచర్ : పరీక్షలో ఒక్కో ప్రశ్నకు సమయం పది నిమిషాలు మాత్రమే.
చింటూ : మరి జవాబుకు టీచర్?

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



ఇలాంటి ఛేంజ్ అవసరం 'అ' సినిమాపై నాని



నాని అ! మూవీ ఇంట్రెస్టింగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ సినిమా సెట్స్ పైకి వచ్చినప్పటి నుండి రిలీజ్ వరకు చేసిన అద్భుతమైన జర్నీని మీడియాతో షేర్ చేసుకున్నాడు నాని. అవి మీకోసం

సినిమా కొంతమంది ఫ్రెండ్స్‌కి చూపించాను. అష్టాచెమ్మా అప్పుడు కూడా అంతే అదే ల్యాబ్ అదే టెన్షన్ నాకర్థమయింది ఏంటంటే, ఎన్ని సినిమాలు చేసిన మనకు రిలీజ్ అనేది ప్రతిసారి కొత్తే అది అలవాటు పడలేం

తేడా ఏమీ ఉండదు.

ఈ సినిమాకి డబ్బులు పెట్టామని టెన్షన్ కాదు.. నేను డబ్బులు పెట్టకపోయినా అంతే టెన్షన్ ఉంటుంది. సినిమా అనేది రెస్పాన్సిబిలిటీ. సక్సెస్ అయితేనే అందరికే హ్యాపీ

తెలుగులో డిఫెరెంట్ సినిమాలు రావడం లేదు.. ఎవరూ చేయడం లేదు అనుకోవడం కన్నా, మనమే ఎందుకు చేయకూడదు అనుకుని చేసిన సినిమా ఇది. ఇండస్ట్రీలో ఇలాంటి చేంజ్ అవసరం అనిపించే ఈ సినిమాని నిర్మించాను.

అటు కృష్ణార్జున యుద్ధం మూవీ, ఇటు ఈ సినిమా.. రెండు బ్యాలన్స్ చేయడం చాలా కష్టమైంది. ప్రస్తుతం గోవాలో షిప్ లో, సముద్రం మధ్యలో షూటింగ్ జరుగుతోంది. అస్సలు సిగ్నల్ ఉండదు. సిగ్నల్ ఎక్కడ దొరుకుతుంతో చూసుకుని మరీ టీమ్‌తో కమ్యూనికేట్ అవ్వాలి. ప్రొడ్యూసర్ అన్నాక ప్రతి డిపార్ట్ మెంట్ తో కనెక్ట్ అవ్వాలి

కాకపోతే కిక్కుంది

ఏం చేసినా ఇష్టపడే చేస్తాం కాబట్టి కష్టపడ్డా అందులో కిక్ ఉంటుంది. నిద్ర సరిపోకపోయినా ఎగ్జైట్‌మెంట్‌తో లేచి పొద్దునే లేచి కూర్చుంటాం.

అవగాహన వచ్చింది.

ఒక సినిమా వెనకాల ప్రొడ్యూసర్ పడే కష్టాలేంటి అనేది ఈ సినిమా ద్వారా తెలిసొచ్చింది. ఇంతకు ముందు కూడా తెలుసు. కాకపోతే ఈ సినిమాతో కంప్లీట్ గా అవగాహన వచ్చింది. సినిమా అనేది ఆర్ట్‌తో పాటు బిజినెస్ కూడా ఇన్వాల్వ్ అవుతుంది. ఎప్పుడైతే బిజినెస్‌ని మైండ్‌లో పెట్టుకుంటామో, ఆర్ట్ వ్యాల్యూ పోతుంది. ఎలాంటి సినిమా తీస్తే ఆడుతుంది అని తీయడం వేరు, బిజినెస్ గురించి ఏ మాత్రం ఆలోచన లేకుండా, నా లాంటి ఆడియెన్‌కి, ఏదో కొత్తదనం ఎక్స్‌పెక్ట్ చేస్తున్న ఆడియెన్ కోసం తీసిన సినిమా ఇది. ప్రస్తుతం ఉన్న సినిమా ఫార్మాట్ మారి కొత్తదనం రావాలని చేసిన సినిమా అ!

నాకు కొద్దో గొప్పో పేరుంది, నేను చేసిన సినిమాలు ఈ మధ్య సక్సెస్ అవుతున్నాయి కాబట్టి అదే కాన్ఫిడెన్స్‌తో చాలా మంది ప్రొడ్యూసర్స్ ముందుకు వచ్చారు. కానీ ఇది నేను చేస్తున్న రిస్క్, అ! లాంటి డిఫెరెంట్ సినిమా చేయాలనేది నా డెసిషన్. కాబట్టి ఎవరినో ఎందుకు రిస్క్ లో పెట్టాలి. అందుకే సినిమాని నేనే రిలీజ్ చేస్తున్నా ఇది సక్సెస్ అయితే కంప్లీట్‌గా రెగ్యులర్ సినిమాల ఫార్మాట్ మారిపోతుంది

అప్పుడే అర్థమయింది.

ఒక కొత్త కథని ఇంత డిఫెరెంట్‌గా, డీటేలింగ్‌గా రాసుకుని నా దగ్గరికి వచ్చి కథ చెప్పగలిగాడంటే డైరెక్టర్‌గా సగం సక్సెస్ అయినట్టే. అందుకే డెబ్యూ డైరెక్టర్.. చేయగలుగుతాడా లేదా..? అనే క్వశ్చన్ కూడా నాకు తట్టలేదు

కాజల్, నిత్యా మీనన్.. రెజీనా వీళ్ళంతా నాకోసం ఈ సినిమా చేయలేదు. కథ విని సినిమా చేశారు. ప్రతీది సినిమా ప్రాసెసింగ్‌లోనే జరిగింది. కాకపోతే వాళ్ళు ఒక్కో సినిమాకి 40 45 రోజులు షూటింగ్ చేస్తారు, ఈ సినిమాకి అన్ని రోజులు చేయరు కాబట్టి, ఒక రెమ్యూనరేషన్ అనుకున్నారు.. దాన్ని బట్టే జరిగింది. నేను ప్రొడ్యూసర్ లాగానే ఉన్నాను. వాళ్ళు యాక్టర్స్ లాగానే చేశారు. ఇక్కడ ఎవరూ ఎవరి కోసం చేయలేదు. కథను నమ్మే చేశారు

మంచి సినిమాలు చేశాను. సాధారణ యాక్టర్ స్థాయి నుండి సినిమా ప్రొడ్యూస్ చేసే స్థాయిలో ఈ రోజు ఉన్నానంటే, దాని వెనకాల చాలా మంది డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ ఉన్నారు. ఇప్పుడు నేను నిర్మాతను అయ్యాను కదా నా సినిమాలు నేను చేసుకోనునేనెప్పుడూ అందుబాటులో ఉంటా

వాల్ పోస్టర్ బ్యానర్‌పై జస్ట్ డబ్బుల కోసమే సినిమా అస్సలు చేయను. మళ్ళీ ఇలాగే ఒక మంచి కథ వినిపించి, చేసేద్దామనిపించిన రోజే సినిమా చేసా ఏమో ఈ సినిమా తరవాత ఇంకొన్ని రోజులు సినిమా ప్రొడ్యూస్ చేయకపోవచ్చు

ఇతర భాషల్లో మొన్న సత్యం సినిమాస్ వాళ్ళు వచ్చి సినిమా చూసి కాసేపు అసలు ఏమీ మాట్లడకపోయారు. ఆ తరవాత ఈ సినిమాని తమిళం. మలయాళం లో రిలీజ్ చేస్తున్నాం. మీరు రీమేక్ గురించి కూడా ఆలోచించవద్దు. జస్ట్ డబ్బింగ్ చేసి రిలీజ్ చేద్దాం.స్ట్రయిట్ సినిమా అంత ఇంపాక్ట్ ఇస్తుందని చెప్పారు. ప్రస్తుతం డబ్బింగ్ బిగిన్ చేసే ప్రాసెస్ లో ఉన్నాం.. త్వరలో,మళయాళ, తమిళ భాషల్లో అ! రిలీజవుతుంది.

ఏమీ లేని నాకు ఈ స్థాయి ఇచ్చింది సినిమానే, అందుకే సినిమా నాకేం ఇచ్చిందో అదే సినిమాకు కూడా ఇచ్చేయాలి. కొత్త ట్యాలెంట్ ని ఎంకరేజ్ చేస్తా ఈ రోజు నా దగ్గరున్న ప్రతి రూపాయి సినిమా ఇచ్చిందే అలాంటప్పుడు సినిమాకు పెట్టడంలో తప్పేంటి అనిపించింది.

అప్పుడే నా కరియర్ కి అర్థం ఉంటుంది.

సినిమా ఇండస్ట్రీలో మార్పుకి చాలా ప్రయత్నాలు చేశారు. వాల్ పోస్టర్స్ సినిమా బ్యానర్ పై కూడా డిఫెరెంట్ సినిమాలు వచ్చేవి. ఈ రోజు ఉన్న ఈ మార్పులో వాల్ పోస్టర్ సినిమాస్ ప్రయత్నం కూడా ఉంది అని చెప్పుకుంటే చాలు.. అప్పుడే నా కరియర్ కి అర్థం ఉంటుంది

కథ చెప్పలేం

నా ప్రతి సినిమా కథని ట్రైలర్‌లో రివీల్ చేస్తుంటాం. ఎందుకంటే కథ పాతదే కానీ మనకు తెలిసిన ఒక ఎమోషనల్ జర్నీని ట్రావెల్ చేస్తాం అది నచ్చితే సినిమా హిట్టు. కానీ ఈ సినిమా అలా కాదు. మీకు ఈ సినిమాలో ఆశ్చర్యం కలుగుతుంది, చిరాకు కలుగుతుంది.ఎగ్జైట్‌మెంట్ కలుగుతుంది.. ఇలా అన్ని రకాల ఫీలింగ్స్ బ్లెండ్ అయి అద్భుతంగా ఫీల్ అయి బయటికి వస్తారు.

సినిమా ఒక పర్టికులర్ ఆడియెన్స్‌కి నచ్చుతుంది. అందరికీ నచ్చకపోవచ్చు. ఒక ప్లేట్‌లో పాస్తా, బిర్యాని, పప్పన్నం ఎలా సర్వ్ చేయలేమో, అందరికీ ఒకేసారి నచ్చేలా సినిమా చేయలేం ఎవరినీ టార్గెట్ చేసి సినిమా చేయలేదు

ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి.

మన సినిమాలు మహా అయితే నేషనల్ లెవెల్ కి వెళ్తాయి. కానీ నాకు మన సినిమాలు ఫిల్మ్ ఫెస్టివల్స్ కి వెళ్ళాలి. క్వాలిఫై అవ్వాలి. నాకు అ! సినిమాకి అంత వ్యాల్యూ ఉందని నేను నమ్ముతున్నాను.

నా డైరెక్టర్స్‌కి ఇప్పటికీ అసిస్టెంట్‌ని

నేను సెట్స్‌లో క్యారీవ్యాన్ లోకి వెళ్ళేది జస్ట్ డ్రెస్ చేంజ్ చేసుకోవడానికే. నా షాట్స్ అయిపోతే డైరెక్టర్‌కి అసిస్ట్ చేస్తుంటా ఏమైనా కావాలన్నా చూసుకుంటూ ఉంటా ఇంకా నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా రిజైన్ చేయలేదు సినిమాలో బిగినింగ్‌లో నా పేరు వేసినా వేయకపోయినా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ లాస్ట్ కైనా నా పేరు వేయండి అని చెప్తుంటా.. కానీ వేయరు

నెక్స్ట్ సినిమా

శీరామ్ ఆదిత్యతో సినిమా ఫిబ్రవరి 24 న లాంచ్ అవుతుంది. ఇంకా స్క్రిప్ట్ డిస్కషన్స్ జరుగుతున్నాయి.



సప్తగిరికి విజయేంద్ర ప్రసాద్ కథ

'బాహుబలి, భజరంగీ భాయ్ జాన్' వంటి బ్లాక్ బస్టర్ సినిమాలకు కథలందించి దేశవ్యాప్త గుర్తింపు సంపాదించుకున్న రచయిత విజయేంద్రప్రసాద్. రాజమౌళి చేసిన దాదాపు అన్ని సినిమాలకు ఈయనే కథల్ని అందించారు. ఈమధ్య రాజమౌళి చేసే సినిమాలకు మాత్రమే కాకుండా బయటి సినిమాలకు కూడా కథల్ని అందిస్తున్నారు. మంచు విష్ణు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహించబోయే సినిమాకు విజయేంద్ర ప్రసాదే కథ అందిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం మేరకు ఈ రైటర్ కమెడియన్ నుండి హీరోగా మారిన సప్తగిరి తర్వాతి సినిమాకు స్టోరి అందిస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి స్వర్ణ సుబ్బారావ్ దర్శకత్వం వహించబోతున్నాడు. త్వరలో ఈ సినిమా ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ మూవీ కోసం నటీనటుల ఎంపిక జరుగుతోంది.



త్రివిక్రమ్ సినిమాకి తమన్ సంగీతం

ఈ ఏడాది భాగమతి సినిమాతో మ్యూజిక్ డైరెక్టర్‌గా మంచి సక్సెస్‌ను సాధించాడు ఎస్.ఎస్.తమన్. గత నెల విడుదలైన భాగమతి మంచి పేరు తెచ్చింది. అయితే ఈ ఫిబ్రవరి తమన్‌కు ఇంకా బాగా కలిసొచ్చిందనాలి. ఎందుకంటే తమన్ సంగీతం అందించిన ఇంటిలిజెంట్ బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయినా,.. తొలిప్రేమ మాత్రం బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యి కూర్చుంది. దీంతో తమన్ సంగీతంలో సినిమా చేయడం కోసం పెద్ద దర్శకులు ఆసక్తిగా ఉన్నారు. అందులో ఇప్పుడు త్రివిక్రమ్ కూడా చేరారనేది టాక్. విషయమేమంటే.. ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. దీనికి ముందుగా అనిరుధ్‌ని సంగీత దర్శకుడిగా అనుకున్నారు. అయితే అజ్ఞాతవాసి ఫ్లాప్ అనిరుధ్ టాలీవుడ్ ఎంట్రీకి బ్రేక్ వేసింది. త్రివిక్రమ్



అనిరుధ్‌ని కాదని దేవిశ్రీ ప్రసాద్‌ని సంగీత దర్శకుడిగా తీసుకుంటారని వార్తలు కూడా వచ్చాయి. అయితే ఇప్పుడు త్రివిక్రమ్ చూపు తమన్‌పై పడిందని అంటున్నార. త్వరలోనే ఈ విషయంపై ఓ క్లారిటీ రానుందట

వీకెండ్ విడుదలకు సిద్ధమైన 2 సినిమాలు



ఈ వీకెండ్ విడుదలకు సిద్ధమైన 2 సినిమాలు ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ రెండు సినిమాలు వేటికవే ప్రత్యేకం. దేని స్పెషాలిటీస్ దానికున్నాయి. హేవే లుక్. ఈ వీకెండ్ థియేటర్లలోకొస్తున్న మూవీ "అ!". ప్రశాంత్ వర్మ అనే కొత్తకుర్రాడు డైరక్ట్ చేసిన సినిమా ఇది. కాబట్టి పట్టించుకోవాల్సి అవసరం లేదు. కానీ "అ!" సినిమాలో చాలా ప్రత్యేకత లున్నాయి. దీని కథ ఏంటనేది ఇప్పటివరకు బయటకు రాకపోవడం ఓ స్పెషాలిటీ అయితే, ఈ కథ నచ్చి హీరో నాని ఏకంగా నిర్మాతగా మారడం "అ!" సినిమాను లైమ్ లైట్లో నిలబెట్టింది ఇక్కడితో "అ!" సంచలనాలు ఆగలేదు. ఈ కథ నచ్చి ఏకంగా స్టార్ హీరోయిన్ కాజల్ ఇందులో నటించడానికి ఒప్పుకుంది. కాజల్ తో పాటు నిత్యామీనన్, రెజీనా, ఇషా, అవసరాల శ్రీనివాస్ కూడా ఇందులో నటించారంటే కేవలం కథ నచ్చడం వల్లనే. అందుకే "అ!" సినిమాపై అందరి దృష్టిపడింది. ఇక "అ!"తో పాటు వీకెండ్ థియేటర్లలోకి వస్తున్న మరో సినిమా మనసుకు నచ్చింది. ఇందులో కూడా కొన్ని ప్రత్యేకత లున్నాయి. సూపర్ స్టార్ కృష్ణ కూతురు, మహేష్ అక్క మంజుల దర్శకురాలిగా మారి తీసిన సినిమా ఇది. సందీప్ కిషన్, అమైరా దస్తర్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో మంజుల కూతురు, భర్త కూడా నటించారు.

వాయిస్ ఓవర్ మహేష్ బాబు

తాజాగా ఈరోజు ఉదయం ఇంకొక ట్రైలర్ ను విడుదలచేశారు. ఈ ట్రైలర్‌కు మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఇవ్వడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఇందులో మహేష్ ప్రకృతి పాత్రకి వాయిస్ ఓవర్ ఇస్తూ అసలు ప్రకృతి అంటే ఏంటో వివరిస్తూ నేను నీకు హెల్ప్ చేస్తాను.. నువ్వు చేయాల్సిందల్లా నన్ను ఫీలవ్వడమే అంటూ చెప్పిన డైలాగ్స్ వాస్తవిక భావనతో నిండి ఆకట్టుకుంటున్నాయి. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఆసక్తి ఇంకాస్త పెరిగింది. మరి మనిషి ప్రకృతితో ఎలా మమేకమవ్వాలో చెప్పేదిగా ఉంటుందని మంజుల చెబుతున్న ఈ చిత్రం ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

భిక్షమేస్తున్నారా..?

రేప్ బాధితులకు పరిహారంపై సుప్రీం



న్యూఢిల్లీ : అత్యాచారం విలువ 6,500 రూపాయలా? అని సుప్రీంకోర్టు ఆశ్చర్యం వెలిబుచ్చింది. లైంగికదాడి బాధితులకు భిక్షమేస్తున్నారా? అని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. అత్యాచార బాధితులకు రూ.6,500 ఇవ్వడాన్ని చారిటీగా భావిస్తున్నారా అని నిలదీసింది. అత్యాచార బాధితులకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.6000-6500 పంపిణీ చేయడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. నిర్భయ నిధి పథకం కింద కేంద్రం నుంచి అత్యధిక నిధులు తీసుకుంటున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం అత్యాచార బాధితులను బిచ్చగాళ్లలా చూస్తున్నదని మండిపడింది. ఢిల్లీలో 2012 డిసెంబరు 16న జరిగిన నిర్భయ ఘటన తర్వాత బాధితులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం 2013లో నిర్భయ నిధి పథకాన్ని ప్రారంభించింది. అత్యాచార బాధితులకు సాయంపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తా ధర్మాసనం విచారించింది. 'మీరు దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం అత్యాచార బాధితులకు సరాసరిన కేవలం రూ.6 వేలు చెల్లించారు. మీరేమైనా ఛారిటీ చేస్తున్నారా? ఇంత తక్కువ ఎలా ఇస్తున్నారు? అత్యాచారానికి రూ.6,500 విలువ కట్టారా' అని మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ధర్మాసనం చీవాట్లు పెట్టింది. మధ్యప్రదేశ్‌లో 1951 మంది అత్యాచార బాధితులు ఉన్నారు. ఒక్కొక్కరికీ రూ.6 వేల నుంచి రూ.6,500 చెల్లించారు. నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకుంటున్న మీరు బాధితులకు ఇంత తక్కువ పరిహారం ఇస్తారా అని చౌహాన్ ప్రభుత్వాన్ని నిలదీసింది. 1951 మంది బాధితులకు కేవలం కోటి రూపాయలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. నిర్భయఫండ్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించని హర్యానా ప్రభుత్వానికి సుప్రీం మొట్టికాయలు వేసింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించడానికిగాను నిర్భయ నిధి కింద కేంద్రం నుంచి ఎంతమొత్తం తీసుకున్నారు? ఎంతమందికి పరిహారం చెల్లించారు? పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు జనవరిలో ఆదేశించింది. 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటి దాకా అఫిడవిట్‌లే దాఖలు చేయలేదు.


కర్ణాటకలో బీజేపీకి ఓటమి భయం

యడ్యూరప్ప మానసిక రోగి

ఎన్నికల వేళ మాంసాహారం ఆరోపణలేమిటి?

మరాఠీల ఊచకోత అలాంటిదేగా?

బీజేపీపై శివసేన నిశిత విమర్శ



ముంబై : బీజేపీపై మిత్రపక్షం శివసేన మరోసారి విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడమేమిటని బీజేపీని నిందించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చికెన్‌తో భోజనం చేసి ఆలయ దర్శనానికి వెళ్లారంటూ బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప ఆరోపించడాన్ని శివసేన నిశితంగా విమర్శించింది. ఎన్నికల సమయంలో ఇలాంటి అంశాలు లేవనెత్తడమంటే బీజేపీ బలహీనత, ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తున్నదని పేర్కొన్నది. ఎన్నికల ప్రచారంలో ఇలాంటి ప్రచారం బీజేపీ మానసిక స్థితిని బహిర్గతం చేస్తున్నదని వ్యాఖ్యానించింది. కర్ణాటకలో బీజేపీకి ఓటమి భయం పట్టుకున్నట్టు కనిపిస్తోందని ఆరోపించింది. కర్ణాటక ఉత్తర ప్రాంతంలో రాహుల్‌గాంధీ రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సందర్భంగా రాహుల్ చికెన్ తిని ఆలయాన్ని సందర్శించారని యడ్యూరప్ప ఆరోపించారు. 'రాహుల్‌గాంధీ గుజరాత్‌లో బీజేపీకి నిద్రలేని రాత్రులు కల్పించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడు తుందని బీజేపీ భయపడుతున్నట్టు కనిపిస్తోంది. గుజరాత్‌లో రాహుల్ చాలా ఆలయాలను సందర్శించారు. అక్కడ ప్రార్థనలు చేశారు. ఆ సమయంలోనూ రాహుల్‌ను బీజేపీ తీవ్రంగానే విమర్శించింది. దానికి ఫలితం అనుభవించింది' అని శివసేన తన పత్రిక సామ్నా సంపాద కీయం నిశితంగా ఎండగట్టింది. ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్‌గాంధీ కొప్పాల్ జిల్లా కనకగిరిలో కనకాచల లక్ష్మి నరసింహ ఆలయాన్ని సందర్శించారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకున్నది. రాహుల్‌కు హిందుత్వను అంటగట్టడం ద్వారా గుజరాత్ అనుభవాన్నే బీజేపీ కర్ణాటకలో చవిచూడబోతోందని శివసేన పేర్కొన్నది. 'ఇప్పుడు కర్ణాటకలో ఎన్నికల ర్యాలీలు జరుగుతున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. గుజరాత్ లో మాదిరిగా కర్ణాటకలోనూ రాహుల్‌గాంధీ మసీదులు, ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇది బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి బీఎస్ యడ్యూరప్పకు ఆగ్రహం తెప్పించింది. అందుకే ఆలయం సందర్శనకు ముందు రాహుల్ మాంసం తిన్నాడని ఆరోపణలు గుప్పించారు' అని ఉద్ధవ్ ఠాకరే నాయకత్వంలోని శివసేన ఆరోపించింది. యడ్యూరప్ప ఆరోపణలకు కాంగ్రెస్ వెంటనే స్పందిస్తూ ఆలయానికి వెళ్లడానికి ముందు రాహుల్ శాఖాహార భోజనమే తిన్నారని వివరణ ఇచ్చినప్పటికీ బీజేపీ వైఖరిని దిగజారుడుతనానికి నిదర్శనంగా శివసేన అభివర్ణించింది. ప్రజల మనోభావాలను దెబ్బ తీయడం సరికాదని, ఎవరేమి తింటున్నారో చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. 'ఏ మత ప్రాంతంలోనైనా(ఆలయాలు, చర్చిలు, మసీదులు) ఆయా మతాలకు సంబంధించిన ఆచారాలు, సంప్రదాయాలు ఉంటాయి. మహారాష్ట్రలోని కొన్ని ఆల యాల్లో దేవతలు లేదా దేవుళ్లకు మాంసాన్ని నైవేద్యంగా పెడతారు. ఎన్నికల సమయంలో ఇలాంటి అంశాలను లేవనెత్తేవారు మానసిక రోగులతో సమానం. రాహుల్‌గాంధీ ప్లేటులో ఏముందో ఎవరికి తెలుసు. ఇది మాత్రం బీజేపీ బలహీనతను బయటపెడుతుంది' అని శివసేన నిశిత వ్యాఖ్యలు చేసింది. 'శాఖాహారి యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కర్ణాటక సరిహద్దులో రక్తపాతం జరిగింది. మరాఠీ మాట్లాడేవారిని ఊచకోత కోశారు. పెద్దఎత్తున హింస చెలరేగింది. ఇలాంటి హింస కూడా మాంసాహారం తినడం వంటిదే'నని శివసేన తీవ్ర విమర్శలు చేసింది.

నీరవ్ మోడీపై ప్రియాంక చోప్రా దావా



ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) లో మోస పూరిత లావా దేవీలకు పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీపై బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా దావా వేసింది. నీరవ్‌కు చెందిన డైమండ్ బ్రాండ్‌కు ప్రియాంక చోప్రా ప్రచారకర్తగా వ్యవహరి స్తోంది. కొన్ని నెలల క్రితం ప్రియాంక.. బాలీవుడ్ నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ప్రకటనల్లోనూ నటించింది. అయితే ఈ ప్రకటనలో భాగంగా తనకు ఇవ్వాల్సిన పారి తోషికం ఎగ్గొట్టాడని నీరవ్‌పై ప్రియాంక దావా వేసినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. సిద్ధార్థ్‌కి కూడా నీరవ్ బాకీ ఉన్నట్లు తెలుస్తోంది. జనవరిలో నీరవ్ డైమండ్ బ్రాండ్‌కి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సందర్భంగా ప్రియాంక మీడియాతో మాట్లా డింది. 'నీరవ్‌తో కలిసి పనిచేస్తుంటే మా ఇద్దరి ఆలోచనలు కలిసినట్లుగా ఉంది. ఆయన డిజైన్ చేసే వజ్రాభరణాలు అద్భుతంగా ఉంటాయి. వీటిని అంతర్జాతీయ మార్కెట్లలోనూ అమ్మా లని అనుకుంటున్నాం' అని తెలిపింది. నీరవ్ కుంభకోణం బయటపడడంతో స్నేహితులు, పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు అతనితో మాట్లా డటం మానేసినట్లు తెలుస్తోంది.

దోషులపై పూర్తిస్థాయి చర్యలు

- పారదర్శకంగానే బ్యాంకు కార్యకలాపాలు
- భాగస్వాములకు ఆందోళన అక్కర్లేదు
- పీఎన్‌బీ సీఎండీ వెల్లడి



న్యూఢిల్లీ : వజ్ర వ్యాపారీ నీరవ్ మోడీ కేసులో రూ.11,400 కోట్ల కుంభకోణానికి సంబంధించి దోషులపై పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) గురువారం పేర్కొంది. 2011 నాటి నుంచి ఈ మోసం జరుగుతున్నట్టు తెలిపింది. నీరవ్ మోడీ బ్యాంకులోని ఓ శాఖకు 1.77 బిలియన్ డాలర్లు ఎగవేసి నట్టు వెల్లడించింది. ఇప్పటికే పది మంది అధికారులను సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతం వివిధ ప్రాంతాల్లోని నీరవ్ స్టోర్లలో తనిఖీలు నిర్వహిస్తోంది. బ్యాంకు సీఎండీ సునీల్ మెహతా విలేకరులతో మాట్లాడుతూ '123 ఏళ్లల్లో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాం. దోషులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం. 2011 నాటి నుంచి మోసం జరుగుతోంది. పారదర్శక బ్యాంకింగ్ విధానానికి పీఎన్‌బీ కట్టుబడి ఉంది. మేమే ఈ భారీ కుంభకోణాన్ని ముందుగా కనిపెట్టాం.. వేర్వేరు దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశాం' అని అన్నారు. ఈ ఘటన ముంబై శాఖకు పరిమితమైందని, స్టేక్‌హోల్డర్లు (భాగస్వాములు) ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఇలాంటి మోసాలు ఎక్కడైనా జరుగుతున్నాయా అన్న కోణంలో అన్ని శాఖలపై నిఘా పెట్టినట్టు తెలిపారు.

ఆయా శాఖలకు తగు సూచనలు జారీచేసినట్టు వెల్లడించారు. సెబీకి ముందుగా సమాచారం అందించినది తామేనని మెహతా చెప్పారు. ఈ పరిస్థితి నుంచి బయటపడడం తమకు కష్టమేమీ కాదని, ఖాతాదారులు, భాగస్వాములు ఆందోళన పడాల్సిన పనిలేదని ఆయన స్పష్టంచేశారు. అయితే కేసు దర్యాప్తు నేపథ్య వివరాలను ఆయన వెల్లడించలేదు. కాగా, రెండోరోజూ పీఎన్‌బీ షేర్లు పడిపోయాయి. బీఎస్‌ఈలో ఒక్కొక్కటి రూ.128.35 పలకడంతో సంస్థకు 12శాతం నష్టం వాటిల్లింది.

నీరవ్‌కు 'మోడీ' అండ : కాంగ్రెస్



న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దేశం నుంచి పలాయనం సాగించిన మద్యం వ్యాపారి విజయ్ మాల్యాను మించిపోయాడని కాంగ్రెస్ విమర్శించింది. ప్రధాని మోడీతో ఉన్న పలుకుబడిని నీరవ్ మోడీ వాడుకొని రూ.12వేలకోట్లతో విదేశాలకు చెక్కేశాడని దుయ్యబట్టింది. ఈ బిలియనర్ జారుకుంటుంటే.. ఎన్డీఏ సర్కార్ చూపు తిప్పుకున్నదంటూ వ్యాఖ్యానించింది. 'భారత్‌ను లూటీ చేసేందుకు నీరవ్ మోడీ మార్గదర్శకాలు ఇవే.. 1) ప్రధాని మోడీతో ఆలింగనం. 2) ఆయనతో పాటు దావోస్‌లో కనిపించడం. ప్రధానితో దోస్తీ బిల్డప్ ఇచ్చి.. ఎ) రూ.12వేల కోట్లు లూటీ చేయడం. బి) మాల్యా తరహాలో దేశం నుంచి పలాయనం సాగించడం' అని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎన్డీఏ సర్కార్ అండ దండలతోనే నీరవ్ మోడీ తప్పించుకుపోయారంటూ పార్టీ కమ్యూనికేషన్స్ ఇంచార్జి రణదీప్ సూర్జేవాలా ఆరోపించారు. 'అసలు ఈ నీరవ్ మోడీ ఎవరు ? ఈ మోడీ స్కామ్ ఏమిటి? లలిత్‌మోడీ, విజయ్‌మాల్యా తరహాలో నీరవ్‌నూ తప్పించారా? నీరవ్ పలాయనం వెనుక మోడీ సర్కార్ హస్తం ఉన్నదా? ప్రజాధనాన్ని లూటీ చేసిన వారిని తప్పించుకోనివ్వడం ఆనవాయితీగా మారిపోయిందా? దీనికి బాధ్యులెవరు? అని సూర్జేవాలా ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

మహిళలకు చోటేలేదు

నాగాలాండ్‌కు 54 ఏళ్లు, 12 అసెంబ్లీ ఎన్నికలు

27వ తేదీ ఎన్నికల బరిలో ఐదుగురు మహిళలు



నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)కి చెందిన అవాన్ కొన్యాక్ అబోయి స్థానం నుంచి తొలిసారిగా ఎన్నికల బరిలో నిలబడ్డారు

కోహిమా : రాష్ట్రావతరణ జరిగి 54 ఏళ్లు, 12 శాసనసభ ఎన్నికలు జరిగిన తర్వాత కూడా శాసనసభలో మహిళా ప్రాతినిధ్యాన్ని నాగాలాండ్ రాష్ట్రం చూడలేదు. అయితే త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఐదుగురు మహిళలు బరిలో నిలిచారు. సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా, అసెంబ్లీలో పురుష, మహిళా అభ్యర్థుల వ్యత్యాసాన్ని తొలగించేందుకు పోటీ చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఫిబ్రవరి 27న రాష్ట్రం ఎన్నికలకు సమాయత్తం అవుతుంది. మార్చి 3న ఫలితాలు వెలువడతాయి. ఈసారి 60 మంది సభ్యుల అసెంబ్లీలో 195 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అయితే వీరిలో మహిళలు మాత్రం ఐదుగురే. కాగా నోక్‌సేన్, దిమాపూర్-3 అసెంబ్లీ స్థానాల నుంచి నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)పై వెడీ-యు క్రోను, మంగ్యాసుల్వాలు పోటీ చేస్తున్నారు. ట్యూన్సాంగ్ సదర్-2 స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా రఖిల ఎన్నికల బరిలో ఉన్నారు. కొత్తగా ఏర్పాటయిన నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)కి చెందిన అవాన్ కొన్యాక్ అబోయి స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. చిజామి స్థానం నుంచి రేఖరోజ్ దుక్రో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఇక అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్) ఈసారి మహిళా అభ్యర్థి ఎవరినీ పోటీకి పెట్టలేదు. ఇటీవల ఒక మీడియా సమావేశంలో ఎన్‌పీఎఫ్ అధ్యక్షుడు షురోజెలై లైజిఎట్సే మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీలో మహిళలెవరూ ఆసక్తి చూపలేదన్నారు. రఖిల మినహా మిగిలిన నలుగురు మహిళా అభ్యర్థులు తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. నాలుగుసార్లు శాసనసభ్యుడిగా, మాజీ మంత్రిగా పని చేసి దీర్ఘకాల అస్వస్థత తర్వాత 2006లో మరణించిన లాకిమాంగ్ సతీమణి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. రఖిల గత ఎన్నికల్లో కూడా ఇదే ట్యూన్సాంగ్ సదర్-2 స్థానం నుంచి పోటీ చేసి సుమారు 800 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 'అధికారంలో ఉన్న పురుషులు పని చేయరు. ఇప్పటి వరకు చేయని వాటిని నేను చేస్తాను' అని రఖిల్ పేర్కొన్నారు. ఈ నెల మొదట్లో మరణించిన నాలుగుసార్లు ఎన్నికయిన మాజీ ఎమ్మెల్యే నైయేవాంగ్ కొన్యాక్ కుమార్తె అవాన్ కొన్యాక్ ఎన్‌డీపీపీ అభ్యర్థిగా ఉన్నారు. 'ప్రతిరోజు సమాజంలో మహిళలు విశేషమైన సేవలందిస్తున్నారు. అయితే వారి సమస్యలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. లింగ సమానత్వం, మహిళా సాధికారతపై దృష్టి పెట్టాలనుకుంటున్నా' అని ఆమె తెలిపారు. ప్రత్యామ్నాయ వైద్య నిపుణురాలు మంగ్యాసుల్వా మాట్లాడుతూ మహిళా నాయకురాలి కోసం నొకేసెన్ వంద శాతం సిద్ధంగా ఉందన్నారు. 'రాష్ట్రం ఏర్పడి 50 సంవత్సరాలకు పైబడిన తర్వాత కూడా ఈ నియోజకవర్గంలో వాస్తవ పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి' అని ఆమె తెలిపారు. 60 మంది సభ్యుల సభలో పురుషులు, మహిళలకు వ్యత్యాసం ఉందని వ్యాపారవేత్త నుంచి రాజకీయవేత్తగా మారిన రేఖరోజ్ దుక్రె అభిప్రాయపడ్డారు. సామాజిక కార్యకర్త వెడీ-యు క్రోను మాట్లాడుతూ మహిళలు సమాజంలో సానుకూల మార్పులు తీసుకురాగలరని తెలిపారు. 'అవినీతి వ్యవస్థను శుభ్రం చేయడం క్లిష్టమైనది. వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి నేను రాజకీయాల్లోకి ప్రవేశించాను' అని ఆమె చెప్పారు. కొన్ని వారాలుగా సామాజిక మాధ్యమం వేదికగా ఈ ఐదుగురు మహిళా అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. నాగాలాండ్ ప్రధాన ఎన్నికల అధికారి అభిజిత్ సిన్హా మహిళా అభ్యర్థులను స్వాగతిస్తూ, గత ఎన్నికల్లో ఇద్దరు బరిలో ఉండగా, ఆ సంఖ్య ఇపుడు ఐదుకు పెరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రముఖ మహిళా మండలి నాగా మదర్స్ అసోసియేషన్(ఎన్‌ఎంఏ) సలహాదారు రోజ్మేరీ డజ్‌విచ్ మాట్లాడుతూ ఎన్నికల బరిలో మహిళలు ఉండటం తనకు సంతోషం కలిగిస్తుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని మహిళా ఓటర్లందరూ మహిళా అభ్యర్థులకు ఓటు వేసి మద్దతు తెలియజేయాలన్నారు. పురుషులతో సమానంగా మహిళల భాగస్వామ్యం ఉండటం ముఖ్యమని సామాజిక కార్యకర్త, పారిశ్రామిక వేత్త ఎలునాదస్ట్ అన్నారు. 'నిర్ణయాత్మక సంస్థల్లో భాగస్వామ్యానికి నాగా మహిళలను ప్రోత్సహిస్తాం' అని ఆమె తెలిపారు. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ సభ్యురాలు రానో షైజా, 1977లో లోక్‌సభకు రాష్ట్రం నుంచి ఎన్నికయిన ఏకైక, తొలి మహిళ. అయితే ఆమె అనారోగ్యంతో 2015లో మరణించారు.

గ్రామీణాభివృద్ధి కోసం ఎంతో చేశాం

కేంద్ర మంత్రి రామ్‌కృపాల్



న్యూఢిల్లీ : గ్రామీణ భారతంలో జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎన్డీయే అంతగా ఏ ప్రభుత్వం చేయలేదని, దాని పని చారిత్రాత్మకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రామ్‌కృపాల్ యాదవ్ గురువారం పేర్కొన్నారు. గ్రామీణ దుస్థితిపై ప్రతిపక్షం విమర్శలు చేసింది. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధిలో చారిత్రాత్మక పనిని అంచనా వేసేందుకు యూపీఏ నాలుగేళ్ల పాలనలో, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ నాలుగేళ్ల పాలన కింద ఉపాధి, వ్యయాలకు సంబంధించి తులనాత్మక సమాచారాన్ని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అందించింది. యూపీఏ హయాంలో 2010-14 మధ్య సమయంలో రూ.43,371 కోట్లతో పోల్చితే 2014-18 మధ్యలో గ్రామీణ గృహ కార్యక్రమంపై రూ.77,711 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసిందని మంత్రిత్వ శాఖ నివేదిక పేర్కొంది. నైపుణ్యం లేని వ్యక్తుల పని దినాలు ఆ కాలంలో వరుసగా 49,97 కోట్లు, 25.26 కోట్లుగా ఉన్నాయని వివరించింది. అలాగే రోడ్లు లేని 36,471 గ్రామీణ నివాసాలకు 1,44,906 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులను అనుసంధానించడం జరిగింది. అయితే యూపీఏ పాలనలోని నాలుగేళ్లలో అది కేవలం 27,545 నివాసాలకు 45,924 కిలోమీటర్ల మేర మాత్రమే రహదారులు అనుసంధానమైనట్లు నివేదిక పేర్కొంది. ఇదిలాఉండా కేంద్ర మంత్రి మాట్లాడుతూ 'గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే మా పని, అది చరిత్రాత్మకం' అని అన్నారు. 2017, డిసెంబరు వరకు స్వయం ఉపాధి, సూక్ష్మ సంస్థల ఏర్పాటు లక్ష్యంతో ఐదు లక్షలకుపైగా స్వయం సహాయక గ్రూపులకు మద్దతుగా ప్రభుత్వం పెట్టుబడి అందించిందని నివేదిక తెలిపింది. అయితే ఈ పథకాన్ని ప్రారంభించిన 2011, జూన్, 2014, మార్చి మధ్య కాలానికి ఈ సంఖ్య ఉంది. 2014, ఏప్రిల్, 2017, డిసెంబరు మధ్య ఒక కార్యక్రమం కింద 33.2 లక్షల మంది మహిళా రైతులకు మద్దతు పొందినట్లు పేర్కొంది. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి యూపీఏ తన నాలుగేళ్ల పాలనలో ఖర్చు చేసిన రూ.1,54,527 కోట్లతో పోల్చితే ఎన్‌డీఏ ప్రభుత్వం చేసిన వ్యయం రూ.1,91,865 కోట్లుగా ఉంది.

అరుగంటల్లో 2,501 మందికి రక్తపరీక్షలు

ఖర్గోన్ : మధ్యప్రదేశ్‌లోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆరు గంటల్లో 2,501 మంది రక్త పరీక్షలు నిర్వహించి గోల్డన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకెక్కింది. వివరాల్లోకి వెళితే, ఖర్గోన్ జిల్లాలోని భిల్కన్‌గావ్ పట్టణంలో లక్ష్య పరివార్ అనే స్వచ్ఛంద సంస్థ గతంలో అమెరికాలోని కాలిఫోర్నియాలో సాధించిన పాత రికార్డును బద్దలు కొట్టినట్టు గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఆసియా అధినేత మనీష్ విష్ణోయ్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ చందన్ శర్మకు సర్టిఫికేట్‌ను అందజేశామని తెలిపారు.

యూపీలో డ్రగ్ స్మగ్లర్ అరెస్ట్

మహారాజ్‌గంజ్ : ఉత్తరప్రదేశ్‌లో మాదకద్రవ్యాల స్మగ్లర్‌ని ఎస్ఎస్‌బీ గురువారం అరెస్టు చేసింది. ఆయన వద్ద నుంచి రూ.85 లక్షల విలువైన 85 గ్రాముల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. స్మగ్లర్‌ను నేపాల్‌కు చెందిన గోపాల్ తపా (23)గా గుర్తించినట్టు ఎస్ఎస్‌బీ అధికారి తెలిపారు. బుధవారం రాత్రి భారత్-నేపాల్ సరిహద్దు వద్ద నిర్వహించే రోజువారీ తనిఖీలో వీరు పట్టుబడినట్టు చెప్పారు. వీరిద్దరిపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎన్ఐఏ అదుపులో ఐదుగురు నిందితులు

శ్రీనగర్ : ఎస్ఎంహెచ్ఎస్ ఆసుపత్రి నుంచి ఉగ్రవాది తప్పించుకొని పారిపోవడానికి సహకరించిన ఐదుగురిని ఎన్ఐఏ గురువారం అదుపులోకి తీసుకుంది. 22 ఏళ్ల జాట్ అలియస్ అబూ హంజల్లాను శ్రీనగర్‌లోని ఆసుపత్రి నుంచి తప్పించుకు పారిపోయేందుకు సహకరించిన వీరిని ఈ నెల 8న జమ్మూ, కాశ్మీర్ పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వీరిని విచారణ నిమిత్తం రెండు రోజులు ఎన్ఐఏ కస్టడీకి తరలించాలని ఆదేశించినట్టు ఆ దర్యాప్తు సంస్థ ప్రతినిధి తెలిపారు.

కేరళలో ప్రైవేటు ఆసుపత్రి నర్సుల సమ్మె

తిరువనంతపురం : ప్రైవేటు సెక్టర్‌లో సవరించిన వేతనాలను అమలు పరచాలంటూ యునైటెడ్ నర్సస్ అసోసియేషన్ (యూఎన్ఏ) కేరళలో 24 గంటల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రుల నర్సులు సమ్మెలో పాల్గొన్నారు. అత్యవసర, క్యాజువాలిటీ చికిత్సలకు సంబంధించిన నర్సులు మినహాయించి మిగతావారు సమ్మెలో పాల్గొన్నట్టు యూఎన్ఏ ప్రతినిధి తెలిపారు.

కుప్పకూలిన విమానం - ఇద్దరు పైలెట్లు మృతి

న్యూఢిల్లీ : అసోంలో జోర్హాట్ సమీపంలో గురువారం విమానం కూలింది. ఈ ఘటనలో ఇద్దరు భారతీయ వైమానిక పైలెట్లు మృతిచెందినట్టు అధికార వర్గాలు తెలిపాయి. జోర్హాట్ విమానాశ్రయం నుంచి మైక్రో లైట్ విమానం టెకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిందని తెలిపారు. ప్రమాద ఘటనపై విచారణకు కోర్టు ఆదేశించిందని అధికార వర్గాలు తెలిపాయి.

త్రిపుర చారిలాం స్థానం ఎన్నిక వచ్చే నెల 12కు వాయిదా

అగర్తల : ఎన్నికల్లో త్రిపుర చరిలాం శాసనసభ నియోజకవర్గ స్థానం నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి అకాల మృతి నేపథ్యంలో ఎన్నికలను మార్చి 12కు వాయిదావేసినట్టు ఎన్నికల ఉన్నతాధికారి తెలిపారు. ఈ నెల 11న సీపీఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దెబ్బర్మ గుండెపోటుతో మృతిచెందారు. ఆ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమై ఈ నెల 22 వరకు జరుగుతుందని తెలిపారు.

సరిహద్దులో మందుపాతరలు నిర్వీర్యం

ఐజ్వాల్ : మిజోరాం-మయన్మార్ సరిహద్దులో అర్కన్ ఉగ్రవాదులు పెట్టిన మందుపాతరలను నిర్వీర్యం చేసినట్టు అసోం రైఫిల్స్ గురువారం తెలిపింది. వివరాల్లోకి వెళితే, మిజోరాంలోని లగ్లాటి జిల్లాలో మందుపాతరలను రైఫిల్స్ స్క్వాడ్ నిర్వీర్యం చేసినట్టు డిప్యూటీ కమిషనర్ అరుణ్ టీ విలేకరులకు తెలిపారు. సరిహద్దులో గస్తీ నిర్వహిస్తుందని చెప్పారు. మయన్మార్‌లో సరిహద్దులో జనవరిలో మందుపాతర పేలడంతో ఒక మహిళ మృతిచెందింది.

రెండవసారి ఈడీ దర్యాప్తుకు కార్తీ

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా నగదు బదలాయింపు కేసులో దర్యాప్తులో భాగంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు పి. కార్తి చిదంబరం రెండవసారి గురువారం ఈడీ ముందర హాజరయ్యారు. ఈ కేసులో జనవరి 18న ఏజెన్సీ దర్యాప్తుకు మొదటిసారి ఆయన హాజరయ్యారు. ఈ నెల 2న ఆయనకు సమన్లు జారీ చేసింది. తిరిగి గురువారం ఆయనకు సమన్లు జారీ చేసింది.

గోడౌన్ దగ్ధం - ఒకరి మృతి

ముంబై : ముంబైలో అంధేరీ శివారులోని గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించిందని, ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్టు అధికారి తెలిపారు. అంధేరి-కుర్లా రోడ్డులోని మిట్టల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బుధవారం రాత్రి 1 గంటకు ఈ ప్రమదం జరిగినట్టు చెప్పారు. నాలుగు ఫెరింజన్లు, వాటర్ ట్యాంకర్లు, సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చినట్టు చెప్పారు. బాధితుడిని గుర్తించామని, ఆయన గోడౌన్‌లో నిద్రిస్తుండగా ప్రమాదం జరిగిందని చెప్పారు. కేసు దర్యాప్తు జరుగుతుందని తెలిపారు.

కేరళలో ప్రైవేటు బస్సు ఆపరేటర్ల నిరవధిక సమ్మె

కోచి : బస్సు చార్జీల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనకు నిరసనగా కేరళలో ప్రైవేటు బస్సు ఆపరేటర్లు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె పాటించాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు బస్సుల చార్జీలపై రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం నుంచి ప్రైవేటు బస్సులు నడపకుండా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించుకున్నట్టు ప్రైవేటు బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ తెలిపింది. పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ, రోడ్డు పన్నుకు సంబంధించిన ఇతర డిమాండు సాధనకు సమ్మె చేపడుతున్నట్టు తెలిపింది.

గోవా సీఎంకు స్వల్ప అస్వస్థత

పనాజి : ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థత చెందిన గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్‌కు గురువారం గోవా వైద్య కళాశాల, ఆసుపత్రి (జీఎంసీహెచ్)లో ప్రాథమిక వైద్య పరీక్షలు చేసినట్టు సీఎం కార్యాలయం సీనియర్ అధికారి తెలిపారు. మంగళవారం రాత్రి పారికర్ కడుపునొప్పి కారణంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని, అనంతరం ఆయన విమానంలో ముంబైకి వెళ్లి ఇతర వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపింది. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపింది.

యూపీలో అక్రమ ఆయుధాల తయారీ కేంద్రం గుట్టురట్టు

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో అక్రమ ఆయుధాల తయారీ కేంద్రం గుట్టు రట్టు చేసినట్టు పోలీసు అధికారి గురువారం తెలిపారు. బిదహాన గ్రామంలో అక్రమ ఆయుధాల తయారీ కేంద్రం నుంచి 12 పిస్తోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులు ఆయుధాలను తయారు చేసి పానిపట్, హర్యానాలోని సోనేపేట్‌లకు సరఫరా చేస్తుంటారని విచారణలో తేలిందని చెప్పారు.

వివాదంలో జైపూర్ మంత్రి

పూర్: రాజస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి కాళీచరణ్ సరఫ్ వివాదంలో చిక్కుకున్నారు. జైపూర్‌లో గోడపై ఆయన మూత్రవిసర్జన చేస్తున్న ఫొటో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. స్వచ్ఛభారత్ అభియాన్ కింద నగరాన్ని అత్యంత శుభ్రమైన నగరంగా గుర్తింపు తీసుకురావాలని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ కృషి చేస్తున్న నేపథ్యంలో ఆయన ఫొటో వివాదంగా మారింది. నిబంధనల ప్రకారం అక్కడ రహదారులపై మూత్రవిసర్జనకు రూ.200 జరిమానా విధిస్తారు. ఈ ఘటనపై కాళీచరణ్‌ను మీడియా స్పందన కోరగా, ఆయన స్పందించడానికి నిరాకరించారు. ఇది అంత పెద్ద విషయం కాదు, దీనిపై ఏం మాట్లాడాలనుకోవట్లేదని అన్నారు. ఈ వివాదంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తోంది. స్వచ్ఛభారత్ కోసం చాలా నిధులు ఖర్చు పెడుతున్నారు. కానీ మంత్రి ఇలాంటి పని చేయడం వల్ల ప్రజలకు తప్పుడు సందేశం వెళుతుందని రాజస్థాన్ కాంగ్రెస్ పార్టీ విభాగం ఉపాధ్యక్షురాలు విమర్శించారు.

'మహామస్తకాభిషేకం' ఛాయాచిత్రకారుడిగా శ్రీనివాసరెడ్డి



విశాలాంధ్ర - విజయవాడ : ప్రముఖ జైన క్షేత్రం, కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే గోమటేశ్వర మహామస్తకాభిషేకం వేడుక చిత్రీకరణకు విజయవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ టి. శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 2973 మంది ఫొటోగ్రాఫర్లు దరఖాస్తు చేసుకోగా అతి కొద్దిమందికి కమిటీ అవకాశం కల్పించింది. శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలను తిలకించేందుకు ప్రపంచ నలుమూలల నుంచి లక్షలాదిమంది వస్తారు. మీడియా కవరేజ్ కోసం ప్రపంచవ్యాప్త మీడియా సంస్థలు ఇప్పటికే శ్రావణబెళగొళకు చేరుకున్నాయి. 1993, 2006 సంవత్సరాల్లో వేడుక చిత్రీకరణలో శ్రీనివాసరెడ్డి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. మహామస్తకాభిషేకం వేడుకలను చిత్రీకరించేందుకు తనను ఎంపిక చేసినందుకు శ్రీనివాసరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

మిర్చి యార్డులో బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ అధికారులు



విశాలాంధ్ర - గుంటూరు జిల్లాపరిషత్ : గుంటూరు మిర్చి యార్డును గురువారం బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ అధికారులు చెర్రి, ఫ్రాన్సిస్, జానెఫ్యామ్, బిబిసి అధికారులు సందర్శించారు. యార్డులో లావాదేవీలు, కొనుగోళ్ళు, అమ్మకాలతోపాటు ఇతర అంశాలపై అధ్యయనం చేశారు. యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావుతో సమావేశమయ్యారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గుంటూరు మిర్చి యార్డులో సుమారు 100 బిలియన్ డాలర్ల మిర్చి వ్యాపార లావాదేవీలు జరుగుతున్నట్లు సుబ్బారావు ప్రతినిధులకు వివరించారు. 15 రకాల పంట వస్తుందని, 12 దేశాలకు మిర్చి ఎగుమతి అవుతుందని, 125 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందని చెప్పారు. బి.బి.సి అధికారిణి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గుంటూరు మిర్చి యార్డు సందర్శన కొత్త అనుభూతిని కలిగించిందన్నారు. ఐటీసీ మేనేజర్ భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రయాంక, ప్రసన్నబాబు, యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి ఇస్మాయిల్ పాల్గొన్నారు.

భారత్ అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డికి ఘనసన్మానం



విశాలాంధ్ర - విజయపురిసౌత్ : అంధుల క్రికెట్ ప్రపంచ కప్ విజేత భారత జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డిని లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు ఆధ్వర్యంలో గురువారం గుంటూరు జిల్లా విజయపురిసౌత్‌లోని న్యూటన్స్ కళాశాలలో ఘనంగా సత్కరించారు. అంధుల క్రికెట్ జట్టు మూడు పర్యాయాలు ప్రపంచ కప్‌ను సాధించి దేశానికి పేరు తీసుకొచ్చిన అజయ్ కుమార్‌రెడ్డి నేటి యువతకు ఆదర్శనీయుడని వక్తలు కొనియాడారు. శారీరక లోపాన్ని అధిగమించి రాణించటం గొప్ప విశేషమన్నారు. మాచర్ల అర్బన్ సీఐ సాంబశివరావు, ఏపీఆర్జేసీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.అంజిరెడ్డి, న్యూటన్స్ కళాశాల కరస్పాండెంట్ జన్నా శ్రీనివాసరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్యక్ష కార్యదర్శులు ఒరుగంటి చెన్నకేశవరావు, జబీవుల్లా, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో భూ కబ్జాల నివారణ కమిటీ

విశాలాంధ్ర - విజయవాడ : తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల భూకబ్జాల పర్వంతో అల్లాడిపోతున్న విజయవాడ నగరాన్ని కాపాడుకునేందుకు రాజకీయాలకతీతంగా ఐక్య ఉద్యమం కొనసాగించాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు భూకబ్జాల నివారణ కమిటీ ఏర్పాటు చేశారు. సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో సభ్యులుగా మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు, అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాస్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ బండి నాగేంద్రపుణ్యశీల, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసకుమార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ ఎస్‌పి గ్రెటస్, ఆమ్ ఆద్మీ నాయకుడు పోతిన వెంకటరామారావు, జనసేన రాష్ట్ర నాయకుడు మహేష్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వర రావు, ఇఫ్టూ నాయకుడు మహబూబ్ ఆజాం, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జనయ్య, న్యాయ వాదులు రమేంద్రరెడ్డి, జయమ్మ, అశోక్‌కుమార్ ఉంటారు. భూ కబ్జాలను నిరోధించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన డీజీపీ, కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేయాలని తీర్మానించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్
రాజమహేంద్రవరం

Ref. B1/31/2018. ఫారం నెం.VI (ఎ) Dt. 15-02-2018

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుచున్న గిరిజన రైతులకు పునరావాసం, పునరుపాధి కల్పనలో భూమికి బదులు భూమి పథకములో భూమిని కేటాయించు నిమిత్తం అవసరం అయినట్లు ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసం, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 15 ఉప విభాగములో నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీ చేయబడినది.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం @ రంపచోడవరం వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం @ రంపచోడవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యంతరాలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : తూర్పు గోదావరి | మండలం: దేవీపట్నం | గ్రామం: ఇందుకూరు (బిట్-7)

క్రమ సంఖ్య	స.ని.నెం.	పట్టేదారు	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూసేకరణ విస్తీర్ణం య.సెంట్లు	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1				0.59	నాగం వీరభద్రం (తండ్రి) రాజులు					
2	396/1	ప్రభుత్వ పుంజ	1.75	0.58	నాగం ఆదినారాయణ (తండ్రి) రాజు	394	399	396/2	400	దుంపతోట
3				0.58	నాగం వర్ధరాజు (తండ్రి) రాజు					
4	422/2	ప్రభుత్వ పుంజ	2.07	2.07	చల్లాబత్తుల సూర్యనారాయణ (తండ్రి) వెంకటరావు	422/1	422/3	342, 421	423	మామిడి జీడిమామిడి, టేకు
5	422/3	ప్రభుత్వ పుంజ	4.69	4.69	చల్లాబత్తుల వెంకటరావు (తండ్రి) సూర్యనారాయణమూర్తి	422/2	422/4, 5	421	423, 422/4	మామిడి
6	424/6	ప్రభుత్వ పుంజ	0.45	0.45	రేలంగి వెంకటనారాయణ (తండ్రి) వెంకటరావు	424/5	424/7	424/7	ఇందుకూరు పొలిమేర	వరి
7	424/8	ప్రభుత్వ పుంజ	0.54	0.54	అనకాపల్లి తాతారావు (తండ్రి) బంగారయ్య	424/7	423	424/9	ఇందుకూరు పొలిమేర	జీడిమామిడి తోట
8	427/2	ప్రభుత్వ పుంజ	2.86	2.86	చల్లాబత్తుల బూరయ్య (తండ్రి) సూర్యనారాయణమూర్తి	427/1	427/3, 4	420	427/3	మామిడితోట
			మొత్తం	12.36						

సం/- సి. హెచ్. భానుప్రసాద్, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్
రాజమహేంద్రవరం

Ref. B1/463/2017. ఫారం నెం.VI (ఎ) Dt. 14-02-2018

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరిధిని భూములను మరియు వాటి విస్తీర్ణములను ప్రజాప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణము కొరకు వి.ఆర్.పురం మండలం, ఇసుకూరు గ్రామములోని భూమిని భూసేకరణ చేయబడవలెను భూమిని కోల్పోయి నిర్వాసితులుగా అవుచున్న గిరిజన రైతులకు పునరావాసం, పునరుపాధి కల్పనలో (పునరావాస కాలనీ మరియు భూమికి బదులు భూమి) భూమిని కేటాయించుట నిమిత్తం అవసరం అయినట్లు ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భూసేకరణ చట్టం నందలి 2013వ సంవత్సరము, 30వ చట్టములోని 15వ విభాగమునననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజాప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2017-18కు సమకూర్చినారు. ఆ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టములోని 19(1) విభాగమునననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీ ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగమునననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం 19.56 సెంట్లను ప్రజాప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ముంపునకు గురయ్యే భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుచున్న గిరిజన రైతులకు పునరావాస పునరుపాధి కల్పనలో (పునరావాస కాలనీ మరియు భూమికి బదులు భూమి) కొరకు అవసరమైయున్నదని ఇందుమూలముగా ప్రకటన చేయుచున్నాము.

షెడ్యూలు

జిల్లా : తూర్పు గోదావరి | మండలం : ఎటపాక | గ్రామం: నల్లకుంట

క్రమ సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణం	భూసేకరణలో ఉన్న విస్తీర్ణం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు
1	2	3	4	5	6	7	8	9	10
1	28/1	1.23	1.23	మల్ల సత్యనారాయణ తండ్రి వెంకటేశ్వరరావు	సర్వే నెం. 13	సర్వే నెం. 28/2	సర్వే నెం. 28/2	సర్వే నెం. 13	---
2	28/2	3.83	3.83	గుజ్జుల మంగతాయారు	సర్వే నెం. 13	సర్వే నెం. 28/4	సర్వే నెం. 13	సర్వే నెం. 13, 28/1	---
3	28/4	2.80	2.80	గుజ్జుల మంగతాయారు	సర్వే నెం. 28/2	సర్వే నెం. 27, 29	సర్వే నెం. 13, 27	సర్వే నెం. 28/3	---
4	43/1	3.05	3.05	గుజ్జుల వెంకటనారాయణ	సర్వే నెం. 42	సర్వే నెం. 44	సర్వే నెం. 43/2	కిస్టాపురం (గ్రామం) రాజుపేట	---
5	43/2	3.65	3.65	గుజ్జుల వెంకటనారాయణ	సర్వే నెం. 42, 41	సర్వే నెం. 44, 45	సర్వే నెం. 48	సర్వే నెం. 43/1	---
6	45/1	5.00	5.00	ముద్దు కృష్ణ తండ్రి సత్యం	సర్వే నెం. 43, 48	సర్వే నెం. 45/4, 2.46	సర్వే నెం. 47	సర్వే నెం. 44	---
మొత్తం విస్తీర్ణం		19.56	19.56						

ఈ భూముల వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు మరియు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు లేవు.

ఈ భూముల ప్లాను శ్రీ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్, చింతూరు వారి కార్యాలయము నందు ఉంచబడినది. దానిని ఈ కార్యాలయము పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును.

బొగ్గుగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వటానికి తొలగించుటకు వేయబడెను.

సం/- సి. హెచ్. భానుప్రసాద్, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

నున్నలో కల్తీనెయ్యి రవాణాపై పోలీసుల దాడులు



విశాలాంధ్ర - విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్నలోని కల్తీ నెయ్యి రవాణా కేంద్రంలో గురువారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. చిన్ని కృష్ణ, నందిని, లక్ష్మి బ్రాండ్ పేర్లతో ప్రైవేటు ట్రాన్స్‌పోర్టర్ల ద్వారా రాష్ట్ర నలుమూలలకు సరఫరా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు చేశారు. నున్నలోని నవత ట్రాన్స్‌పోర్ట్ కేంద్రంలో రూ. 6 లక్షల విలువైన 60 బాక్సుల లక్ష్మి, నందిని, చిన్నికృష్ణ కల్తీ నెయ్యి బాక్సులను పోలీసులు గుర్తించారు. నున్న సమీపంలోని సూరంపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్స్‌లోని ఓ సంస్థ తయారుచేస్తూ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టుకు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నెయ్యి ప్యాకెట్లు సేకరించిన అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్ర రావు ల్యాబ్‌కు పంపనున్నట్లు వివరించారు. దాడుల్లో నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు శివప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, దాస్‌తోపాటు పోలీసులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో వైల్డ్‌లైఫ్ బీట్ ఫీల్డ్ ఆఫీసర్

విశాలాంధ్ర - ఏలూరు : కొల్లేరులో చేపలు పట్టుకునే వ్యక్తి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటూ గురువారం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వైల్డ్ లైఫ్ బీట్ ఫీల్డ్ ఆఫీసర్ కె. శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ గోపాలకృష్ణ కథనం ప్రకారం.. ఏలూరులోని వన్యప్రాణి సంరక్షణ విభాగంలో శ్రీకాంత్ గస్తీ అధికారిగా పని చేస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ బద్ధంగా చేపలు పట్టుకుంటున్న వారిని లంచాల కోసం ఆయన పీడిస్తున్నారు. నెలవారీ మామూళ్ళు ఇవ్వకపోతే నిషిద్ధ కొల్లేరు ప్రాంతంలో ఆక్రమంగా చేపల సాగు చేస్తున్నారని కేసులు బనాయిస్తానని బెదిరిస్తున్నారు. చేపలు పట్టుకునే దెందులూరు మండలం దోసపాడు గ్రామానికి ఎం. వెంకటేశ్వరరావును రూ.50 వేలు ఇవ్వాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని శ్రీకాంత్‌ను వెంకటేశ్వరరావు బతిమాలారు. చివరకు రూ.30 వేలు ఇచ్చేందుకు బేరం కుదుర్చుకున్న వెంకటేశ్వరరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం స్థానిక విజయా మెస్ వద్ద వెంకటేశ్వరరావు నుంచి 30 వేల రూపాయలు తీసుకుంటుండగా శ్రీకాంత్‌ను అరెస్టు చేశారు. శ్రీకాంత్‌ను శుక్రవారం విజయవాడ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ గోపాలకృష్ణ తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు విల్సన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందు బిళ్ల గొంతులో అడ్డుపడి బాలుడు మృతి



విశాలాంధ్ర - బెల్లంకొండ : జ్వరం తగ్గడం కోసం అద్దుపడి సారాబాలు (3) గొంతులో వేసిన మందు బిళ్ల అడ్డుపడి ఊపిరి ఆడక మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలంలోని కండిపాడు గ్రామంలో గురువారం జరిగింది. రెండు రోజుల నుంచి సారాబాలు జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ప్రైవేటు వైద్యుని ఇద్దకు తీసుకెళ్లడంతో పరీక్షించి మందులు ఇచ్చాడు. మాత్ర గొంతులో వేయటంతో ఇరుక్కుపోయింది. ఎంత యత్నించినా ఫలితం లేకపోయింది. లోపలకు వెళ్లకపోవటంతో ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్
రాజమహేంద్రవరం

Ref. B1/30/2018. ఫారం నెం.VI (ఎ) Dt. 15-02-2018

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం శరభవరం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుచున్న గిరిజన రైతులకు పునరావాసం, పునరుపాధి కల్పనలో భూమికి బదులు భూమి పథకములో భూమిని కేటాయించు నిమిత్తం అవసరం అయినట్లు స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసం, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 15 ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీ చేయబడినది.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం @ రంపచోడవరం వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం @ రంపచోడవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యంతరాలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : తూర్పు గోదావరి | మండలం: దేవీపట్నం | గ్రామం: శరభవరం (బిట్-5)

క్రమ సంఖ్య	స.ని.నెం.	పట్టేదారు	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూసేకరణ విస్తీర్ణం య.సెంట్లు	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరములు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	203	రైతు పుంజ	6.28	3.14	ముక్కా సత్యనారాయణ (తండ్రి) పెంటయ్య	202	191 195	200	204	జీడిమామిడి
2				3.14	ముక్కా పోతయ్య (తండ్రి) వెంకటరావు					
3	228/4	రైతు పుంజ	2.92	2.92	పేరాబు చంద్రయ్య (తండ్రి) గోవిందరాజు	228/1	230	230	228/2, 3	మామిడి జీడిమామిడి
4	232/1	రైతు పుంజ	2.30	2.30	అనకాపల్లి తాతారావు (తండ్రి) బంగారయ్య	235	201	232/2	231	మామిడి జీడిమామిడి
5	269/2	రైతు పుంజ	1.58	1.58	తంటపుడిచెడ్డి దర్మరాజు (తండ్రి) కొండన్న	269/1	269/3	ఇదివరకు సేకరణ	270	మొక్కజొన్న
6	273/1	రైతు పుంజ	0.21	0.21	తంటపుడిచెడ్డి దర్మరాజు (తండ్రి) కొండన్న	273/2	273/4	273/2	271/272	మొక్కజొన్న
7	278/3	రైతు పుంజ	1.55	1.55	తంటపుడిచెడ్డి అప్పాయమ్మ (భర్త) లకుడు	269	273/4	ఇదివరకు సేకరణ	273/2	మొక్కజొన్న
8	286/1బి	రైతు పుంజ	3.36	3.36	పోతల లక్ష్మణప్రవీణ్ ప్రసాద్ (తండ్రి) కొండలరావు	286/1ఎ	289	286/2	285	మామిడి జీడిమామిడి
9	252/4	రైతు పుంజ	0.47	0.47	పోతుల రాంబాబు (తండ్రి) రాములు	254	252/3	252/5		వరి
10	252/6	రైతు నంజ	0.94	0.94	పోతుల రాంబాబు (తండ్రి) రాములు	254	258	207, 258	252/5	వరి
11	253/1	రైతు నంజ	3.56	2.66	ముక్కా బాబురావు (తండ్రి) పెంటయ్య, ముక్కా సత్యనారాయణ (తండ్రి) పెంటయ్య	253/2	253/4బి	253/1		వరి
12	307/1	రైతు పుంజ	1.68	1.68	పదమటి లక్ష్మీనారాయణ (భర్త) కొండయ్య	306	307/2	308	305	వరి
			మొత్తం	23.95						

సం/- సి. హెచ్. భానుప్రసాద్, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్
రాజమహేంద్రవరం

Ref. B1/17/2018. ఫారం నెం.VI (ఎ) Dt. 14-02-2018

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన తూర్పు గోదావరి జిల్లా ఎటపాక మండలం చినవల్లకుంట గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ముంపులో భూమిని కోల్పోయిన కొత్తూరు, శ్రీరామగిరి మరియు సీతాపేట గ్రామస్థులకు పునరావాస కాలనీ నిర్మాణం మరియు భూమికి బదులు భూమి పునరావాస నిమిత్తం అవసరమైనట్లు శ్రీ ప్రత్యేక కలెక్టరు, (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాసం, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 15 ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీ చేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వశాఖ లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేదీ : 25-10-2005 ద్వారా జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43(1) క్రింద శ్రీ ప్రాజెక్టు అధికారి, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, రంపచోడవరం, తూర్పుగోదావరి జిల్లా, వారికి భూమి కోల్పోయే కుటుంబములకు పునరావాసం, పునరుపాధి కల్పనకు నిర్వాహకులుగా నియమించుచూ ప్రభుత్వ జి.ఓ. ఆర్.టి.నెం.32, ఇరిగేషన్ & సి.ఎ.డి (పిఎమ్యూ ఆర్ & ఆర్ ఎ-2) డిపార్టుమెంటు, తేది : 24-01-2014 ఉత్తర్వులు జారీ చేయబడినవి.

శ్రీ ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్, చింతూరు వారికి, వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా శ్రీ ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు, (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్, చింతూరు వారి ఎదుట అభ్యంతరాలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : తూర్పు గోదావరి | మండలం : ఎటపాక | గ్రామం: చినవల్లకుంట

క్రమ సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణం	భూసేకరణలో ఉన్న విస్తీర్ణం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరములు
1	2	3	4	5	6	7	8	9	10
1	24/2	1.28	1.28	ఏలూరి రంగయ్య తండ్రి నర్సయ్య	సర్వే నెం. 24/1	సర్వే నెం. 25	సర్వే నెం. 33	సర్వే నెం. 21, 26	---
2	25/2 ఇ	0.73	0.73	ఏలూరి నరసింహారావు తండ్రి రామచంద్రయ్య	సర్వే నెం. 25/1	సర్వే నెం. 25/3	సర్వే నెం. 33	సర్వే నెం. 26, 29, 30	---
3	25/2 ఇ	0.72	0.72	ఏలూరి వెంకటేశ్వరరావు తండ్రి రామచంద్రయ్య	సర్వే నెం. 25/1	సర్వే నెం. 25/3	సర్వే నెం. 33	సర్వే నెం. 26, 29, 30	---
4	36/1	0.75	0.75	నలజాల లక్ష్మయ్య తండ్రి అప్పయ్య	సర్వే నెం. 33	సర్వే నెం. 36/3, 33	సర్వే నెం. 36/1, 33	సర్వే నెం. 33	---
5	36/3	0.50	0.50	నలజాల లక్ష్మయ్య తండ్రి అప్పయ్య	సర్వే నెం. 36/1	సర్వే నెం. 36/4	సర్వే నెం. 36/1, 33	సర్వే నెం. 33	---
6	36/4	0.95	0.95	నలజాల లక్ష్మయ్య తండ్రి అప్పయ్య	సర్వే నెం. 36/3	సర్వే నెం. 37	సర్వే నెం. 33	సర్వే నెం. 33	---
7	48/3	0.50	0.50	ఏలూరి రంగయ్య తండ్రి నర్సయ్య	సర్వే నెం. 48/2	సర్వే నెం. 49	సర్వే నెం. 48/4	సర్వే నెం. 48/1	---
8	49/2	0.95	0.95	ఏలూరి రంగయ్య తండ్రి నర్సయ్య	సర్వే నెం. 49/1	[illegible]	సర్వే నెం. 49/3	సర్వే నెం. 50	---
9	49/3 ఇ	0.10	0.10	ఏలూరి రంగయ్య తండ్రి నర్సయ్య	సర్వే నెం. 47	[illegible] (గ్రామం)	సర్వే నెం. 33	సర్వే నెం. 49/1, 2	---
మొత్తం విస్తీర్ణం		6.48	6.48						

సం/- సి. హెచ్. భానుప్రసాద్, స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్నారని

ఎక్సైజ్ పోలీసులపై మెరుపు దాడి

కర్రలు, రాళ్ళతో తెగబడిన గిరిజనులు

విశాలాంధ్ర- చింతపల్లి : గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్నారన్న కక్షతో ఎక్సైజ్ పోలీసులపై పథకం ప్రకారం గిరిజనులు కర్రలు, రాళ్లతో మెరుపుదాడికి పాల్పడిన ఘటన విశాఖ జిల్లా చింతపల్లి మండలంలోని పెదబరద పంచాయతీ రవ్వగెడ్డలో గురువారం కలకలం రేపింది. ఈ ఘటనలో ఎనిమిది మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ జగదీశ్వరరావు కథనం ప్రకారం.. కొంతకాలంగా గంజాయి సాగు నిర్మూలన కోసం ఎక్సైజ్, రెవెన్యూ, అటవీశాఖ, పోలీసుల శాఖల సహకారంతో విశాఖపట్నానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి దాడులు చేస్తున్నాం. రవ్వగెడ్డ గ్రామంలో గిరిజనులు గంజాయి తోటలు సాగుచేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వాటిని ధ్వంసం చేసేందుకు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన ఎనిమిది మంది సిబ్బందితో కూడిన బృందం వెళ్ళింది. ఎక్సైజ్ పోలీసులు దాడులకు వస్తున్నారన్న విషయం ముందుగానే తెలుసుకున్న 70 మంది గిరిజనులు పథకం ప్రకారం మాపై దాడికి తెగబడ్డారు. తోటలకు సమీపంలో కాపు కాసి ఒక్కసారిగా కర్రలు, రాళ్లతో దాడిచేశారు. గిరిజనులు మూకుమ్మడిగా విరుచుకుపడటంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం పరుగులు తీశారు. కొందరు పోలీసులు ప్రాణాపాయ స్థితిలో సొమ్మసిల్లిపడి నటించి ఘటనా స్థలంలోనే ఉండిపోయారు. దాడికి పాల్పడిన గిరిజనులు కొద్దిసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. తరువాత ఎస్‌ఐ జగదీశ్వరరావుతోపాటు మిగిలిన పోలీసులు అక్కడి నుంచి తప్పించుకొని చింతపల్లి చేరుకున్నారు. గాయపడిన పోలీసులకు చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు రఘురాం, సువర్ణ ప్రాథమిక చికిత్స చేశారు.

18న ఎస్టీయూ 'టెట్' నమూనా పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ ఏపీ) ఆధ్వర్యాన ఈ నెల 18వ తేదీ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పేపర్-1 నమూనా పరీక్షను నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు హాజరయ్యే అభ్యర్థుల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా నమూనా పరీక్షను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి కేంద్రంలో మొదటి మూడు ర్యాంకులు పొందిన వారికి బహుమతులు అందజేస్తామని, గంటలోపే ఫలితాలు ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. టెట్ పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం అభ్యర్థులను గందరగోళంలోకి నెట్టిందని తెలిపారు.రాష్ట్రేతర కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడితే ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి వుందా? అని ప్రశ్నించారు. అభ్యర్థులు కోరుకున్న జిల్లాల్లోనే టెట్ పరీక్షా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

జగన్‌కు జ్ఞానోదయం కావాలి : వర్లరామయ్య

విశాలాంధ్ర అమరావతి: రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ముందుకు వెళ్తుందని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్లరామయ్య అన్నారు. సమన్వయ కమిటీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షం స్వార్థ పూరిత రాజకీయలతో రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని జగన్ పై మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీ ఎంతటి త్యాగానికైనా సిద్ధమని అన్నారు .కేంద్రం ప్రకటించింది స్పెషల్ అసిస్టేషన్స్ మేజర్ అని దీనిపై అవగాహన లేని జగన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. స్టేటస్ కి సమానంగా ప్యాకేజి ఇస్తామన్నారని ఆ రోజు ఒప్పుకున్నామని అన్నారు. జగన్ తెలివితేటలతో ఎంపిలతో రాజీనామాలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇపుడు రాజీనామా చేస్తే సెక్షన్ 151 ప్రకారం ఎన్నికలు రావని చెప్పారు.ఇదే జగన్ ఎత్తుగడ అని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ జేఏసీ పేరిట కాంగ్రెస్‌ను ఆహ్వానించటాన్ని తప్పుపట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతకైనా తెలుగుదేశం సిద్ధంగా ఉంటుందని అన్నారు. జగన్‌కి కనువిప్పు కావాలని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పళ్ళా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మరిన్ని పరిశ్రమలు రాబట్టాలి : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా సత్వ రం అనుమతులు ఇస్తున్న విధానాన్ని, మౌలిక వసతులు కల్పిస్తున్న తీరును ప్రపంచానికి తెలిసేలా విశాఖ భాగస్వామ్య సదస్సును సద్వినియోగం చేసుకొని రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు రాబట్టాలని సీఎం చంద్ర బాబు అధికారులకు సూచించారు. కియా కార్లు నుంచి ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్లు వరకు రాష్ట్రంలో తయారవుతున్న వివిధ ఉత్పత్తులను ఈ సారి సదస్సులో ప్రదర్శించాలని చెప్పారు. ఈ 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు విశాఖలో నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై గురువారం సచివాలయంలోని ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్మార్ట్ పవర్ గ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, డిజరప్టివ్ టెక్నాలజీ, సోలార్ స్టోరేజ్ రంగాలకు చెందిన వారిని సదస్సులో భాగస్వాముల్ని చేయాలని నిర్దేశించారు. మన వంటలను, ఆహార పదార్థాలను, అరకు కాఫీని ప్రమోట్ చేసుకోవాల్సిన సమయం ఇదేనని స్పష్టం చేశారు. సదస్సుకు విచ్చేసే అతిథులకు నేచురల్ ఫార్మింగ్ ఫుడ్ అందించడం ద్వారా రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని చెప్పారు. 'పెట్టుబడి లేని సహజ వ్యవసాయం' గురించే దావోస్‌లో అంతా మాట్లాడారని, విశాఖ భాగస్వామ్య సదస్సు గురించి అలానే చెప్పుకోవాలని అన్నారు. మన కూచిపూడి నృత్యంతో ఆహుతులను ఆకట్టుకోవాలని చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారం భం కానుంది. మొత్తం జరిగే తొమ్మిది ప్లీనరీ సెషన్లకు కేంద్రమంత్రులు సురేష్ ప్రభు, ఎంజె అక్బర్, నితిన్ గడ్కరీ, అశోక్ గజపతిరాజు, వైఎస్ చౌదరి, ధర్మేంద్ర ప్రదాన్, హర్షవర్ధన్, రవి శంకర్ ప్రసాద్, విజయ్ గోఖలే, మనోజ్ సిన్హా, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అజయ్ కుమార్, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ ఖాన్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ హాజరుకానున్నారు. అలాగే బంగ్లాదేశ్, కెనడా, జపాన్, జోర్డాన్, మయన్మార్, మారిషస్, మొరాకో, సింగపూర్, శ్రీలంక, టాంజానియా, థాయిల్యాండ్, యూఏఈ, జాంబియా దేశా లకు చెందిన మంత్రులు పాల్గొంటారు. 36 దేశా లకు చెందిన పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులు సద స్సుకు హాజరవుతారని సీఎంకి అధికారులు వివరించారు. ఈ సెషన్‌లో మంత్రి నారా లోకేష్ ప్రారంభోపన్యాసం చేస్తారు. చివరి రోజు కార్యక్రమానికి సింగపూర్ మంత్రి ఎస్ ఈశ్వరన్, యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు బారోనెస్ సందీప్ వర్మ అతిథిగా రానున్నారు. అదే రోజు జరిగే స్పెషల్ ప్లీనరీలో ప్యానలిస్టుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్ పాల్గొంటారు. ఈసారి సెషన్ల నిర్వహణకు మొత్తం మూడు హాళ్లు సిద్ధం చేస్తుండగా, ఇందుకు సంబంధించి ఆకృతులను సీఎం పరిశీలించారు.

సెల్‌ఫోన్ లైట్ వెలుగులో శస్త్రచికిత్స

- గుంటూరు జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం
- ఆసుపత్రి ఎదుట వైసీపీ ధర్నా
- నేడు మంత్రి కామినేని తనిఖీలు



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిలువెల్లా నిర్లక్ష్యం తాండవిస్తుంది. ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు పనిచేయకపోవడంతో సెల్‌ఫోన్ లైట్‌తో శస్త్రచికిత్స చేసిన ఘటన తీవ్ర సంచలనం రేకిస్తుంది. సెల్‌ఫోన్ లైట్‌పై శస్త్రచికిత్సలు చేయడం ఏమిటని వైసీపీ నాయకులు కార్యకర్తలు గురువారం ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రవైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తనిఖీలు చేసేందుకు ఆసుపత్రికి వస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.... ఈనెల 10వతేదీన పల్నాడు ప్రాంతానికి చెందిన వెంకమ్మకు రోడ్డు ప్రమాదంలో తలకు గాయం అయ్యింది. ఎస్‌ఓటీలో ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఆపరేషన్ మధ్యలో ఓటీ లైట్లు ఆరిపోయాయి. దీంతో వైద్యులు సెల్‌ఫోన్‌లైట్ల మధ్య ఆపరేషన్ పూర్తిచేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్‌ఓటీలో తరచూ జరుగుతున్న ఇలాంటి సంఘటనలు రోగులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

అయితే శస్త్రచికిత్స చేసేటప్పుడు ఓటీలైట్లు ఆరిపోకుండా వైద్యులు ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఎం.జోషిబాబుకు ఈనెల 12వతేదీన ఒక ప్రమాదంలో కుడిచేయి నుజ్జు అయ్యింది. దీంతో కుటుంబసభ్యులు అతన్ని గుం టూరు ప్రభుత్వసుపత్రికి తరలించారు. చేతివేళ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఇటీవల సర్జికల్ ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్స చేసేందుకు వైద్యులు సిద్ధమైనారు. అయితే ఆపరేషన్ మధ్యలో ఉండగా హ్యాండ్‌డ్రిల్ మిషన్ పనిచేయ లేదు. దీంతో అతన్ని ఆర్థోపెడిక్ విభాగంలో ఆపరేషన్ థియేటర్‌కు తరలించి శస్త్ర చికిత్స చేశారు. ఇలా ఏదొక అంతరాయం వచ్చి ఆపరేషన్ చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది.



ఆపరేషన్లకు ఇబ్బందులు

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ఎస్‌ఓటీలలో ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు ఆసుపత్రి అధికారులకు లిఖితపూర్వకంగా తెలియపర్చి ఆపరేషన్లు నిలుపుదల చేశారు. గతంలో మూడు పర్యాయాలు ఆపరేష న్లు నిలిపేయడంతో అధికారులు మరమ్మ తుల కోసం రూ. 20లక్షలు మంజూరు చేశారు. మరమ్మతులు పూర్తి అయినా సరిపడే వైద్య పరికరాలు లేకపోవడంతో ఇటీవల శస్త్రచికిత్స నిలిచి పోయింది. అలాగే న్యూరోసర్జరీ విభాగంలో రోగుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారికి తగిన ట్లుగా ఆపరేషన్ థియేటర్లు లేకపోవడంతో ఆపరేషన్లు వాయిదా పడుతున్నాయి. ఆర్థోపెడిక్ వైద్యవిభాగానికి ప్రత్యేకంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు థియేటర్ లేకపోవడం వలన ఏడాదిపాటు ఆపరేషన్లు నిలిచి పోయాయి. ఇలా ఆసుపత్రి పరిస్థితి అధ్వాన్నంగా ఉంది.

ఆపరేషన్ థియేటర్లపై శీతకన్ను

గుంటూరు జీజీహెచ్ రాష్ట్రంలోనే అతిపెద్ద ఆసుపత్రి. ఐదు జిల్లాల ప్రజల ఆరోగ్య సంజీవని, రాష్ట్ర ప్రజలకు రిఫరల్ ఆసుపత్రి. 3,500 ఓపీ, సుమారు 600 మంది ఐపీ(ఇన్‌పేషెంట్) రోగులు వస్తుంటారు. దీనిలో పది ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. దీనిలో ఒకటి వాడుకలో లేదు. మిగిలిన తొమ్మిది థియేటర్లలో ఒకదాన్ని మూడునెలల క్రితం రీమోడలింగ్ చేశారు. కానీ నాలుగు ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇక్కడ కేవలం రెండులైట్లే అమర్చారు. ఇలా ఆపరేషన్ థియేటర్ల నిర్వాహణ అధ్వాన్నంగా ఉంది.

నేడు మంత్రి కామినేని తనిఖీలు

దీనిపై స్పందించిన మంత్రి కామినేని శ్రీనివాస్ శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో తనిఖీలు చేసేందుకు వస్తున్నారు. ఆపరేషన్ థియేటర్ల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

వైసీపీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ధర్నా

ఆపరేషన్ థియేటర్లలో సెల్‌ఫోన్ వెలుతురులో శస్త్రచికిత్సలు చేయడాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తాఫా తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట గురువారం ధర్నా చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజునాయుడు నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే ముస్తాఫా ఆరోపించారు. దీనికి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజునాయుడు

ఈనెల 10వతేదీన ఒకరికి ఆపరేషన్ చేస్తుండగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తర్వాత వెంటనే విద్యుత్ సరఫరా అందేవిధంగా చర్యలు తీసుకున్నాం. అయితే కొన్ని సాంకేతిక లోపాలు వలన ఆపరేషన్ చేస్తున్న టేబుల్ వద్దకు నాలుగునిమిషాలు ఆలస్యంగా విద్యుత్‌సరఫరా వచ్చింది. అయితే దీనివలన ఎలాంటి ఇబ్బంది ఏర్పడలేదు. సర్జరీ సజావుగా నిర్వహించారు.

తరిమికొడదాం.. (మొదటిపేజీ తరువాయి)

మతోన్మాద భావజాలానికి ప్రాతినిథ్యం వహిస్తోందనీ, ఇవి ఫాసిస్టు ధోరణులేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఫాసిస్టు ఎదురుదాడిని ప్రతిఘటించడంలో వామపక్షం పాత్ర కీలకంగా మారిందనీ, నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు రూపొందించడం ద్వారా ఈ ఫాసిస్టు ఎదురుదాడిని ఎదుర్కోవాలని సురవరం పిలుపునిచ్చారు. బలమైన వామపక్షం నిర్మించడం కీలకమైన ప్రశ్నగా ముందుకు వచ్చిందన్నారు. ప్రత్యామ్నాయ విధానాలతో నిరంతర ప్రజాపోరాటాలను నిర్వహించాలి. దానికిగాను లౌకికవాద, ప్రజాస్వామిక, వామపక్ష వేదికను సృష్టించడం ద్వారా విస్తృత ప్రజా సమీకరణను సుసాధ్యం చేయాలని సీపీఐ పిలుపునిస్తున్నదని ఆయన చెప్పారు. ఈ వేదిక ప్రాతిపదికగా రాజకీయ, భావజాల ఉద్యమాన్ని కొనసాగించాలి. ఇది కేవలం రాజకీయ పార్టీలకే పరిమితం కాదు. పౌరసంస్థలను, ప్రజాసంఘాలను అందరినీ కలుపుకోవాలి. ప్రజా సంఘాలు ఈ పోరాటంలో క్రియాశీల పాత్ర వహించాలి. వామపక్షాలు, ప్రజా సంఘాలు ప్రజా అనుకూల విధానాలను ప్రతిపాదిస్తూ, నిరంతరం పోరాటాలు కొనసాగించాలి. దీన్ని ఎన్నికల పోరాటానికి కుదించరాదు. ఎన్నికలు ప్రకటించినప్పుడు ఎన్నికల ఎత్తుగడలు రూపొందించుకునే స్వేచ్ఛ రాజకీయపార్టీలకు ఉంటుంది. ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటనను ఇక ఏ మాత్రం ఆలస్యం చేయరాదని సురవరం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక రాజకీయ పెత్తనం కోసం చేస్తున్న పెనుగులాటలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభానికి గురైందన్నారు. 2008 లో ప్రారంభమైన ఈ ఆర్థిక సంక్షోభం ఇప్పటికీ అనేక దేశాల్లో కొనసాగుతుందని ఆయన చెప్పారు. దీని వల్ల అనేక చోట్ల ఉత్పత్తి నిలిచిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. పెట్టుబడుదారులు మాత్రం ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి తమ లాభాలను మాత్రం ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ రకమైన సమస్యల వల్ల ఉత్పన్నమవుతున్న పరిష్కార మార్గాల బదులు మితవాదులు దీన్ని తమకు అవకాశం తీసుకుంటున్నారని వివరించారు. మితవాద శక్తులు ప్రపంచంలోని వివిధ దేశాల్లో గతం కంటే ఎక్కువ ప్రభావం చూపటం పట్ల తమ పార్టీ తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తుందని సురవరం పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రతిఘటనా ఉద్యమాలు కూడా లాటిన్ అమెరికాలో, ఇతర యూరోపియన్ దేశాల్లో పెరుగుతున్న విషయం వాస్తవమన్నారు. అయితే మితవాద ఫాసిస్ట్ అనుకూల శక్తులు మరింత వేగంగా పెరుగుతుండటం గమనించి దానికి వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సురవరం హెచ్చరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన స్కామ్‌ను సురవరం తీవ్రంగా ఖండించారు. ఇలాంటివి జరగకుండా ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ఇలాంటి జరిగినప్పుడు నిందితులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సురవరం డిమాండు చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నేత డి.రాజా, గురుదాస్‌గుప్తా, షమీమ్ ఫైజీ, డా.కె.నారాయణ, అతుల్‌కుమార్ అంజాన్‌లు పాల్గొన్నారు.

యథావిధిగానే టెట్ .. (మొదటిపేజీ తరువాయి)

వుండటం వల్లే ఇలా జరిగిందని వివరించారు. మొత్తం 4,46,833 మంది అభ్యర్థుల్లో ఇతర రాష్ట్రాల్లో సెంటర్లను కేటాయించిన అభ్యర్థులు 15,605 (3.5 శాతం) మంది ఉన్నారని వీరికి ఇప్పటికే ఆప్షన్ ఇచ్చే సదుపాయం కల్పించామని అధికారులు తెలిపారు. ఇప్పటికే 9,518 (61 శాతం) అభ్యర్థులు తిరిగి ఆప్షన్స్ ఇచ్చారని, మరో 6,087 మంది శుక్రవారం సాయంత్రానికి ఆప్షన్ ఇచ్చినట్లయితే వారికి కూడా మన రాష్ట్రంలోనే వారి ఆప్షన్స్ ప్రకారం సెంటర్లు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. ఆప్షన్స్ తిరిగి ఇచ్చిన అభ్యర్థులకు మార్చి 2న పరీక్ష నిర్వహిస్తారు. 805 మంది అభ్యర్థులకు వారు కోరిన ఆప్షన్స్ ప్రకారం కాకుండా వేరే పరీక్షా కేంద్రాలు కేటాయించడం జరిగింది. వీరికి కూడా తిరిగి ఆప్షన్ కోరుకునే అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఇక నుంచి ఎలాంటి సమస్య రానీయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో సెంటర్ల పర్యవేక్షణపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో అభ్యర్థులకు ఆన్ లైన్‌లో పరీక్ష నిర్వహిస్తుండటం ఇదే తొలిసారి, ఇది మంచి పరిణామని అయితే ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన అవసరం వుందన్నారు. సెంటర్లలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు వుండేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సెంటర్లలోని కంప్యూటర్లను, బ్యాకప్ పరిశీలించాలని, ట్రయల్ రన్ నిర్వహించాలని స్పష్టం చేశారు. దీనిపై నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు,సంబంధిత ఏజెన్సీల సంయుక్త పర్యవేక్షణలో తనిఖీలు వుంటాయని మంత్రి గంటా తెలిపారు.మొత్తం 4,46,833 పరీక్షకు దరఖాస్తు చేసుకుంటే 3,83, 204 (85.76శాతం) అభ్యర్థులు ఇప్పటివరకు హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకున్నారని తెలిపారు. మొత్తం పరీక్షా కేంద్రాలు 183 కాగా ఇందులో159 ఏపీలోనూ, మిగతా 24 కేంద్రాలు ఇతర రాష్ట్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో హైదరాబాద్ (7), బెంగళూరు (10),చెన్నై (7) ఉన్నాయన్నారు. సగటున రోజుకు 52 వేల మంది టెట్ పరీక్ష రాయనున్నారని, ప్రతి సెషన్‌కు 26 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని మంత్రి గంటా తెలిపారు. కమీషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లో ఇప్పటికే హెల్ప్ డెస్కులు నిర్వహిస్తున్నామని, వీటికి అదనంగా మరో రెండు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సందేహాలు వుంటే ఈ నెంబర్లను 9505619127, 9505780616, 9505853627, 9885604333, 9701376243లో సంప్రదించ వచ్చని మంత్రి గంటా తెలిపారు.



అందరం రాజీనామా చేద్దాం : జగన్

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదో చూద్దామని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తమ ఎంపీలందరూ రాజీనామా చేస్తారని, టీడీపీ ఎంపీలు కూడా కలిసివస్తే హోదా దానంతట అదే వస్తుందన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా కొండాపురం మండలంలోని రేణమాల వద్ద మహిళలతో ముఖాముఖి కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెందుర్తిలో దళిత మహిళ మీద టీడీపీ నేతలు దాడి చేయటం అమానుషమని, మహిళలపై దాడులు జరుగుతున్నా చంద్రబాబు చోద్యం చూశారు తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. మహిళా ఎమ్మార్వో వనజాక్షిపై దాడి జరిగినప్పుడే ఎమ్మెల్యేపై చర్యలు తీసుకుంటే పరిస్థితి దిగజారేది కాదన్నారు. మద్యం నుంచి పిల్లలను రక్షిస్తానని ఎన్నికల ప్రణాళికలో చంద్రబాబు చెప్పారని, అధికారంలోకి వచ్చాక ఆ సంగతే మరిచిపోయారని ధ్వజమెత్తారు. రైతులు సంతోషంగా లేరని,వారికి రుణమాఫీ చేస్తామని మోసం చేశారని, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను కూడా రుణమాఫీ పేరుతో బాబు మోసం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మహిళల ప్రభుత్వం.. ప్రతి పథకం మహిళలను ఉద్దేశించి ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మీ అప్పు మొత్తం ఎన్నికల నాటికి ఎంతైతే ఉంటే.. నాలుగు దఫాలుగా మీ చేతికే ఇస్తాం. ఆ డబ్బు బ్యాంకులకు ఇవ్వం. ఆ డబ్బు మీ చేతికే ఇస్తామన్నారు. ఇంజనీరింగ్ చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఫీజులు లక్ష దాటితే.. చంద్రబాబు మాత్రం రూ.35వేలు ముష్టివేసినట్లు ఇస్తున్నారని చాలా మంది విద్యార్థులు తనవద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రతి సంవత్సరం రూ.65-75 వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందని, మూడున్నర లక్షలు తెచ్చి అప్పులు చేయటం సాధ్యం కాదన్నారు. ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలంలో ఇళ్లు కట్టిస్తానని చంద్రబాబు కట్టిస్తామన్నారని, ఎక్కడా కూడా ఇళ్లు కట్టించలేదన్నారు. 2018లోనో, 2019లోనే ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికలు అయ్యాక తర్వాత జరిగే ఎన్నికల్లో మద్యాన్ని పూర్తిగా తీసేశాక మీ దగ్గరకి వచ్చి ఓట్లు అడుగుతామని చెప్పారు. మూడు దశల్లో మద్యనిషేధాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఆయన వెంట ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతమ్‌రెడ్డి, కాకాణి గోవర్థన్‌రెడ్డి, రోజా, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

రాజీనామాలకు రెడీగా ఉండండి

- రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- పవన్ పోరాటంలో అర్థముంది
- కాపులు ఆందోళన చెందొద్దు
- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు


విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్ర ప్రయోజనాల కోసం త్వరలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కేంద్ర వైఖరిలో మార్పురాని పక్షంలో రాజీనామాలు చేసేందుకు, కేంద్రమంత్రి పదవులు వదులుకునేందుకు ఎంపీలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం దగ్గర ఉన్న గ్రీవెన్స్ సెల్ భవనంలో గురువారం టీడీపీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు పార్టీ నేతల తో జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితులపై ఆరాతీశారు. పలువురు ముఖ్య నేతలు, మంత్రులు నేరుగా సమావేశంలో పాల్గొన్నారు. చంద్రబాబు తాజా రాజకీయాలు, ప్రతిపక్ష పార్టీ వ్యవహారశైలి, కేంద్రం అవలంబిస్తున్న వైఖరి, భవిష్యత్తు నిర్ణయాలు వంటి అంశాల మీద సమీక్షించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సానుకూలమైన చర్చలు నిర్వహించాలని సూచించారు. కేంద్రం సానుకూలంగా స్పందించని నేపథ్యంలో ప్రతిపక్షం కన్నా ముందే రాజీనామాలు చేయాలని ఇదే ప్రజలకు తెలియచేయాలని అన్నారు. 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్రం దిగి వస్తుందని అన్నారు. తెలుగుదేశం ఎంపీలు, ప్రత్యేక హోదా, రైల్వేజోన్ వంటి అంశాలపై చేస్తున్న పోరాటాన్ని విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఇతర రాష్ట్రాలకు ఇచ్చినట్లే కేటాయింపులు చేశారని తెలిపారు. టీడీపీ ఎంపీలు పార్లమెంటులో రాష్ట్ర సమస్యను దేశ స్థాయికి తీసుకెళ్లే విధంగా కృషి చేశారని కొనియాడారు. అయితే నోట్ల రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్న సమయంలో కేంద్రానికి అండగా నిలిచామన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి 28 సార్లు ఢిల్లీ వెళ్లానని వ్యాఖ్యానించారు. పదవులు ముఖ్యం కాదని, వాజ్‌పేయి హయాంలో తొమ్మిది కేంద్ర మంత్రి పదవులు ఇస్తామన్న సున్నితంగా తిరస్కరించామని అన్నారు. ప్రత్యేక హోదాకన్నా ఎక్కువ ప్రయోజనాలు ఇస్తామంటేనే ప్యాకేజీకి ఒప్పుకోవటం జరిగిందన్నారు. కేంద్రం స్పందిం చని పక్షంలో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. మిత్ర పక్షం ఆరోపణలను సున్నితంగా ఖండించాలన్నారు.

రాజీనామాలంటూ జగన్ కొత్త నాటకం: ప్రతిపక్ష వైసీపీపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించిన వైఎస్ జగన్ కేంద్రం మెప్పు కోసం ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తారని తెలియగానే మనకన్నా ముందుగా మద్దతు తెలియచేసి ఫొటోలు దిగారని అన్నారు. అడగకుండానే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించారు. మనం ఢిల్లీ ఎందుకు వెళ్లామో, జగన్ ఎందుకు ఢిల్లీ వెళ్ళాడో ప్రజలకి వివరించాలని సూచించారు. కేసుల మాఫీ కోసం జగన్ లాలూచీ పడుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. తాము కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, వస్తున్న విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్ట డంలో నాయకులు కొంత అలసత్వం వహిస్తు న్నారని చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. రాజధానిలో లక్షల కోట్ల అవినీతి అని కేసులు పెట్టినా అన్నీ వీగిపోయాయని, అది ప్రజలకు తెలుసని అన్నారు. జగన్ ఎంపీలతో రాజీనామాలు అంటూ మరో కొత్త నాటకానికి తెర తీశారని విమర్శించారు. విభజన హామీల్లో 19 అంశాలు ప్రధానమైనవని అన్నారు. కేంద్రం 27 పేజీల లేఖలు పెట్టిందే తప్ప లెక్కలు సక్రమంగా చూపటం లేదని అసహనం వెలిబుచ్చారు. అగ్రిగోల్డ్, గల్ఫ్ బాధితుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి వారిని పరామర్శించాలని చెప్పారు. పవన్ పోరాటంలో అర్థం ఉందని, ఆయన ఏర్పాటు చేసిన జేఏసీతో టీడీపీకి ఇబ్బంది లేదని అన్నారు. శ్వేతపత్రాల విషయంలో సున్నితంగా సమాధానం చెప్పాలని నేతలకి ఉద్బోధించారు. లెక్కలు చెప్పేందుకు తమకు అభ్యంతరం లేదని, అయితే శ్వేతపత్రం విడుదల చేయాల్సింది కేంద్రమని వ్యాఖ్యానించారు. అలాగే కాపు రిజర్వేషన్లపై కాపు నేతలతో మాట్లాడారు. డీఓపీటీ అభ్యంతరాలకు సమాధానం ఇస్తామన్నారు. 9వ షెడ్యూల్ సవ రించి రిజర్వేషన్లు కల్పించాలని కోరిన విషయాన్ని ఆయన తెలియజేశారు. కాపులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. పోలవరంపై ఒడిశా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరమని, సమస్యను అధిగ మిస్తామని చెప్పారు. పోలవరం పూర్తి చేయవలసిన బాధ్యత కేంద్రంపై ఉందని అన్నారు. అత్యంత సంపన్న ముఖ్యమంత్రి అన్న అంశంపై స్పందిస్తూ తన పేరుమీద భూములు లేవని, షేర్లన్నీ కుటుంబ సభ్యులకు ఇచ్చేశానని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో తప్పుపట్టాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం వైఖరిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావ్, మంత్రులు ఆది నారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, నారాయణ. లోకేష్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య, గొట్టిపాటి రామకృష్ణ, మాల్యాద్రి, వి.వి.చౌదరి, జనార్ధన్ పాల్గొన్నారు.

తేల్చకపోతే .. తెగదెంపులే..!

ప్రకంపనలు రేపుతున్న ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలు

విశాలాంధ్ర అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం హామీ ఇచ్చిన 19 అంశాలను నెరవేర్చకపోతే భాజపాతో తెగదెంపులు మంత్రి ఆదినారాయణ రెడ్డి చేసుకుంటామని అన్నారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా ఉంటే సరి అని.. లేకుంటే మార్చి 5న కేంద్రంలో ఉన్న తమ మంత్రులు కేబినెట్ నుంచి బయటకు వచ్చేస్తారని.. అదే రోజు ఎన్డీయేతో తెగతెంపులు ఉంటాయని స్పష్టం చేశారు. అతనికి తమకు పోలికే లేదన్నారు. మిత్ర పక్ష ధర్మంతో ఇప్పటి వరకు ఉన్నామని.. తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తామన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక ప్యాకేజి అంశాలు నెరవేరేలా కార్యాచరణ లేకపోవడంతో కేంద్రంలోని తమ మంత్రులు, ఎం.పిలు నిరసనలు తెలుపుతూ ఆందోళలు చేపట్టారు. రాష్ట్రంలోనూ తమ అసంతృప్తిని వ్యక్తం చేశాం. ప్రజల మనోభావాలను గుర్తించాం, నిరసనలు వ్యక్తం చేస్తున్నాం, రాష్ట్ర బంద్ ప్రభుత్వ సహకారంతో నిర్వహించామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయమై పోరాటం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నారని, రాష్ట్రాభివృద్ధి తమ ధ్యేయం అని ఈ లక్ష్య సాధనకు తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ప్రత్యేక హోదా సాధ్యం కాదని, దానికి ధీటుగా ప్రత్యేక ప్యాకేజి గా 19 అంశాలు రూపొందించామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గతంలో స్పష్టం చేశారని ఇప్పుడు తాము ఈ అంశాలపైనే పట్టుబడుతున్నామని చెప్పారు.వైసీపీ ఎంపీల రాజీనామాలపై రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డి స్పందించారు. జగన్ మాటలు మోసపూరితమని, తిక్కగా, నిలకడలేనితనంగా, జగన్నాటకాన్ని తలపిస్తున్నాయన్నారు. ఆయన రాజీనామా ప్రకటించడం ఇది రెండో సారన్నారు. అప్పుడు రాజీనామా చేస్తారని ప్రకటించిన జగన్.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్య నాయుడికి ఎందుకు మద్దతు ఇచ్చారన్నారు. ఊకదంపుడు ఉపన్యాసాలు జగన్ ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. జగన్ ఆలోచనలు పిచ్చోడి ప్రకటనలా ఉన్నాయని ఘాటుగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు కూడా మాయమాటలు చెపుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా రాదని కేంద్రం గత ఏడాదే స్పష్టం చేసింది. అప్పుడు కేంద్రమంత్రిగా ఉన్న ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నాలుగుచోట్ల హోదా కాదు, ప్రత్యేక ప్యాకేజి అని స్పష్టమైన ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయమై పదే పదే స్పష్టత ఇచ్చిందని అన్నారు. జగన్ ఇప్పుడు చెపుతున్నది ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఏప్రెల్ 6 తర్వాత ఆ పార్టీ ఎం.పిలు రాజీనామా చేస్తారని ప్రకటించడం హాస్యాస్పదం అని అన్నారు. హోదా అన్నది ముగిసిన అధ్యాయం అని అందరికీ తెలిసినా జగన్ ఇప్పుడు హోదా కోసం ఏప్రెల్లో రాజీనామా అని చెప్పడం ఆయన రాజకీయ అజ్ఞానికి నిదర్శనం అని పేర్కొన్నారు. గతంలో రాజీనామా అని ప్రకటించి మాట నిలుపుకోలేదని తెలిపారు. ఇప్పుడు ఏప్రెల్ 6 తర్వాత రాజీనామా అన్నది డ్రామా అని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు త్వరగా జరపాలని ఆలోచిస్తోంది. ఎన్నికలకు పది నుంచి ఆరునెలల వ్యవధి ఉంటే ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ఆమోదించదని తెలిసే ఆయన ఈ డ్రామా మాటలు చెపుతున్నారని తెలిపారు. జగనే మాయ, ఆయన బతుకే మాయ అని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా వస్తే ఆదాయపన్ను కట్టాల్సిన అవసరం లేదని జగన్ తెలపడం ఆయన మాయ తనానికి పరాకాష్ట అని చెప్పారు. ఇంతలా ప్రజల్ని మభ్యపెట్టాలని చూడటం కన్నా దారుణం మరేదైనా ఉంటుందా అని ప్రశ్నించారు. ఆయన వ్యాపారంలో దిట్ట కావచ్చు కాని రాజకీయాలకు ఏ మాత్రం పనికిరారని అన్నారు. ఆయన ధ్యాస అంతా ముఖ్యమంత్రి కావాలనే, దీనికితోడు ఇప్పుడు అమ్మను, సోదరిని కర్ణాటక, తెలంగాణలకు ముఖ్యమంత్రులను చేయాలనే యావ మొదలెయ్యిందని తెలిపారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాలకు ఏ మాత్రం అవసరం లేదని పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ఫలితం జగన్ పార్టీకి ప్రజల్లో ఆదరణ లేదన్నది స్పష్టం చేసిందని మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. మేం రాజీనామాలు స్పీకర్ ఫార్మెట్లోనే ఇచ్చాం. ఇప్పుడీ విషయం సుప్రీంకోర్టులో ఉన్నందున స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని అన్నారు. అయినా నంద్యాల ఉప ఎన్నిక ఫలితం ఈ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష ఏమిటన్నది తెలిపాక ఉప ఎన్నికలు అవసరమా అని ప్రశ్నించారు. ఉప న్నికల వల్ల రాష్ట్ర ప్రగతికి ఆటంకమే తప్ప మరే ఉపయోగం అయినా ఉంటుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం అన్నది గుర్తించాలని, తామేమి ఉప ఎన్నికలకు భయపడటం లేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి కంటే ముందు తామే కేంద్ర బడ్జెట్ పై అసంతృప్తి, నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేంద్రం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి సాధనకు తమ కృషి ఉంటే ఆయన లాబీలతో కాలం గడుపుతున్నారని, ఇప్పుడు ఏవేవో చెపుతున్నారని పేర్కొన్నారు. ఆయన పార్టీ ఎం.పి ల రాజీనామా ప్రకటనలో రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి ఉన్నారో లేదో తెలియదని, ఆయన జగన్ క్విడ్ ప్రో కేసుల్లో ఏ2 అని గుర్తుచేశారు. ఈ కేసులనుంచి ఎలా బయటపడాలని లాబీలు చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రపతి ఎన్నికల్లో భా.జ.పా అభ్యర్థి అత్యధిక మెజార్టీ సాధించింది చూసి ఉపరాష్ట్రపతి ఎన్నికకు జగన్ మద్దతు ప్రకటించారని, ఈయన మద్దతు అవసరం లేదని తెలిసీ డ్రామా ఆడారని ఎద్దేవా చేశారు. జగన్ మాటల్ని రాష్ట్ర ప్రజలు విశ్వసించరని పేర్కొన్నారు.



ఇది నా వ్యక్తి గత అభిప్రాయం: ఆదినారాయణ రెడ్డి

మార్చి 5 లోగా కేంద్రం నుంచి రాష్ట్రానికి 19 అంశాల ప్రత్యేక ప్యాకేజి అమలుకు తగు చర్యలను పేర్కొనని పక్షంలో కేంద్రం నుంచి తమ మంత్రులు వైదొలగి, భా.జ.పా తో మైత్రీ కటీఫ్ ప్రకటించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయం అన్నారు .గురువారం జరిగిన సమన్వయ కమిటీ లో విషయాలను క్రోడీకరించి ,నా అభిప్రాయాలను తెలియజేస్తున్నారు.ఈవ్యాఖ్యల పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేయటంతో ఇది తన సొంత అభిప్రాయంగా మరల మీడియా ముందు తెలిపారు.

ఇక అమ్మాయిల వంతు..!

టీ 20 సిరీస్‌పై కన్నేసిన హర్మన్ సేన



ఈస్ట్ లండన్(దక్షిణాఫ్రికా) : దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్‌ను గెలవడంతో పాటు మొదటి టీ 20లో గెలిచిన భారత మహిళల జట్టు.. అదే ఊపును రెండో టీ 20ల్లో కూడా కొనసాగించాలని భావిస్తోంది. ఐదు టీ 20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో భారత జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. దాంతో రేపటి మ్యాచ్‌లో విజయం సాధించి ఆధిక్యాన్ని పెంచుకోవడంపై భారత జట్టు దృష్టి సారించింది. శుక్రవారం ఈస్ట్ లండన్‌లో బఫెలో పార్క్ స్టేడియం వేదికగా ఇరు జట్ల మధ్య రెండో టీ 20 జరుగనుంది. సాయంత్రం 4.30 ని.లకు ఆరంభం కానున్న మ్యాచ్‌లో సైతం గెలిచి సిరీస్‌లో పైచేయి సాధించడానికి హర్మన్ ప్రీత్ కౌర్ సేన కసరత్తులు చేస్తోంది. తొలి టీ 20లో దక్షిణాఫ్రికా విసిరిన 165 పరుగుల లక్ష్యాన్ని భారత మహిళలు 18.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించారు. మిథాలీ రాజ్(54 నాటౌట్), వేదా కృష్ణమూర్తి(37 నాటౌట్), స్మృతీ మంధన(28), రోడ్రిగ్యూస్(37)లు రాణించి జట్టుకు సునాయస విజయాన్ని అందించారు. ఇది భారత్ జట్టుకు అత్యధిక ఛేదన కావడం ఇక్కడ మరో విశేషం. దాంతో రెండో టీ20లో భారత జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

ఐపీఎల్ తరహా సీపీఎల్

టోరెంటో : ఇండియా, పాకిస్థాన్, కరేబియన్ సంతతి వ్యక్తులతో కెనడా జనాభా పెరగడంతో అక్కడ క్రికెట్‌పై ఆసక్తి పెరిగింది. ఐపీఎల్ తరహాలోనే అక్కడ కూడా కెనడా ప్రీమియర్ లీగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. భారత సంతతి వ్యాపారవేత్త రాయ్ సింగ్ ఈ క్రికెట్‌లీగ్‌ను ప్రారంభించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ మేరకు తన ఆలోచనలను మీడియాతో పంచుకున్నారు. 'ఇండియన్ ప్రీమియర్ లీగ్ విజయవంతకావడం చూశాను. ఇట్లాంటిదే కెనడా, అమెరికాలో ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను. దీనికి సరియైన మౌలిక సదుపాయాలు అవసరం. వాటిని సమకూర్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాను. నయాగారా జలపాతానికి కొద్ది దూరంలోనే 153 ఎకరాల భూమి కొంటున్నాం. అక్కడే ఇండోర్ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలెట్టాం.' 'ఇది ఖర్చుతో కూడుకున్న విషయం. కెనడా ప్రీమియర్ లీగ్‌లో ఏటా 27 మ్యాచ్‌లు జరుగుతాయి. మొత్తం 10 టీంలను రెండు గ్రూపులుగా విభజిస్తాం. క్రికెట్‌ను అభిమానించే, ఇష్టపడే వ్యాపారవేత్తగా టీ20 క్రికెట్‌ను పెద్ద వ్యాపారంగా చూస్తున్నాను. ఐపీఎల్ తరహాలో మ్యాచ్ బ్రాడ్‌కాస్టింగ్, అభిమానులను స్టేడియానికి రప్పించడం వంటివి ఖర్చుతో కూడి విషయాలు. టికెట్లు, స్పాన్సర్‌షిప్‌లు, ప్రొమోషన్స్, బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ఆదాయం పొందవచ్చు.' 'ఒక్క అమెరికాలోనే 27 మిలియన్ల మంది ప్రీమియర్ లీగ్ చూస్తారని అంచనా ఉంది. ఈ లీగ్‌ను ఇండియా, కరీబియన్‌తో పాటు క్రికెట్ చూసే అన్నిదేశాలలో బ్రాడ్‌కాస్టింగ్ చేస్తాం. నాకు వివ్ రిచర్డ్స్, రిచీ రిచర్డ్‌సన్, క్లైవ్ లాయిడ్, దినేష్ రాందిన్, డ్వేన్ బ్రావో తెలుసు. వాళ్లందరినీ తీసుకువచ్చి కెనడియన్ ప్రీమియర్ లీగ్‌ను ప్రొమోట్ చేస్తా. కెనడాలో మొదటి టీ20 మ్యాచ్ 2008 మేలో జరిగింది.' 'నిజానికి క్రికెట్ చరిత్రలో మొదటి టెస్టు మ్యాచ్ 1844, సెప్టెంబర్ 25న జరిగింది. మూడు రోజుల పాటు కెనడా, అమెరికా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కెనడా 23 పరుగుల తేడాతో గెలిచింది. కానీ క్రికెట్ రికార్డులో ఈ విషయం నమోదు కాలేదు. అధికారికంగా 1877 సంవత్సరం మెల్‌బోర్న్‌లో ఇంగ్లాండ్, ఆసీస్ జట్ల మధ్య జరిగింది. 150 సంవత్సరాల క్రితం వరకూ కెనడా అధికార క్రీడ క్రికెట్.. స్పోర్ట్స్ గవర్నింగ్ బాడీ నుంచి క్రికెట్‌ను తొలగించే వరకూ. కెనడియన్ క్రికెట్ అసోసియేషన్ 1892లో ఏర్పాటు అయింది. 2008లో కెనడియన్ ప్రభుత్వం ఒక జాతీయ క్రీడగా క్రికెట్‌ను గుర్తించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని' అని రాయ్ సింగ్ వివరించారు.

భారత్ నిరాశ పరిచింది: పొలాక్



పోర్ట్ ఎలిజబెత్ : సఫారీ గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ గెలిచి సంబరాల్లో మునిగితేలుతున్న టీమిండియాపై దక్షిణాఫ్రికా బౌలింగ్ గ్రేట్ షాన్ పొలాక్ అసహనం వ్యక్తం చేశాడు. వన్డే సిరీస్ గెలిచామన్న ఆనందం టీమిండియాలో ఉంటే ఉండొచ్చుకానీ, టెస్టు సిరీస్ విజయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే బాగుంటుందనేది ఈ సందర్భంగా పొలాక్ పేర్కొన్నాడు. తమతో టెస్టు సిరీస్‌కు పర్యాటక జట్టయిన టీమిండియా సరైన ప్రాధాన్యాలు లేకుండా బరిలోకి దిగడం తనను తీవ్రంగా నిరాశ పరిచిందన్నాడు. 'టీమిండియా బ్యాటింగ్ చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. భారత్ బ్యాటింగ్ లైనప్ చూస్తే దక్షిణాఫ్రికాకు కష్టమే అనుకున్నా. అయితే సీన్ రివర్స్ అయింది. టెస్టుల్లో భారత్ నిరాశ పరిచింది' అని పొలాక్ అన్నాడు. టెస్టు సిరీస్‌కు ముందు ప్రాక్టీస్ కోసం మరింత సమయాన్ని టీమిండియా కేటాయిస్తే బాగుండేదన్నాడు. ఇంగ్లండ్ టూర్‌కు వెళ్లే ముందు పలువురు ఆటగాళ్లు అక్కడ కౌంటీ గేమ్స్ ఆడుతుంటారని, అప్పుడు అక్కడి పరిస్థితులకు తగినట్టుగా అలవాటుపడిపోవచ్చని అన్నాడు. కాగా, కెప్టెన్‌గా టీమ్‌లో ఆత్మవిశ్వాసం నింపేందుకు కోహ్లి ప్రయత్నిస్తున్నాడని పొలాక్ అన్నాడు. కోహ్లికి జట్టులోని సభ్యుల సహకారం వల్లే వన్డే సిరీస్‌ను టీమిండియా నెగ్గిందన్నాడు. ప్రత్యర్థిని ఎలా గౌరవించాలో మాల్కం మార్షల్ తనకు నేర్పాడని, దాంతో పాటే ఆత్మ విశ్వాసమూ ఎంత ముఖ్యమో బోధించాడని పొలాక్ అన్నాడు. టీమ్‌లో ఆత్మవిశ్వాసాన్ని ఎల్లవేళలా ఉంచేందుకే కోహ్లి దూకుడుగా ఉంటాడని పొలాక్ విశ్లేషించాడు.

హాకీ టీం స్పాన్సర్‌గా ఒడిశా

చరిత్రలో ప్రభుత్వం స్పాన్సర్ చేయడం ఇదే ప్రథమం



భువనేశ్వర్ : జాతీయస్థాయి పురుషుల, మహిళల హాకీ టీంకు తమ ప్రభుత్వం ఐదేళ్లపాటు స్పాన్సర్‌గా ఉంటుందని ఒడిశా ప్రభుత్వం గురువారం ప్రకటించింది. జాతీయ స్థాయి హాకీ టీంను ఓ ప్రభుత్వం స్పాన్సర్ చేయడం ఇదే ప్రథమం. దీనికి సంబంధిచి రాష్ట్ర చరిత్రను ప్రతిబింబించేలా ఉండే లోగోలు ఉన్న పరుషుల, మహిళల జర్సీలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీలో జరగ్గా టీమిండియా ప్లేయర్లు, ఎఫ్ఐహెచ్, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేంద్ర ధారువ్ బాత్రా, హాకీ దిగ్గజాలు దిలీప్ టిర్కే, ధన్‌రాజ్ పిళ్లై, విరేన్ రాస్క్విన్హా పాల్గొన్నారు. 'ఇండియన్ హాకీ టీంతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఒడిశాలో హాకీ అంటే ఆట కన్నా ఎక్కువ. మా జీవితంలో ఓ భాగం, గిరిజన తండాల్లో చిన్నారులు హాకీ కర్రలు పట్టుకుని నడుస్తుంటారు' అని పట్నాయక్ తెలిపారు. భారత హాకీ చరిత్రలో ఒడిశా చరిత్ర సృష్టిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వం తన పరిధిలో ఓ ఆటను ఈ విధంగా ప్రమోట్ చేయడం ఇప్పటి వరకూ ఎక్కడా జరగలేదు. ఇది జాతికి ఒడిశా ప్రభుత్వం ఇస్తున్న కానుక' అని తెలిపారు. ఈ సందర్భంగా హాకీ ఇండియా ప్రెసిడెంట్ మరియమ్మ కోషి మాట్లాడుతూ 'భారత హాకీని కొత్తపుంతలు తొక్కిస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాం. 2018 హాకీ వరల్డ్ కప్‌తో మరో కొత్త అధ్యాయం మొదలవుతుంది. ఒడిశా ప్రభుత్వంతో కలిసి పనిచేయడం మాకు మరింత గౌరవం' అని పేర్కొన్నారు.

పాంచ్ పటాకాకు రెఢీ..!



జోరుమీదున్న కోహ్లిసేన

ప్రయోగాలకు సిద్ధమవుతున్న వైనం

శ్రేయస్, చాహల్‌లకు విశ్రాంతి..?

జట్టులోకి అక్షర్, శార్దూల్..?

సెంచూరియన్: గతంలో ఆరుసార్లు దక్షిణాఫ్రికాలో పర్యటించినా ఒక్క వన్డే సిరీస్‌లో కూడా విజేతగా నిలవలేకపోయిన టీమిండియా.. ఈసారి విరాట్ కోహ్లి నేతృత్వంలో సగర్వంగా ఒడిసిపట్టుకుంది. అది కూడా 4-1 తేడాతో సిరీస్ గెలిచి సఫారీలకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. దాంతో దక్షిణాఫ్రికాపై వారి దేశంలో ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధికంగా మ్యాచ్‌లు గెలవడంతో పాటు ఆ జట్టు నుంచి నంబర్ వన్ ర్యాంకును సొంతం చేసుకుంది. ఇప్పుడు మరో విజయం కన్నేసిన టీమిండియా వన్డే సిరీస్‌కు అదిరిపోయే ముగింపు ఇవ్వాలని భావిస్తోంది. అదే సమయంలో మూడు టీ 20ల సిరీస్‌కు ఘనంగా సన్నద్ధం కావాలని యోచిస్తోంది. భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరిదైన ఆరో వన్డే శుక్రవారం జరుగనుంది. సెంచూరియన్ వేదికగా సాయంత్రం గం. 4.30ని.లకు(భారత కాలమాన ప్రకారం) మ్యాచ్ ఆరంభం కానుంది. టీమిండియా వరుసగా డర్బన్, సెంచూరియన్, కేప్‌టౌన్ వన్డేల్లో విజయం సాధించి ముందుగానే సిరీస్‌పై పట్టుసాధించింది. అయితే జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా పరాజయం పాలైంది. వర్షం కారణంగా డక్ లూయిస్ పద్ధతి ప్రకారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఓడిపోయింది. దాంతో పోర్ట్ ఎలిజబెత్‌లో వన్డేపై ఆసక్తి నెలకొంది. కాగా, టీమిండియా 73 పరుగుల తేడాతో గెలుపొంది సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకుంది. ఫలితంగా రెట్టించిన ఉత్సాహంతో భారత జట్టు నామమాత్రపు ఆఖరి వన్డేకు సిద్ధమవుతుండగా, దక్షిణాఫ్రికా మరో గెలుపును సొంతం చేసుకుని పరువు నిలుపుకోవాలని భావిస్తోంది.

ప్రయోగాలపై దృష్టి!

దక్షిణాఫ్రికా గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా ప్రయోగాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. దాంతో నేటి మ్యాచ్‌లో భారత జట్టులో స్వల్ప మార్పులు చోటు చేసుకోవడం దాదాపు ఖాయంగానే కనబడుతోంది. ఆరో వన్డేలో రిజర్వ్ బెంచ్ బలం పరీక్షించాలని కెప్టెన్ విరాట్ కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రి భావిస్తున్నారు. దాంతో అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకూర్‌లు తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే శ్రేయస్ అయ్యర్, చాహల్‌లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది.

మరో రికార్డు సాధిస్తారా!

భారత జట్టును మరో రికార్డు ఊరిస్తోంది. ఈ సిరీస్ ముందు వరకూ సఫారీ గడ్డపై ఒక సిరీస్‌లో అత్యధికంగా రెండు వన్డేలు(రెండు సందర్భాల్లో మాత్రమే) గెలిచిన టీమిండియా.. తాజా సిరీస్‌లో ఐదో వన్డే విజయంపై కన్నేసింది. ఆఖరి వన్డేను విజయంతో ముగిస్తే సఫారీలపై వారి గడ్డపై అత్యధిక వన్డే విజయాలు సాధించిన తొలి భారత జట్టుగా విరాట్ సేన నిలుస్తుంది. అదే క్రమంలో విదేశీ ద్వైపాక్షిక సిరీస్‌లో ఐదు వన్డేలను మూడోసారి మాత్రమే గెలిచిన అరుదైన ఘనతను సొంతం చేసుకుం టుంది. అంతకుముందు 2013లో జింబాబ్వేతో వారి గడ్డపై ఐదు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. 2017లో శ్రీలంకతో వారి దేశంలో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను కూడా వైట్‌వాష్ చేసింది. ఈసారి సఫారీలపై ఐదు వన్డేలు గెలిచే అవకాశం రావడంతో మరి దాన్ని టీమిండియా సాధిస్తుందో.. లేదో చూడాలి.

తుది జట్లు(అంచనా)

భారత్.. విరాట్ కోహ్లి(కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్యా రహానే, ఎంఎస్ ధోని, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్, బూమ్రా, శార్దూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా.. మర్‌క్రామ్(కెప్టెన్), హషీమ్ ఆమ్లా, డుమినీ, డేవిడ్ మిల్లర్, ఏబీ డివిలియర్స్, మోర్నీ మోర్కెల్, ఎన్‌గిడి, రబడా, ఫెహ్లుకోవాయో, షమ్సీ, క్లాసెన్

ఈ సిరీస్ చాలా ముఖ్యం



ఢాకా: ఇటీవల పేలవమైన ఫామ్‌తో సతమవుతున్న శ్రీలంక క్రికెట్ జట్టు.. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను 1-0తో గెలుచుకుంది. తొలి టెస్టు మ్యాచ్‌ను డ్రా చేసుకున్న లంకేయులు.. రెండో టెస్టులో 215 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలోనే రెండు ట్వంటీ20ల సిరీస్‌కు శ్రీలంక సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా లంక ఆటగాడు ఉపుల్ తరంగా మాట్లాడుతూ.. టెస్టు సిరీస్‌లో ప్రదర్శననే టీ 20 సిరీస్‌లో కూడా పునరావృతం చేస్తామంటున్నాడు. 'టెస్టు సిరీస్ గెలుపు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతోనే టీ 20 సిరీస్‌కు సన్నద్ధమవుతున్నాం. ఈ సిరీస్ మాకు చాలా ముఖ్యం. దాదాపు ఏడాదిన్నర కాలంగా మా జట్టులో నిలకడ లోపించింది. మేం నిలకడను అందిపుచ్చుకోవాలంటే బంగ్లాతో టీ 20 సిరీస్ సాధించడం ఎంతో అవసరం. సిరీస్‌ను గెలుస్తామని ఆశిస్తున్నా' అని తరంగా పేర్కొన్నాడు. ఢాకాలో వికెట్ ఎలా ఉండబోతుందనేది కచ్చితంగా చెప్పలేమని తెలిపిన తరంగా..మంచి వికెటే ఎదురవుతుందని భావిస్తున్నట్లు తెలిపాడు.

శత్రుదేశానికి రాచమర్యాదలు

సియోల్: దక్షిణ కొరియా ఆతిథ్యం చూసి ఉత్తర కొరియాకు మతిపోతోంది. దొరుకునా.. ఇటువంటి ఆతిథ్యం అంటూ మురిసిపోతోంది. శత్రుదేశమని తెలిసి కూడా రాచ మర్యాదలు చేయడంపై ఉబ్బితబ్బిబ్బవుతోంది. వింటర్ ఒలింపిక్స్ పాల్గొనేందుకు వచ్చిన ఉత్తర కొరియా ఆటగాళ్లకు ఏ లోటూ లేకుండా.. దక్షిణ కొరియా సకల ఏర్పాట్లు చేసింది. ఖరీదైన హోటళ్లలో వారిని ఉంచింది. 22 అథ్లెట్లతో వచ్చిన 229 ఉల్లాసినులకు కూడా సకల వసతులు కల్పించింది. వాళ్లతో పాటు వచ్చిన సిబ్బందికీ ఏ లోటూ లేకుండా చూసుకుంటోంది. తాజాగా ఉత్తరకొరియా బృందానికి రానూ.. పోనూ ఖర్చులను మొత్తం తామే భరించాలని దక్షిణ కొరియా నిర్ణయించింది.

సుధామా ప్రీమియర్ లీగ్‌కు బీసీసీఐ నో

న్యూఢిల్లీ : అనుమతి ఇవ్వని 'సుధామా ప్రీమియర్ లీగ్'కు తమ ఆటగాళ్లను పంపితే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీసీసీఐ తన అనుబంధ సంఘాలను హెచ్చరించింది. ఈ టోర్నమెంటును కపిల్‌దేవ్, డీడీసీఏ సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ అతుల్ వాసన్ సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ ఆటగాడు సంజీవ్ శర్మ, ఇంటర్నేషనల్ మాజీ అంపైర్ కె హరిహరన్ కూడా పాల్గొంటున్నారు. ఈ మ్యాచ్‌లను ఫిరోజ్‌షా కోట్లా స్టేడియంలో నిర్వహించ తలపెట్టనున్నారు. అయితే ఇందుకోసం బీసీసీఐ అనుమతులు మంజూరు చేయలేదు. ఈ సందర్భంగా బీసీసీఐ సెక్రటరీ అమితాబ్ చౌధురి బీసీసీఐ అనుబంధ సంఘాలకు ఓ లేఖ రాశారు. 'సుధామా ప్రీమియర్ లీగ్'కు బీసీసీఐ ఎలాంటి అనుమతులూ మంజూరు చేయలేదు. అనుమతులున్న ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులు, స్కోరర్, వీడియో ఎనలిస్టులకు ఈ విషయం తెలియజేయండి' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. దీనిపై అతుల్ వాసన్‌ను ప్రశ్నించగా 'బీసీసీఐ సర్క్యులర్ గురించి నాకు తెలియదు. నిర్వాహకులకు మేలు చేయడం కోసమే దీన్ని నిర్వహిస్తున్నాం. ఒకవేళ బీసీసీఐ టోర్నమెంటు నిర్వహణకు అనుమతులిస్తే నేను మాత్రం ఉండను' అని తెలిపాడు. బీసీసీఐ పేరోల్స్ జాబితాలో కపిల్‌దేవ్ లేడు. కానీ సంజీవ్ శర్మ మాత్రం కొన్నేళ్ల క్రితం ఢిల్లీ రంజీట్రోఫీకి కోచ్‌గా, మ్యాచ్ రిఫరీ పరీక్షకు కూడా హాజరయ్యాడు. 34 వన్డేలు, 2 టెస్టుల్లో హరిహరన్ అంపైర్‌గా పనిచేశాడు. ఈ సుధామా ప్రీమియర్ లీగ్‌ను 'ప్రసార్' (పీపుల్స్ రైట్ అండ్ సోషల్ రీసెర్చ్ సెంటర్) పేరున ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తోంది.

వరల్డ్‌కప్‌కు జడేజా, అశ్విన్.. డౌటే..! : వాసన్



న్యూఢిల్లీ : భారత సీనియర్ స్పిన్నర్ల ద్వయం జడేజా, అశ్విన్‌ను వచ్చే వరల్డ్ కప్‌లో ఆడే ఛాన్స్ లేదని భారతీ మాజీ పేస్ బౌలర్ అతుల్ వాసన్ జోస్యం చెప్పాడు. దక్షిణాఫ్రికాలో టీమిండియా వన్డే సిరీస్ నెగ్గడం, ఆ మ్యాచ్‌లో మణికట్టు మాంత్రికులు చాహల్, కుల్దీప్‌లు రాణించడంతో మరోసారి వీరిద్దరి అంశం తెరపైకి వచ్చింది. 'వారంటే అభిమానమున్న వాళ్లు వారికి అవకాశం ఉంటుందని చెప్పొచ్చు. కానీ చాహల్, కుల్దీప్‌లలో ఎవరో ఒకరు గాయపడితే తప్ప అశ్విన్, జడేజాలకు అవకాశం వచ్చే ఛాన్స్ లేదు' అని పేర్కొన్నాడు. కుల్దీప్, చాహల్‌లకు టీం మేనేజ్‌మెంట్ అవకాశాలు ఇవ్వాలని పలువురు నిపుణులు సలహాలిస్తున్న నేపథ్యంలో ఇటీవల భారత బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ఓ ప్రకటన చేశాడు. వరల్డ్‌కప్ టీం రేసులో జడేజా, అశ్విన్‌లు ఉన్నారని తెలిపాడు. అయితే మణికట్టు మాంత్రికులిద్దరికీ టీమిండియా కోచ్ విరాట్ కోహ్లి అండ పుష్కలంగా ఉంది. చాహల్-కుల్దీప్‌ల ప్రదర్శన చూసిన అనంతరం డీడీసీఏ సెలక్షన్ కమిటీ చైర్మన్ అతుల్ వాసన్ మాట్లాడుతూ వరల్డ్‌కప్ ముందు టీం మేనేజ్‌మెంట్ వారిద్దరకూ 50 మ్యాచ్‌ల వరకూ అవకాశాలు ఇచ్చి పరీక్షించాలని సూచించాడు.

ఆజాద్ ఎన్‌కౌంటర్ 29మంది పోలీసులపై కేసు



విశాలాంధ్ర- ఆదిలాబాద్ : మావోయిస్టు నేత ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో ఆదిలాబాద్ జిల్లా సెషన్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మంది పోలీసులపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. వారిపై దర్యాప్తు చేయాలని సూచిం చింది. 2011, జూలై 2న ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ నేత చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్‌తో పాటు జర్నలిస్టు హేమచంద్రపాండేను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఆజాద్, హేమచంద్ర పాండేను సజీవంగా పట్టుకొని ఆదిలాబాద్‌లో హత్య చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌పై హక్కుల సంఘాలు పలుమార్లు ఆందోళనలు కూడా చేశాయి. కోర్టు వెలువరించిన తీర్పుపై ఆజాద్ భార్య పద్మ హర్షం వ్యక్తంచేశారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులకు శిక్ష పడుతుందని ఆశిస్తున్నానన్నారు. ఈ తీర్పుతో న్యాయవ్యవస్థపై నమ్మకం బలపడిందని చెప్పారు.

ఇరాన్ అధ్యక్షుడికి ఘన స్వాగతం



విశాలాంధ్ర బ్యూరో -హైదరాబాద్: ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రోహనీ గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయనకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, కేంద్ర విద్యుత్, ఇంధన శాఖ మంత్రి ఆర్‌పీ సింగ్, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఘన స్వాగతం పలికారు. హసన్ రోహనీ మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. శుక్రవారం చార్మినార్ వద్ద ఉన్న మక్కా మసీదులో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. అక్కడ మత పెద్దలతో సమావేశమవుతారు. గోల్కొండ కోట దగ్గర ఉన్న కుతుబ్‌షాహీ టూంబ్స్‌తో పాటు సాలార్ జంగ్ మ్యూజియంను రోహనీ సందర్శిస్తారు. 17న న్యూఢిల్లీలో ఆయనకు గౌరవ వందనం ఇవ్వనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నగర పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు సూచించారు.

బీవోసీ ద్వారా పింఛన్లు

- 19న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర నేతలు సూర్యారావు, వెంకట సుబ్బయ్య



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో 60ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు బీఓసీ(బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్) సంక్షేమ బోర్డు ద్వారా నెలకు రూ.3వేల పింఛన్లు ఇవ్వాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు పల్లా సూర్యారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. విజయవాడ హనుమాన్‌పేట బూరాడ సీతారామయ్య భవన్‌లో గురువారం యూనియన్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. వృద్ధుల పింఛను కోసం ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. చంద్రన్న బీమాలో వయోపరిమితిని ప్రభుత్వం 70 ఏళ్లకు పెంచిందని, భవన నిర్మాణ కార్మికులకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పల్లా సూర్యారావు మాట్లాడుతూ, చంద్రన్న బీమాకు కన్‌స్ట్రక్షన్ బోర్డు నుంచి రూ.315కోట్లు బదిలీచేసి, ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లించారని తెలిపారు. సంక్షేమ బోర్డులో కేంద్ర, కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వకుండా అధికార పార్టీ ప్రతినిధుల ద్వారా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈ ఆందోళనలో అన్ని జిల్లాల భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర కోశాధికారి సోనా రాజు, కృష్ణాజిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా వెంకట రమణ పాల్గొన్నారు.

డ్రోన్లతో మూసీ సర్వే : కేటీఆర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : మూసీనది అభివృద్ధి, సుందరీకరణ వంటి అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కె.తారకరామారావు ఆదేశించారు. మూసీనది మొత్తాన్ని సర్వే చేయాలని, ఇందుకోసం 40 కిలోమీటర్ల మేరకు డ్రోన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. మూసీనది, నగరంలోని చెరువుల అభివృద్ధిపై గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యక్రమాలపై ప్రధాన చర్చ జరిగింది. గతంలో ఉన్న శాటిలైట్ మ్యాపులతో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయాలని కేటీఆర్ సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం పరిశీలిస్తున్న మూసీనది వెంబడి రోడ్లపై మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుకూలంగా నదికి ఇరువైపులా రోడ్లు, నదిపై నుంచి ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే, రెండింటి కలయికతో కూడిన ప్రణాళికలను రూపొందించాన్నారు. వీటి కోసం అయ్యే ఖర్చు, సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న రోడ్లకు అనుబంధగా రూపకల్పన చేస్తున్న బ్రిడ్జిల డిజైన్లు, నిర్మాణం సైతం చారిత్రక, సంస్కృతికి అద్దంపట్టేలా ఉండాలన్నారు. నగంంలోని చెరువుల అభివృద్ధి ప్రణాళికలను మంత్రి సమీక్షించారు. అవుటర్ రింగ్‌రోడ్డు లోపల గల చెరువుల కోసం దీర్ఘకాలిక ప్రణాళిలు రూపొందించుకుని దశలవారీగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. చెరువులను అభివృద్ధి చేసేలోపల అవి కబ్జా కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.